# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 66 | హైదరాబాద్ | ఆదివారం 24-08-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి
: ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్

## నేటి భారతం

- ఓ కల, ఓ ఆశయం, ఓ పట్టుదల, ఓ ప్రయత్నం, ఓ విజయం..
- ఇవన్నీ యువత సొంతం.. వారే డ్రైవింగ్ ఫోర్స్..
- దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉంటుంది.
- దేశ యంగ్ బ్రెయిన్స్‌కి అంతర్జాతీయ గుర్తింపు ఉంది..
- యువత బాధ్యతతో ఉండాలి...
- తమ కుటుంబాలను, సమాజాన్నీ, దేశాన్నీ కాపాడాలి.
- ఏ దేశానికైనా ఉత్తమ వనరులు యువతే..
- యంగ్ ఎనర్జీలకు ఉత్సాహం ఇవ్వాలి..
- అనుకున్నది సాధించాలి..
- అడుగులు ముందుకు పడాలి..
- ప్రతి ప్రయత్నం సక్సెస్ రుచి చూడాలి..
- అందుకే మత్తుకు బానిసలు కాకండి..
- మెరుగైన సమాజానికి వెలుగు దివ్వెలు అవ్వండి..

*- బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్..*



# హైదరాబాద్‌లో విషం చిమ్ముతున్న డ్రగ్స్ సంస్కృతి..

నిరుద్యోగం.. రౌడీయిజం.. ఫారిన్ కల్చర్.. అదుపులేని సుఖాల అనుభూతి.. ఇలా ఎన్నెన్నో కారణాలు యువతను మత్తు వైపు మరలిస్తున్నాయి.. మత్తులో జోగుతూ మరో ప్రపంచంలో విహరిస్తున్నారు.. అంతులేని సుఖానుభూతులను అనుభవిస్తున్నారు.. వాస్తవజీవితానికి దూరంగా.. కన్నవారికి కడుపుకోతగా.. సమాజానికి చీడపురుగుల్లా బ్రతుకుతున్నారు.. యువత అంతా ఈ విధంగా ఉందని కాదు.. నూటికి 70 శాతం ఇదే పరిస్థితుల్లో జీవిస్తున్నారు.. మరో 10 శాతం మంది జీవితం మీద విరక్తితోనో.. చదివిన చదువుకు తగిన ఫలితం దక్కలేదనే మానసిక వ్యథతో మత్తుకు బానిసలవుతున్నారు.. ఇలాంటి వారిని టార్గెట్ గా చేసుకున్న కొన్ని ముఠాలు వారికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు.. బాగా సంపన్న కుటుంబాల నుంచి వచ్చేవారు విచ్చలవిడి తనానికి అలవాటుపడి ఎంతైనా చెల్లించి డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు.. పేదవర్గానికి చెందినవారు చౌకగా దొరికే గంజాయిని ఆశ్రయిస్తున్నారు.. ప్రభుత్వాలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ మత్తు ప్రపంచాన్ని చెదరగొట్టలేకుండా ఉన్నారు.. కారణం అవినీతి అధికారులు.. ఈ అధికారులకు తమ వంతు సహకారం అందిస్తున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వ పెద్దలు.. ఈ పద్ధతి మారాలని, యువత నిర్వీర్యం కాకూడదని పోరాటం సాగిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



- నిర్వీర్యం అయిపోతున్న యువత భవితవ్యం..
- రోజు రోజుకూ పెరిగిపోతున్న నేరాల శాతం..
- మత్తులో పడి మానవత్వం మరచిపోతున్న దౌర్భాగ్యం..
- అక్రమ సంపాదనకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న కొందరు..
- భవిష్యత్తు అంధకారమై బానిసలవుతున్న మరికొందరు..


12లో

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి..



11లో

- కాళేశ్వరంపై కమిషన్ నివేదిక ప్రకారం సీబీఐ విచారణ జరపాలన్న కిషన్ రెడ్డి
- హైదరాబాద్‌లో 4 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని ఆరోపణ
- రాష్ట్రానికి మరో 50 వేల టన్నుల యూరియా సరఫరాకు హామీ



## అంతరిక్ష రంగంలో 'ప్రైవేట్'కు ప్రధాని మోదీ భారీ టార్గెట్

- రాబోయే ఐదేళ్లలో 5 యూనికార్న్‌లు సృష్టించాలని పిలుపు
- ప్రస్తుతం ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాలను ఏటా 50కి పెంచాలని సూచన
- 11 ఏళ్ల సంస్కరణలతో 350 స్టార్టప్‌లు వచ్చాయన్న ప్రధాని
- సామాన్యుడి జీవితాన్ని స్పేస్ టెక్నాలజీ సులభతరం చేస్తోందని వెల్లడి
- త్వరలో గగన్‌యాన్, భారత సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

11లో



## హైదరాబాద్ వచ్చేయండి..

ఓపెన్ ఏఐ సీఈఓకు కేటీఆర్ ఆహ్వానం

- వచ్చే నెల భారత్ కు వస్తున్న ఓపెన్ ఏఐ సీఈవో

11లో

## "వదల బొమ్మాళీ" అంటున్న వైసీపీని భూస్థాపితం చేయాలి

- పెద్దాపురంలో సీఎం చంద్రబాబు పర్యటన
- వైసీపీ చేసేవి విష రాజకీయాలంటూ విమర్శలు
- ఫేక్ ప్రచారాలే వైసీపీ సిద్ధాంతం అని ఆగ్రహం

11లో



## జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి అవకాశమివ్వాలి


: పొన్నం ప్రభాకర్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలన్న మంత్రి

11లో

## మంచి మిత్రుడిని కోల్పోయాను

: బండారు దత్తాత్రేయ భావోద్వేగం



11లో

## అరెస్ట్ అయితే ఔట్...

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిస్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద ఆరెస్ట్ అయినా సరే... పదవి వదులు కోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు.ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతింటుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెలరోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ం చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి. లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ం జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ంంలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా.. దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది. బిల్లును చించి... హోంమంత్రిపైకి కూడా విసిరారు. ఇంత తీవ్రంగా వాళ్లు వ్యతిరేకించడానికి కారణం కూడా ఉంది.ఇది ప్రతిపక్షాలను అణగదొక్కే ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లు అని ఆ పార్టీలు అంటున్నాయి. అధికార పక్షం ఏదైనా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాకపోతే.. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని సీఎంలను మార్చేస్తారు.అరెస్టు అయిన వారు నేరస్తులు కాదు. నేరం నిరూపితం అయ్యే వరకూ నిందితులు అంతా నిర్దోషులే. 30రోజుల్లో ఆటోమేటిక్‌గా పదవి నుంచి తొలగించడం అంటే నేరం చేయకుండానే శిక్ష విధించడంకేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ పేట్రేగిపోతాయి. ఇప్పటికే.. వాటిని రాజకీయాల కోసం వాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ చట్టం వస్తే.. అది మరో రాజకీయ అస్త్రం అవుతుంది.ప్రభుత్వాలను అస్థిర పరచడం కోసం.. ఈ ఏజన్సీల ద్వారా అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపుతారు. ఈలోగా ప్రభుత్వాలను మార్చేస్తారు.

# డిసెంబర్ లో గగన్ యాన్

నెల్లూరు, ఆగస్టు 23,

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని రెడీ అవుతోంది. మరో మైలు రాయిని అధిగమించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. మిషన్ గగన్‌యాన్‌కు సంబంధించి ఇస్రో పెద్ద అప్‌డేట్ ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గగన్‌యాన్-జి1ని ప్రయోగించనున్నట్లు ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు.నాలుగు నెలల్లో ఈ రంగంలో అనేక విజయాలు సాధించామని నారాయణన్ అన్నారు. అటువంటి పరిస్థితిలో, ఈ ఏడాది చివరిలో, బహుశా డిసెంబర్‌లో మొదటి మానవరహిత మిషన్ జి1ను ప్రయోగించనున్నారు. అర్ధ-మానవుడిలా కనిపించే వ్యోమిత్ర కూడా అందులో ఎగురుతారని ఆయన అన్నారు. భారత్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. విజయవంతమైన ఆక్సియం-4 మిషన్ నుండి ఇటీవలే తిరిగి వచ్చిన శుభఆన్షు శుక్లా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అనుభవం భారతదేశ సొంత గగన్‌యాన్ మిషన్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.గగన్‌యాన్‌కు సంబంధించిన అనేక ప్రయోగాత్మక ప్రయోగాలను చేపట్టి విజయం సాధించింది. అందులో భాగంగానే అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే దిశలో ఇస్రో మరో అడుగు ముందుకు వేస్తోంది .ఈ నేపథ్యంలోనే గగన్‌యాన్ ఉ1 ప్రయోగాత్మక రాకెట్ ప్రయోగాన్ని 2025 చివరి మాసంలో తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుండి ఉ1 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. అదేవిధంగా ఈ గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి గగన్‌యాన్ ఉ1, గగన్‌యాన్ ఉ2, గగన్‌యాన్ ఉ3 లాంటి రాకెట్ ప్రయోగాలను కూడా 2026లో చేపట్టేందుకు ఇస్రో ఒక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.అలాగే 2027 వ సంవత్సరంలో గగన్‌యాన్ భారత్ తొలి మ్యాన్ మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఒక రోబోను తయారుచేసి ఈ రాకెట్ ప్రయోగంలో అమర్చి అంతరిక్షంలో పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. అంతరిక్షంలోకి మానవులను పంపే ముందుగా ఈ రోబోను పంపి అక్కడ వివిధ పరిశోధనలు చేసి, ఆ సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందజేస్తుంది. అంతరిక్షంలోకి పంపిన రోబో హిందీ, ఇంగ్లీష్ భాషలలో పరిశోధనలు చేసిన సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందిస్తుంది. అంతరిక్షంలోకి వెళ్ళాక అక్కడ వ్యోమగాములు ఎలాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకునే వీలు ఉంటుందన్న అంశాలపై కూడా ఈ రోబో అధ్యయనం చేసి శాస్త్రవేత్తలకు తెలియజేస్తుంది. గగన్‌యాన్ ప్రధాన ప్రయోగానికి ముందుగా అంటే 2027 లో రాకెట్ ప్రయోగంలో రోబోను అమర్చి ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. మ్యాన్ మిషన్ సక్సెస్ చేయడం అంటే భూమి నుంచి అంతరిక్షంలోకి వాహక నౌక వెళ్లడమే కాదు.. అంతరిక్షంలో పరిశోధనలు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి భూమి మీదకు క్షేమంగా రావడమే ప్రయోగం పూర్తి విజయంగా చూడాల్సి ఉంటుంది.ఇందుకోసమే ఇస్రో పూర్తి స్వదేశీ టెక్నాలజీతో గగన్‌యాన్ మిషన్ చేపడుతున్న సందర్భంలో ప్రతి దశను సొంతంగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టి అన్ని రకాలుగా పరీక్షలు చేపడుతోంది. అంతరిక్ష నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు వ్యోమగామిలు ప్రయాణించే క్యాప్సిల్ క్షేమంగా భూమి మీదకు తీసుకురావడం కూడా అత్యంత కీలకం.. కాబట్టి ప్రయోగాన్ని చేపట్టి భూమి నుంచి అంతరిక్షంలోకి వెళ్లడం మొదలు పరిశోధన పూర్తయ్యాక తిరిగి భూమి మీదకు క్షేమంగా వచ్చేవరకు అన్ని దశలను ఎప్పటికప్పుడు విజయవంతంగా పరీక్షలు చేపడుతోంది ఇస్రో.

# జగన్ జైలు రన్

## కొంత మందికే పరామర్శ

విజయవాడ, ఆగస్టు 23

అధికారం పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వివిధ కేసుల్లో జైలుకు వెళ్తున్నారు. వల్లభనేని వంశీ నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ చాలా మంది నేతలు జైళ్లకు వెళ్లారు. వారందర్నీ జగన్ ఆయా జైళ్లకు వెళ్లి పరామర్శించారు. పోసాని వంటి కొంత మందిని పరామర్శించలేదు. అదే సమయంలో లిక్కర్ స్కామ్ లో అరెస్టయిన వారెవర్నీ పరామర్శించలేదు. ఈ కేసులో అరెస్టు అయిన వారందరూ జగన్‌కు అత్యంత సన్నిహితులే. మిథున్ రెడ్డి .. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయనకు లిక్కర్ కేసుతో ఏం సంబంధం లేదని జగన్ పలుమార్లు ప్రెస్మీట్లలో చెప్పారు. అయితే సుప్రీంకోర్టులోనూ ఊరట లభించకపోవడంతో చివరికి రాజంపేట ఎంపీ అరెస్టు కావాల్సి వచ్చింది. కానీ జగన్మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ ఆయనను పరామర్శించలేదు. ఇరవై ఐదో తేదీన జగన్ .. మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు రాజమండ్రి వస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఒక్క రోజులోనే ఆ ప్రోగ్రాం క్యాన్సిల్ అయినట్లుగా బొత్స ప్రకటించారు. ఇక జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలను కూడా జగన్ పరామర్శించలేదు. వారిద్దరూ జగన్ కు అత్యంత సన్నిహితులు. ధనుంజయ్ రెడ్డి.. జగన్ సీఎంగా ఉన్న ఐదు సంవతర్సాల పాటు సీఎంవోలో చక్రం తిప్పారని అంటారు. అన్ని పనులు ఆయన చేతుల మీదుగానే జరిగేవని చెబుతారు. అలాంటి ధనుంజయ్ రెడ్డి అరెస్టు అయినా జగన్.. జైలుకు వెళ్లి పరామర్శించలేదు. కృష్ణమోహన్ రెడ్డి కూడా జగన్‌కు సన్నిహితులే. వీరిని కూడా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. లిక్కర్ కేసులో జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావన ఉంది. అసలు ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్దిదారుడు జగన్మోహన్ రెడ్డేనని సిట్ చెబుతోంది. ఇలాంటి సమయంలో లిక్కర్ కేసు నిందితుల్ని పరామర్శించకపోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉ ందంటున్నారు. వారిని పరామర్శిస్తే అందరూ కలిసి ప్లాన్ చేశారని.. అందుకే వారి కోసం జైలుకు వచ్చారని ప్రచారం జరిగే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. లాయర్లు, న్యాయనిపుణుల సూచనల మేరకే జగన్.. తనకు అత్యంత ఆత్మీయులు అయినప్పటికీ లిక్కర్ కేసు నిందితుల్ని జైలుకు వెళ్లి పరామర్శించడం లేదని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం జగన్మోహన్ రెడ్డి అందర్నీ బలి చేసి తాను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.

కోటరీ నుంచి బయటకు ఎప్పుడు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి పదమూడు నెలలు కావస్తుంది. ఈ పదమూడు నెలల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు ఏమైనా తీసుకున్నారంటే ఏమీ లేదనే చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు, హామీలు అమలు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం చేయడం మినహా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? అంటే శూన్యమే అని చెప్పాలి. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి నెలలో రెండు సార్లు రావడం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం కావడం మినహా మరే రకమైన కార్యక్రమాలను చేపట్టలేదు. ఇక రైతుల సమస్యలపై జిల్లాలకు వెళ్లి వారి బాగోగులను తెలుసుకోవడం, అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ నేతలను పరామర్శించడం వంటి వాటితో సరిపెట్టేశారు. ఇక ఓటమిచెందిన తొలి నాళ్లలో ముఖ్య కార్యకర్తలతో జగన్ ముఖాముఖి అని హడావిడి చేసినా ఒకటి రెండు జిల్లాలతోనే సరిపెట్టేశారు. అందులోనూ స్థానికసంస్థల ప్రతినిధులు అధికార పార్టీకి వెళ్లకుండా ఉండేందుకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాలు పెట్టి పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉ ంటుందని భరోసా ఇచ్చారు. నిజానికి 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత చంద్రబాబు ఊరికే కూర్చోలేదు. జిల్లాలను పర్యటించారు.నేరుగా జిల్లాలకే వెళ్లిన చంద్రబాబు నేతలు,కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇప్పుడు ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అని చెప్పి క్యాడర్ లో ధైర్యం నింపడంలో నాడు చంద్రబాబునాయుడు సక్సెస్ అయ్యారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఎలా ఉన్నారో.. కోల్పోయినప్పుడు కూడా అదే స్థాయిలో తాడేపల్లి పార్టీ కార్యాలయాన్ని వీడటం లేదు. పాదయాత్ర చేస్తారనని అంటున్నాఅందుకు చాలా సమయం ఉంది. కానీ అంతకంటే ముందుగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలి. జిల్లా కేంద్రాల్లో అన్ని నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు,నేతలను పిలిచి మాట్లాడాలి. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారి నుంచి తెలుసుకోవాలి. ఓపిగ్గా వినాలి. మరొకసారి అధికారంలోకి వస్తే అలాంటి తప్పులు దొర్లవన్నహామీ వారికి అక్కడే ఇవ్వగలిగాలి. అంతేకాని అధికారంలో ఉన్నప్పటి లాగానే కోటరీ మధ్య చిక్కుకుంటే పరిస్థితుల్లో మార్పు రాదన్న విషయం జగన్ గుర్తించాలన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి నేను ఉన్నాను.. నేను విన్నానంటూ జనం మధ్య నాడు వెళ్లినట్లే ఇప్పుడు క్యాడర్ మధ్యకు వైసీపీ చీఫ్ వెళ్లాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికునికి తలకు గాయం

భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు : 23

మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భ గనిలో పనిచేస్తున్న సింగరేణి కార్మికుడు హలావత్ భాస్కర్ శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీ కి వెళ్తున్న సమయంలో సింగరేణి మెయిన్ చెక్ పోస్ట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. టైర్ పంచర్ ఐ ఆగి ఉన్న టిప్పర్ ను తమ స్కూటీతో వెనుక నుండి ఢీకొనగా భాస్కర్ తలకు బలమైన గాయం కావడంతో గమనించిన కార్మికులు హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించగా సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స అనంతరం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ అక్కడి నుండి మరింత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కామినేని వైద్యశాలకు తరలించారని తెలిసింది. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ఏరియా ప్రాతినిధ్య సంఘం (ఐ ఎన్ టి యు సి) ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు ఇతర బ్రాంచ్ కమిటీ నాయకులు భాస్కర్ ను పరామర్శించి మెరుగైన వైద్యం అందేలా తమ పై నాయకులు త్యాగరాజన్ తో మాట్లాడి వారి ద్వారా సింగరేణి వైద్యులతో మాట్లాడినట్లు నాయకులు విలేకరులకు తెలిపారు. భాస్కర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాద తీవ్రతను తగ్గించిన హెల్మెట్.. ద్విచక్ర వాహన ప్రయాణంలో భాస్కర్ తలకు హెల్మెట్ ధరించడంతో ప్రమాద తీవ్రత తగ్గినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు భాస్కర్ తలకు హెల్మెట్ ధరించి ఉండకపోతే తలకు ఇంకా బలమైన గాయం అయ్యేదని హెల్మెట్ ప్రాధాన్యత గురించి కార్మికులు చర్చించుకోవడం విశేషం రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఏదైనా వాహనం మరమ్మతులకు గురైన సందర్భంలో రక్షణ చర్యలు చేపట్టాలని సింగరేణి యాజమాన్యాన్ని ఏరియా సేఫ్టీ డిపార్ట్మెంట్ అధికారులను కోరారు. సమయం కన్నా ప్రాణం విలువైనదని ద్విచక్ర వాహన చోదకులు, భారీ యంత్రాలు నడిపే డ్రైవర్లు కూడా తగు జాగ్రత్తలతో వాహనాలు నడపాలని పరువులు కార్మిక సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.

## బీసీల రిజర్వేషన్ పితామహుడు బిపి మండల్

( పెండ్యాల రామ్ కుమార్,మంథని )

వెనుకబడిన వర్గాల నుండి ఒక చదుకున్న వ్యక్తి తను వచ్చిన సమాజం అభివృద్ధి గురించి నిస్వార్థంగా , నిబద్ధతతో పని చేస్తే ఎలాంటి మార్పు ఉంటుందో ఉదాహరణే బీపీ. మండల్ జీవితం. బిందేశ్వరి ప్రసాద్ మండల్ భారతదేశ పార్లమెంటు సభ్యుడు, మాజీ బీహార్ ముఖ్యమంత్రి ,సంఘ సంస్కర్త. అతను రెండవ వెనుకబడిన తరగతుల కమీషన్ (మండల్ కమీషన్ గా సుపరిచితం) కు చైర్మన్ గా వ్యవహరించాడు. అతను ఉత్తర బీహార్ లోణి సహర్సా లో అత్యంత ధనుకులైన యాదవ్ జమిందారీ (భూస్వాములు) కుటుంబం లో నన్మించాడు. కమీషన్ భారతదేశంలోని ప్రజలలో ఒక భాగాన్ని "అదర్ బేక్ వర్డ్ క్లాసెస్"(ఓబీసీ) (ఇతర వెనుకబడిన కులాలు) గా నివేదిక ప్రకారం నివేదించింది. భారతీయ రాజకీయాల్లో తక్కువగా ఉ న్న, బలహీన వర్గాల కోసం పాలసీపై తీవ్రమైన చర్చ ప్రారంభమైంది. బి.పి. మండల్ ( బిందేశ్వరి ప్రసాద్ మండల్ ) బీహార్ లోని బనారస్ లోని ఒక యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని , దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930 లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.మండల్ తన 23 వయేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు. 1945-51 మధ్య కాలములో మాధేపుర డివిజన్ లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గా పని చేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షములో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965 లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షములో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్దమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి) లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు.1967 లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967 లో 69 సీట్లు వచ్చాయి. బీహార్లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేర్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వములో కొన్ని విబేధాలు రావడముతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ భాధ్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమీషన్ వేసి విచారణ చేయించాడు. ఆ కమీషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడముతో ప్రభుత్వముపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, "ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు" అని చెప్పే మండల్ తన ప్రభుత్వములో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.1967 మార్చి 5న అతను సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ ) ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నాడు. 1972 లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974 లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితంలో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పని చేసాడు.మండల్ కమీషన్ 1978 డిసెంబరులో మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులు గల పౌర హక్కుల కమీషన్ వేసాడు దీనిని మండల్ చర్మన్ గా వ్యవహరించాడు. అతని కమిషన్ నివేదిక 1980 డిసెంబర్ 31 లో పూర్తయింది. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒ.బి.సి) అభ్యర్థులకు రిజర్వు సీట్లను ఒక నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిపారసు చేసాడు. కమిషన్ నివేదిక ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పరిశీలనలోకి వచ్చింది. కానీ అమలు జరగలేదు. ఒక దశాబ్దం తరువాత ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఈ సిఫార్సులను ఆమోదించాడు.వ్యక్తిగత జీవితం అతను 1982 ఏప్రిల్ 13 న మరణించాడు. అతని భార్య సీతా మండల్. వారికి ఐదుగురు కుమారులు ఉన్నారు. వారు రవీంద్రనాథ్ యాదవ్, సచీంద్రనాథ్ యాదవ్, మణీందర్ కుమార్ మండల్, గిరీంద్రనాథ్ మండల్, జ్యోతీంద్రనాథ్ యాదవ్. అతనికి రేనూ సింగ్, వీణా మండల్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.భారత ప్రభుత్వం 2001లో అతని గౌరవార్థం ఒక పోస్టల్ స్టాంపును విడుదలచేసింది. 2007లో స్థాపించబడిన ఒక కళాశాలలు "బి.పి.మండల్ ఇంజనీరింగ్ కళాశాల" అని నామకరణం చేసారు.

## స్వచ్ఛాంధ్ర - స్వర్ణ ఆంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

### స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధిద్దాం.

### కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర లో ప్రజలందరూ భాగస్వాములు కావాలనీ, స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధనకు ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర ? స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాబు జగజ్జీవన్ రామ్ పార్కు నందు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రామ్ పార్కు లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహ ఆచారి అధికారులు పాల్గొని మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రామానాయుడు స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. వర్షపు నీరు నిల్వతో దోమలు పెరిగి చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. కాబట్టి వర్షపు నీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూడాలని ఆయన కోరారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డ్రైయిన్ లలో సిల్ట్ తీసే కార్యక్రమం క్రమం తప్పకుండా మున్సిపల్ సిబ్బంది చూస్తుందని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం ఒక నినాదంతో స్వచాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ నెల మాన్సూన్ హైజెనీ నినాదంతో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వర్షాలు రాక ముందే నగరంలోని కాలువల్లో చెత్త తొలగించడం, ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, జబ్బులు రాకుండా చేతులు కడుక్కోవడం, చెత్త కుప్పల తొలగింపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత తమ బాధ్యతగా ముందుకు సాగితే నగరం శుభ్రంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు ప్రతి చేతులు శుభ్రం చేసుకోవడం వలన అంటువ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చునని అన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం పట్ల మనం చూపించే బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరుపతి అభివృద్ధిలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందనీ జాతీయస్థాయిలో తిరుపతి స్వచ్ఛత కార్యక్రమంలో అవార్డు పొందిందని గుర్తు చేశారు, తుడా పరిధిలో మున్ముందు మరిన్ని పారిశుధ్య ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్చరికలతో సరా

విజయవాడ, ఆగస్టు 23,

మధ్యకాలంలో టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు చాలా ఎక్కువగా వాడుతున్న పదం నేను "95 నాటి చంద్రబాబుని.. ఎవరి అలసత్వాన్ని ఉపేక్షించను "అని. కానీ జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అప్పటి స్ట్రిక్ట్ చంద్రబాబు మళ్లీ కనబడడం కష్టమేనా అని అనుమానాలు వస్తున్నాయి. వరుస పెట్టి పార్టీ నాయకులు వివాదాల్లో చిక్కుకుంటున్నా కొంతమంది హద్దు దాటి ప్రవర్తిస్తున్నా చంద్రబాబు హెచ్చరికలు వరకు మాత్రమే పరిమితం అయిపోతున్నారా అన్న చర్చ పార్టీ వర్గాల్లో సైతం మొదలైంది. ఈ ఒక్క నెలలోనే టిడిపి నాయకులు నాలుగు పెద్ద వివాదాల్లో చిక్కుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా రిలీజ్ అవుతుంటే ఆ సినిమాను ఆడనివ్వం అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్ ప్రసాద్ హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆడియో రిలీజ్ అయింది. అందులో వాడిన దుర్భాషలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్ని తీవ్రంగా బాధపెట్టాయి. దానితో వాళ్ళు నిరసనలకి దిగారు. ఆడియో తనది కాదని ఎమ్మెల్యే ఎంత చెప్పినా చాలామంది అది ఆయనదే అని నమ్ముతున్నారు. చంద్రబాబు సైతం ఎమ్మెల్యేని పిలిపించి మందలించారు. కానీ ఇప్పటికీ ఆ వివాదం చల్లబడలేదు. నెల్లూరు అరుణ విషయం పార్టీ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది. ఆమె సన్నిహితుడు యావజ్జీవ ఖైదీ శ్రీకాంత్‌కి పెరోల్ లభించేలా ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అది అటు ఇటు తిరిగి ఏకంగా హోంశాఖకు అంటుకుంది. ప్రస్తుతం శ్రీకాంత్ తిరిగి జైలుకు వెళ్లిపోగా అరుణ కూడా అరెస్టు అయింది. దీనిపై హోంమంత్రి స్వయంగా మీడియాకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమను వేధిస్తున్నాడు అంటూ ఒక మహిళ మీడియా ముందుకు వచ్చారు. అసభ్యకరమైన వేధింపులు ఎదుర్కొన్నామని ఆరోపణలు చేశారు. దీని ఎమ్మెల్యే స్పందిస్తూ తనపై జరిగిన కుట్రగా ఖండించారు. ఇవన్నీ కూడా ఇండైరెక్టుగానో లేక ఆడియోలపరంగానో నేతలు వివాదాల్లో చిక్కుకున్నవి. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్ని పరిధిలూ దాటేశారు. విధుల్లో ఉన్న అటవీ సిబ్బందిపై తన అనుచరులతోపాటు దాడి చేసినట్టున్న విజువల్స్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిలో అటవీశాఖ డైరెక్ట్ గా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతిలో ఉంది. దీనితో ఆయన సీరియస్ అయ్యారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా ఎవరిని వదిలిపెట్టొద్దంటూ పోలీసులను ఆదేశించడంతో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఈ నాలుగు వివాదాలు ఒక్క నెలలోనే బయటపడడం అనేది ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలలో కొంతమంది ఎంత లెక్క చేయకుండా ప్రవర్తిస్తున్నారో అన్న నిజాన్ని బయటపెట్టింది. ఇలాంటి వివాదాలు వరుస పెట్టి బయటపడుతున్నా "చంద్రబాబు మండిపడ్డారు " "నేతల్ని హెచ్చరించారు " ఇలాంటి హెడ్డింగ్స్‌కి వార్తలు పరిమితం అవుతున్నాయి తప్ప ఆయన తనదైన శైలిలో యాక్షన్ తీసుకున్న సూచనలు కనిపించడం లేదు. 2024లో గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో అసభ్యకరమైన వీడియోలో కనిపించినందుకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు చంద్రబాబు. అలాంటి ఫైర్‌నే తెలుగు ప్రజలు చంద్రబాబు నుంచి ఎదురుచూసేది. నిజంగానే 1995-99 మధ్య చంద్రబాబు అంటే స్ట్రిక్ట్ పొలిటీషియన్, క్రమశిక్షణ కలిగిన అడ్మినిస్ట్రేటర్‌గా దేశవ్యాప్తంగా పేరు ఉండేది. ఆయన కూడా అది గమనించి "తాను 95మోడల్ చంద్రబాబు "గానే పని చేస్తానని పదేపదే చెబుతున్నారు. కానీ గ్రౌండ్ రియాల్టీ అలా కనిపించడం లేదన్న వాదన ఉంది. ఆయన మనసులో ఏముందో తెలియదు గానీ పార్టీ క్రమశిక్షణపరంగా సామాన్య తెలుగు ప్రజలు ఎదురుచూస్తున్న చంద్రబాబు పనితీరు ఇదైతే మాత్రం కాదు అనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# బదిలీల్లో కులం రంగులు

శ్రీకాకుళం, ఆగస్టు 23,

శ్రీకాకుళం జిల్లాలో వివాదాస్పదమైన ఓ కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ కొత్త మలుపు తిరిగింది. జిల్లాలో ఎప్పటి నుంచి నలుగుతున్న కళింగ వర్సెస్ వెలమ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బదిలీ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ శ్రీనివాస్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. కళింగ నాయకులను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం ప్రశాంతతకు మారు పేరు. అక్కడ రాజకీయం కూడా అంతే కూల్‌గా ఉంటుంది. వివాదాలు పెద్దగా ఉండవు. కానీ ఈ మధ్య కాలంలో అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. లోలుగు కేజీబీవీలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీ ఆయన మెడకు చుట్టుకుంది. ఆమెను కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడంతో వివాదం రాజుకుంది. తనపై కక్ష పూరితంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే తనను బదిలీ చేశారని ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపించారు. అంతే కాకుండా ఆమె ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. సౌమ్య ఆత్మహత్యాయత్నంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ దీన్ని తమకు అనుకూలంగా మార్చుకొని కూన రవికుమార్‌ను టార్గెట్ చేసింది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా ఉద్యోగులపై కక్షసాధింపులకు దిగుతున్నారని వైసీపీ అనుకూల మీడియా స్టోరీలు ప్రచురించింది. ఇప్పటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని ధర్మాన కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారు. కట్ చేస్తే సీన్‌లోకి వైసీపీ బహిష్కృత నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వచ్చారు. కూన రవికుమార్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని అలాంటి బదిలీల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉండే ఎవరైనా ఉద్యోగాల్లో చేరుతారని చెప్పుకొచ్చారు. కానీ సౌమ్య విషయంలో రాద్ధాంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పుకొచ్చారు. అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీపై దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు."జిల్లాలో వారం రోజులుగా ఒక ట్రాన్స్‌ఫర్ చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రాన్స్‌ఫర్ కోసం ఇంత రచ్చ జరగడం ఎప్పుడూ చూడలేదు. కలెక్టర్ చేసిన ట్రాన్స్‌ఫర్‌పై ఎందుకు రచ్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ సహజమే కదా. మరి ఇది ఎందుకు పొలిటికల్ వార్‌లా మారింది. కులాల ప్రస్తావన ఎందుకు వచ్చింది. దాడులు ఎందుకు జరుగుతున్నాయి? తటస్థ ఎమ్మెల్సీగా పరిశీలిస్తే చాలా విషయాలు వెలుగు చూశాయి. జిల్లావ్యాప్తంగా ఒక కులంపై దాడులు జరుగుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అటెండర్ నుంచి ఆర్టీవో వరకు ఒక కులం వాళ్లే ఉన్నారు. అది మంత్రి కులానికి చెందిన వారు. మిగతా కులాలపై వేధింపులు సర్వసాధారణమైపోయాయి. నియంత్రుత్వపాలన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. " అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళింగ కులానికి చెందిన నాయకులు ఎదుగుదల చూడలే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు దువ్వాడ శ్రీనివాస్. మంత్రి అచ్చెన్న చెప్పిన వెంటనే కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారని ఆరోపించారు. అచెన్న బాధితుడైన అధికారిని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఆయన ఏమన్నారంటే" మంత్రి అచ్చెన్న నిర్వాకం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనిముట్లు ఇచ్చే కంపెనీలతో డైరెక్ట్ మీటింగ్ పెట్టమని పేషీలో ఉన్న రాజమోహన్‌పై ఒత్తిడి తెచ్చారు. అది ఆయన చేయలేక ఒత్తిడి భరించలేక లెటర్ సెలవుపై వెళ్లిపోయారు. దీనిపై కృష్ణదాస్ ఏం చేస్తున్నారు. ఆయన్ని ఎందుకు పరామర్శించలేదు. అచ్చెన్న చెప్పాడని సౌమ్యను పరామర్శించారు. రాజమోహన్ అనుభవించింది మానసిక ఒత్తిడి కాదా... మంత్రి అచ్చెన్నపై విమర్శలు చేయరా. ఎందుకు ఒకే కులాన్ని టార్గెట్ చేస్తున్నారు." కులాన్ని టార్గెట్ చేస్తున్నారని తమ బుర్రల్లోకి వెళ్తే మాత్రం గేమ్ స్టార్ట్ చేస్తామని ధర్మాన, అచ్చెన్నకు వార్నింగ్ ఇచ్చారు దువ్వాడ. "ఎవడిపై రౌడీయిజం చేయాలని అనుకుంటున్నారు. ఇదే జరిగితే అది మా బుర్రల్లోకి ఎక్కింది అంటే మాత్రం కచ్చితంగా ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అచ్చెన్నకు వార్నింగ్ ఇస్తున్నాను. మేం గేమ్ స్టార్ట్ చేస్తాం. మరో ఉద్యమం ప్రారంభమవుతుంది. జాతికి నష్టం జరుగుతుంటే కచ్చితంగా నేను నిలబడతాను. ఆ జాతితోపాటు మిగతా కులాలను అన్నింటినీ ఏకం చేస్తాం. ప్రాణత్యాగాలు చేయడానికైనా సిద్ధం. కొందరు చీడపురుగులను వాడుకొని కులంలో చిచ్చు రేపాలని చూస్తారు. వారిని కూడా టార్గెట్ చేస్తాం. కళింగ జాగృతి కోసం ముందడుగు వేస్తాం. కళింగ కులస్తుడిని కాబట్టే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు దువ్వాడ. తాను ఉన్నన్ని రోజులు వారికి మునుగడ ఉండదనే ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయినా తాను వెనక్కి తగ్గబోనని అన్నారు. "నేను కళింగ కులానికి చెందిన వాడినని సస్పెండ్ చేశారు. స్పీడ్‌గా ఉంటానని సస్పెండ్ చేశారు. నేను ఉంటే వారి ఉనికి ఉండదని సస్పెండ్ చేశారు. నన్ను ఎదుర్కొని దమ్ము లేక సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి బట్టలు మడత పెట్టుకుంటానని అనుకున్నారు. కానీ రాజకీయాలలో మడతేయడానికి వచ్చాను. కులాన్ని వాడుకోవాలనుకుంటే ఎప్పుడో వాడుకునే వాడిని. ఇప్పుడు మాత్రం అన్ని కులాలను వాడుకుంటాను. అన్ని కులాలకు నాయకత్వం వహిస్తాను. కళింగ కులానికి అన్యాయం జరగడంతో ఇతర కులాలు కూడా నష్టపోతున్నాయి. అన్ని కులాలకు బాసటా ఉంటూ ముందు ఉండి నడిపిస్తాం. " అని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి..భర్తకు గాయాలు

ఏలూరు

జంగారెడ్డిగూడెం మండలం జొన్న వారిగూడెం షుగర్ ఫ్యాక్టరీ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పలరాజు గూడెం నుండి జంగారెడ్డిగూడెం ద్విచక్ర వాహనంపై వస్తున్న భార్య , భర్తల పైకి లారీ దూసుకువెళ్ళింది. ఘటనలో భార్య కృష్ణ కుమారి మృతి చెందగా భర్తకు గాయాలు అయ్యాయి. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించారు. పోలీసులు లారీని స్టేషన్ కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

హుస్నాబాద్

హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పర్యటించారు. హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. తరువాత రం ఆలయ ఈవో కిషన్ రావు ,ఇతర అధికారులతో కలిసి ఆలయ ఆవరణలో పెండింగ్ పనులను పరిశీలించారు. అమ్మవారి ఆలయం వద్దకు వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను ఆదేశించారు. తరువాత హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు పరిశీలించారు.

## పాఠశాలలపట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

హైదరాబాద్.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంబర్పేట లోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసారు.

కిషన్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పట్ల నిర్లక్ష్యం చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించారు. ప్రభుత్వాలు మారిన ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాలు మెరుగుపరడం లేదని అన్నారు. ప్రభుత్వ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు సరైన భోజనం అందుబాటులో లేదు. సమస్యల కోసం విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు . ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనాలు నిర్మించామన్నారు. మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ అన్నారు ఉన్న స్కూళ్లకు మరమ్మత్తులు విద్యుత్తు మంచి నీటి సౌకర్యం కల్పించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మిడ్ డే మిల్స్ ప్రాపర్ గా అందించాలని అన్నారు.

## హాస్టల్ నీటిలో మందు కలిపిన టీచర్ విద్యార్థులు ఆసుపత్రి పాలు

భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. అయనకు విద్యార్థులు విస్తుపోయి నిజాలు తెలిపారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నీటిలో మోనో మందు కలపడంతో కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని ఎమ్మెల్యేకు తెలిపారు. కొన్ని రోజులుగా తమని నానా రకాలుగా ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురిచేస్తున్నర ఎమ్మెల్యేకు తెలిపారు,. అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయుల మధ్య తరచూ జరుగుతున్న గొడవలు కారణం. దాంతో ఎమ్మెల్యే సంబంధిత ఉపాధ్యాయులపై శాఖపరమైన చర్యలకు ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నిన్నటి రోజున ఉదయం నీటిలో సైన్స్ టీచర్ రాజేందర్ మోనో మందు కలపాడని అనంతరం దానిని అనుమానం రాకుండా దుప్పట్లపై చల్లి అనుమానం రాకుండా చేశాడని, దుప్పట్లలో దాచి ఇచ్చిన మందు బాటిల్ మాకు దొరికిందని విద్యార్థులు తెలిపారు. ఈ విషయం ఎవరికైనా తెలిపితే మిమ్మల్ని కొడతా అని హెచ్చరించాడని, ఈ నేపథ్యంలో ఎవరికి అనుమానం రాకుండా అస్వస్థకు గురైన విద్యార్థులతోనే తను కూడా హాస్పటల్లో చేరి చికిత్స పొందుతున్నాడని విద్యార్థులు తెలిపారు.

# నేటి నుండి భాద్రపద మాసం ప్రారంభం.

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

దేవతా పూజలకు, పితృదేవతల పూజకు కూడా ఉత్కృష్టమైన మాసం 'భాద్రపద మాసం'చాంద్రమానం ప్రకరం భాద్రపద మాసం ఆరవమాసం. ఈ మాసంలోని పూర్ణిమ తిథినాడు చంద్రుడు పూర్వాభాద్ర నక్షత్రం సమీపంలోగాని, ఉత్తరాభాద్ర నక్షత్రం సమీపంలోగానీ ఉండడంవల్ల ఈ మాసానికి 'భాద్రపద మాసం' అనే పేరు ఏర్పడింది. ఈ మాసం లో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు మరియు బెల్లం దానాలు కూడా ఈ మాసం లో విశేష ఫలితాన్నిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రదేశాలలో స్త్రీలు భాద్రపద శుక్ల తదియ రోజున హరితాళిక వ్రతం ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించి, ఉపవాసం జాగరణ చేస్తారు. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే కష్టాలు తొలగి, అష్టైశ్వర్యాలతో తులతూగుతారు. భాద్రపద శుద్ధ చవితి నాడు ఆది దేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన రోజు, ఈ రోజున గణపతి పూజ ఉపవాసం వంటివి విశేష ఫలితాన్నిస్తాయి. ఈ పండుగ ఆదివారం రోజు కాని, మంగళవారం రోజు కాని రావడం మరింత విశేషాన్ని సంతరించుకొంటుంది. భాద్రపద శుద్ధ పంచమి నాడు ఋషి పంచమి జరుపుకొంటారు. ఇది కేవలం ఆడవారికి సంబంధించిన ప్రాయోశ్చితాత్మకమైన వ్రతం. ఈ వ్రతం చేయడం వలన స్త్రీలు ఋతుశ్రావ సమయం లో చేసిన పాపాలన్నీ తొలగి పుణ్య ఫలితం లభిస్తుంది అని భవిష్యపురాణం లో చెప్పబడింది. ఈ వ్రతం లో ముఖ్యంగా ఆచరించవలసినది, బ్రహ్మాహణుడికి అరటి పళ్ళు, నెయ్యి, పంచదార, దక్షిణ ఇవ్వాలి. ఒంటి పూట భోజనం చేయాలి. అంతే గాక ఆ భోజనం ధాన్యం, పాలు, పెరుగు, ఉప్పు, పంచాదారలతో తయారుచేయకుండా ఉండాలి. పళ్ళని స్వీకరించడం శ్రేయస్కరం. బౌద్ధ జయంతి ని కూడా ఈ రోజునే జరుపుకొంటారు. బుద్ధుని భోధనలు మానవుని ధర్మబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాట వేసాయి. ప్రపంచం లోని ధర్మమతస్తాపనకు బుద్ధుడు అత్యున్నత స్థానం వహించాడనే విషయంలో ఏమాత్రం భేదాభిప్రాయాలు లేవు. భాద్రపద శుద్ధ షష్ఠి /సూర్య షష్ఠి, సప్తమి కలసిన షష్ఠి సూర్యునికి ప్రీతికరం, ఈరోజున సూర్యుడిని ఆవుపాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రం తో ప్రాశనం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలం కంటే ఎక్కువ ఫలం కలుగుతుందని శాస్త్రం లో చెప్పబడింది. షష్ఠి తో కూడిన సప్తమి ఉంటే కనుక సుబ్రహ్మణ్య స్వామి ని పూజిస్తే ఎటువంటి పాతకాలైన నశిస్తాయి. భాద్రపద శుద్ధ అష్టమి నాడు కేదారవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని సంప్రదాయ సిద్ధం గా ఆచరిస్తుంటారు. భాద్రపద శుద్ధ దశమి నాడు దశావతార వ్రతం ఆచరించడం, దేవ, ఋషి, పితరులకు తర్పణాలు చేయడం ముఖ్యమైన విధులు. భాద్రపద శుద్ధ ఏకాదశి, దీన్నే పద్మ పరివర్తన ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున పాల సముద్రం లో శేషతల్పం పై శయనించిన శ్రీమహావిష్ణువు, ఈ ఏకాదశి రోజున ప్రక్కకు పొర్లి పరివర్తనం చెందుతాడు, అందుకే దీన్ని పరివర్తన ఏకాదశి అంటారు ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే కరువు కాటకాలు తొలగి పోతాయి, ముఖ్యం గా సంధ్యాసమయం లో శ్రీ మహా విష్ణువు ని పూజిస్తే మంచి ఫలితాలు కలుగఎలా°తాయి. భాద్రపద శుద్ధ ద్వాదశి వామన జయంతి గా చెప్పబడింది, ఈ రోజున వామనున్ని ఆరాదిస్తే అన్ని విషయాలలోనూ విజయం లభిస్తుంది. ముఖ్యంగా ఈ రోజున బ్రాహ్మణులకు పెరుగును దానం చేస్తే మంచి ఫలితాలని పొందవచ్చు. భాద్రపద మాసం లో శుద్ధ చతుర్దశి నాడు అనంత పద్మనాభ చతుర్దశి అంటారు. శేషతల్పసాయిగా నాభికమలంతో శ్రీమహాలక్ష్మి సమేతుడైన శ్రీమహావిష్ణువు ని పూజించి, వ్రతమాచరిస్తే దారిద్ర భాధలు తొలగి ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది. భాద్రపద పూర్ణిమ రోజు ఉమామహేశ్వర వ్రతం జరుపుకొంటారు, భక్తి శ్రద్దలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తే సుఖశాంతులతో పాటు అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి. భాద్రపద పూర్ణిమ తో మహాలయపక్షం ఆరంభమవుతుంది, అమావాస్య వరకు గల ఈ కాలాన్ని పితృ పక్షం అని కూడా అంటారు. మృతులైన పితరులకు, పూర్వీకులకు తప్పనిసరిగా తర్పణలివ్వాలి. శ్రాద్ధాన్ని యధాశక్తి గా ఈ దినాలలో చేయాలి. భాద్రపద బహుళ తదియ ని ఉండ్రాళ్ళ తద్దెగా చెప్పబడింది. ఇది స్త్రీలు చేసుకొనే పండుగ, ముఖ్యంగా కన్నె పిల్లలు గౌరీ దేవిని పూజించి, ఉండ్రాళ్ళను నివేదిస్తే మంచి భర్త వస్తాడని చెప్పబడింది. స్త్రీలకు అయిదవతనం వృద్ధి చెందుతుంది. భాద్రపద కృష్ణ ఏకాదశి అజ ఏకాదశి దీన్ని ధర్మప్రభ ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజు ఏకాదశి వ్రతమాచరించి నూనె గింజలను దానం చేస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చు. భాద్రపద కృష్ణ అమావాస్య మహాలయమావాస్య, ఈ రోజున పితృ తర్పణాలు, దానధర్మాలు చేయడం ఆచారం.

# తెలంగాణలో రైతులకు యూరియా సంక్షోభం

మహబూబాబాద్,

తెలంగాణలో కొనసాగుతున్న యూరియా కొరత రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి సంకేతం కాదు. అసలు విషయం ఏమిటంటే ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుండటంతో, దానిని బదనాం చేయడానికి కావాలనే సృష్టించిన రాజకీయ కుట్ర. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే తెలంగాణ ప్రభుత్వం సుమారు ఏడు లక్షల టన్నుల యూరియా బఫర్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచి రైతుల అవసరాలను ముందుగానే తీర్చడానికి సన్నద్ధమైంది. కేంద్రం సరఫరా చేసే యూరియా రాష్ట్ర డిపాజిట్ సెంటర్లకు చేరి, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేసి, అక్కడి నుంచి పాక్స్, రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేట్ డీలర్లకు 60:40 నిష్పత్తిలో పంపిణీ చేసే పారదర్శక వ్యవస్థను అమలు చేసింది. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుగానే చర్యలు తీసుకున్నదని స్పష్టంగా చూపిస్తున్నాయి.అయితే తెలంగాణకు కేటాయించిన కోటాను సరిపడా విడుదల చేయకుండా, కేంద్రం కావాలనే కృత్రిమ కొరతను సృష్టిస్తోంది. ఈ వెనుక ఉన్న ఉద్దేశ్యం స్పష్టమే ? బీజేపీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం రైతులను లక్ష్యంగా చేసుకుని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీన పర్చాలని చూస్తోంది. ఎక్కువ కేటాయింపులు చేసినప్పటికీ, తక్కువ పరిమాణమే సరఫరా చేసి, సరఫరా గొలుసును అడ్డుకోవడం, రైతులలో అవసరంలేని భయాందోళనలు కలిగించడం జరిగింది. సహకార సమాఖ్య పద్ధతిని అనుసరించాల్సిన చోట, కేంద్రం యూరియాను రాజకీయ ఆయుధంగా వాడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , తెలంగాణ ఎంపీలు ఈ అంశంపై ఢిల్లీలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. అంతే కాకుండా ఏఐసీసీ సీనియర్ నాయకురాలు ప్రియాంకా గాంధీ కూడా తెలంగాణ రైతుల తరపున గొంతు వినిపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయి లోనూ రైతుల తరపున పోరాటం చేస్తున్నదని నిరూపిస్తుంది.ఈ సంక్షోభం మధ్యలో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ యొక్క రాజకీయ స్వార్థం రైతులకు మరింత అవమానాన్ని తెచ్చింది. సెప్టెంబర్ 9 లోపు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తేనే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామని బహిరంగంగా ప్రకటించడం రైతుల భవిష్యత్తును ఢిల్లీ రాజకీయాల్లో బేరసారాల సాధనంగా మార్చే నీచ రాజకీయమే. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి నిజాయితీగా కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ మాత్రం రైతుల ఇబ్బందులను తమ రాజకీయ బతుకుదెరువు కోసం వాడుకుంటోంది.కాంగ్రెస్ పార్టీ యొక్క వైఖరి స్పష్టమైనది. తెలంగాణ రైతులు భయపడాల్సిన అవసరం లేదు. ఈ కొరత కృత్రిమంగా సృష్టించబడింది. వాస్తవానికి ప్రతి ఎకరానికి రెండు సంచుల యూరియానే సరిపోతుంది. అంతకంటే ఎక్కువ వాడటం రైతులపై ఆర్థిక భారమే కాకుండా నేల ఆరోగ్యానికీ హానికరం. కాబట్టి సరఫరా కొనసాగించడమే కాకుండా, రైతులకు సరైన వినియోగం పై గ్రామస్థాయి కమిటీలు, పాక్స్, రైతు సేవా కేంద్రాల ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాము. ప్రతి రైతుకు సమానంగా యూరియా అందేలా చర్యలు తీసుకుంటాం. ఈ విధంగా అవగాహన పెంచడం ద్వారా, కేంద్రం సృష్టిస్తున్న కొరతనీ, భయాన్నీ కలిసి తిప్పికొడతాం.ఈ సంక్షోభం రాష్ట్ర ప్రభుత్వ సామర్థ్యలేమి కాదు, ఇది కేంద్రం చూపిస్తున్న అసహకత, టీఆర్ఎస్ ప్రదర్శిస్తున్న స్వార్థం. బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంధనం చేయడానికి కొరత సృష్టిస్తోంది, బీఆర్ఎస్ మాత్రం దానికి తోడు రాజకీయ లాభం కోసం రైతుల కష్టాలను వాడుకుంటోంది. కానీ తెలంగాణ రైతులు నిజాన్ని తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలిచింది, పోరాడింది, రక్షించింది. కేంద్రం కుట్రా, బీఆర్ఎస్ ద్వంద్వ రాజకీయమా ? ఏదీ విజయవంతం కావు. తెలంగాణ రైతులకు న్యాయం జరగడం ఖాయం.

# భువనగిరి కోటకు రోప్ వే పనులు ప్రారంభం

## నరేంద్రమోడీ చిత్రపాటానికి పాలభిషేకం చేసిన బీజేపి నేతలు

యాదాద్రి భువనగిరి

భువనగిరి ఖిల్లా కు రోప్ వే పనులు ప్రారంభమైన సందర్భంగా బిజెపి నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం మాట్లాడుతూ భారత రాష్ట్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఖిల్లా రోప్ ఏర్పాటు కోసం 53 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఖిల్లా అభివృద్ధి చెందితే స్థానికంగా ఉండే వారికి కూడా ఉపాధి కలుగుతుందని తద్వారా భువనగిరి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

# తగ్గు ముఖం పట్టిన గోదావరి, కృష్ణా నదులు

విజయవాడ

గోదావరి, కృష్ణా నదులలో వరద పోటు తగ్గింది. భద్రాచలం వద్ద ప్రస్తుతం 39.5అడుగుల నీటిమట్టం నమోదయింది. కూనవరం వద్ద నీటిమట్టం 18.99 మీటర్లు, పోలవరం వద్ద 12.65 మీటర్లు , ధవళేశ్వరం వద్ద ఇన్‌డ‌అవుట్ ఫ్లో 12.34 లక్షల క్యూసెక్కులు నమోదయ్యాయి. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

# ఆగని ఎమ్మెల్యేల తప్పిదాలు

అనంతపురం, ఆగస్టు 23,

కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజకవర్గానికి తామే బాస్ లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయకత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసరమనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు. దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు. వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు.అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది. అందుకే వార్నింగ్ లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మెల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్ లతో సరిపెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.

# విశాఖ చుట్టూ టౌన్ షిప్స్

విశాఖపట్టణం, ఆగస్టు 23,

ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా ధీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో ధీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు 1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటు భూములను సమీకరిస్తారు. భూమి యజమానులకు నష్టపరిహారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి, పర్యాటకం, వైద్యం, వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికులకు సైతం ఉద్యోగాలు లభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖకు చోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది. అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో లక్ష కోట్లు కేటాయించింది. దీని ద్వారా ధీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి అయితే విశాఖకు ఈ నిర్ణయంతో మహర్దశ పట్టినట్టే.

# కోస్తా జిల్లాల్లో యాచకం... నిషేధం..

కాకినాడ, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)

ఏపీ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చూడాలని చూస్తోంది. ఇప్పటికే విశాఖలో పోలీస్ శాఖ ఆ పని చేస్తోంది. అయితే ఇప్పుడు ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చేయాలని.. వృత్తిని నిరోధించే ఏపీ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందనుంది. గవర్నర్ ఆమోదంతో చట్టాన్ని అమలులోకి తెస్తారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలో ప్రధాన నగరాలుగా ఉన్న విశాఖ విజయవాడ, తిరుపతి, కర్నూలు, అమరావతి, గుంటూరు, రాజమండ్రి, విజయనగరంలో యాచక వృత్తిని నిషేధిస్తారు. యాచకులు లేని నగరాలుగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పేదరిక నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం పి4 ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పేదరికాన్ని సూచికగా ఉండే యాచకులు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాచకులు ఉన్న రాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. తమిళనాడు రెండు, ఢిల్లీ మూడో స్థానంలో ఉంది. నాలుగో స్థానంలో ఏపీ కొనసాగుతోంది. అయితే ఏపీలో యాచకుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని చూస్తోంది. దానికి యాచకులు అవరోధంగా భావిస్తోంది. అందుకే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి, విద్యా వైద్యం వంటి సౌకర్యాలు కల్పించి.. సాధారణ పౌరులుగా జీవించేలా చేయనుంది. వారికోసం ప్రత్యేక షెల్టర్లను సైతం అందుబాటులోకి తేనుంది.

విశాఖలో పోలీస్ శాఖ ద్వారా యాచకులను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలామంది గ్రామాల నుంచి వచ్చి యాచక వృత్తిని ఆశ్రయిస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలు అందించి వారిని సాధారణ పౌరులుగా మార్చుతున్నారు. విశాఖలో వీధిలో కనిపించే యాచకులను గుర్తిస్తున్నారు. నిరాశ్రయులకు భోజన వసతి కల్పిస్తున్నారు. వారికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా తరువాత నగరాల్లో యాచకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ప్రముఖ దేవస్థానాలు ఉన్నచోట వీరు పెరుగుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం యాచక వృత్తిని నిషేధించాలని భావించింది. ప్రధాన నగరాలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలను సైతం ఆ జాబితాలో చేర్చింది. తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, రామ తీర్థాలు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సైతం ఇకనుంచి యాచకులు కనిపించకుండా పగడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

# ఏపీలో జాలీ ట్రావెలింగ్

తిరుపతి, ఆగస్టు 23, (

ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడు మినీ ఎయిర్పోర్టులను తీసుకురావాలని నిర్ణయించింది. హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి హెలికాప్టర్ సేవలు అందించడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, అరకు ప్రాంతాల మధ్య ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో హెలికాప్టర్ పర్యాటకం నిరంతరం అందుబాటులో ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్రాంతాలను ఆకాశమార్గంలో చూసే అరుదైన అవకాశం కల్పించనున్నారు.రాష్ట్రంలో హెలిక్యాప్టర్ టూరిజం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం మూడు ప్రాంతాల నుంచి హెలికాప్టర్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసక్తి కలిగిన ప్రైవేట్ ఏజెన్సీ ల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఎక్కడ హెలిప్యాడ్లను ఏర్పాటు చెయ్యాలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు జాలి రైట్ కొన్ని సందర్భాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఇకనుంచి అలా కాకుండా నిరంతరాయంగా సేవలందిలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో ప్రైవేట్ వీటిని నిర్వహించాయి. అక్కడ సక్సెస్ ఫుల్ గా కనిపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తోంది.ప్రధానంగా పర్యాటక ప్రాంతాలను కలుపుతూ హెలిక్యాప్టర్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం చూస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖ మధ్య హెలికాప్టర్ సేవలను నడపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిరోజు విజయవాడ, హైదరాబాదు నుంచి భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. వారికోసం రెండు వైపులా హెలిక్యాప్టర్ సేవలు తీసుకొస్తే గిరాకీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రూట్లో హెలికాప్టర్ సేవలు మొదలుపెడితే మంచి స్పందన వస్తుందని భావిస్తున్నారు.మరోవైపు విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో మినీ ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది ఏపీ ప్రభుత్వం. చిన్న చిన్న విమానాలతో పాటు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యే విధంగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. హెలికాప్టర్ టూరిజం ప్రోత్సహించే దిశగా విశాఖ, అరకు తో పాటు విజయవాడ, శ్రీశైలంలో వీటిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తోంది. సాధారణ విమానాశ్రయాల్లో ఉండే సౌకర్యాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న హెలిక్యాప్టర్ టూరిజం అనుగుణంగానే ఇక్కడ జాలీ ట్రావెలింగ్ కు ప్రభుత్వం యోచన చేస్తోంది.

# యూరియా కోసం రైతుల అగచాట్లు

నల్గోండ

నల్లగొండ జిల్లా పరిధిలో యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. ఇటీవల పీఏసీఎస్ కేంద్రాల ద్వారా యూరియా సరఫరాలో అధికారుల వైఫల్యంతో.. ఆయా మండలాల్లో పీఏసీఎస్ లతోపాటు.. ఆగ్రోస్, ఎన్బీసీఎంఎస్ ా ఎరువుల దుకాణాల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టారు. దీంతో తిప్పర్తి, మాడుగులపల్లి మండల కేంద్రాల్లో.. రైతులు పీఏసీఎస్ లతోపాటు.. ఆగ్రోస్, ఎన్బీసీఎంఎస్ కేంద్రాలకు వెళ్తున్నారు. తాజాగా.. తిప్పర్తి పీఏసీఎస్ అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులకు యూరియా కొరత.. రైతుల ఆందోళనల పర్వం కొనసాగింది. ఈ నేపథ్యంలో.. తిప్పర్తి ఐణతీనీబ ద్వారా యూరియా సరఫరా చేస్తున్నారు.అలాగే.. మాడుగులపల్లి లోనూ ఎరువుల దుకాణం ద్వారా యూరియా సరఫరా జరుగుతుంది. తాజాగా.. రైతులు యూరియా బస్తాల కోసం.. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్కుల జిరాక్సుల పెద్దఎత్తున క్యూ లైన్ లో వున్నారు.

# యాదాద్రి జిల్లా బీబీనగర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

బీబీనగర్ బీబీనగర్ పట్టణానికే తలమానికం అని చెప్పుకుంటున్న ఏఐఐఎంఎస్ హాస్పిటలలో స్థానికులకు ఉద్యోగానియమాకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ,స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలను ఇవ్వాలని కోరుతూ ..బీఆర్ఎస్ పార్టీ అందోళన చేపట్టింది. పార్టీ గ్రామశాఖ అధ్వర్యంలో ఇంటి ఇంటికి కరపత్రాన్ని ,గ్రామ పంచిపెట్టారు. పంచాయతి ఆవరణలోగల మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసారు. పార్టీ నేత మల్లగారి శ్రీనివాస్ మాట్లాడారు.

# కొండాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అందోళన

కోదాడ

తీర్మానం లేకుండా నగదును స్వాహా చేసిన ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కొండాపురంలో చోటుచేసుకుంది.బాధితులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామానికి ఇందిరా-2 మహిళ సంఘంలో 12 మంది సభ్యులు ఉన్నామని, సంఘం నుంచి ఒక్కొక్కరు 33వేలు అప్పుగా తీసుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. వీబీకే కవిత 33 వేల నగదును 83వేలుగా చూపించి తప్పుడు ప్రాంశరీ నోట్లు తయారు చేసినట్లు ఆరోపించారు. బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా అసలు విషయం బయటపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సార్లు ఎలాంటి తీర్మానం లేకుండా పది లక్షలు డ్రా చేసి తమపై అప్పు నెట్టినట్లు ఆరోపించారు.వేలు ముద్ర పెట్టె సభ్యులు సంతకం ఎలా పెడతారని ప్రశ్నించారు. ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి వీబీకే కవితపై చర్యలు తీసుకోవాలన్నారు.

# సిపిఐ అగ్రనేత కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు.. దేవనకొండలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ ఘన నివాళి..

దేవనకొండ ఆగష్టు 23

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అగ్రనేత, పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి గారి మృతి పార్టీకి తీరని లోటని మండల సిపిఐ నేతలు రామాంజి, భాస్కర్, భాష లు తెలిపారు. శనివారం దేవనకొండ సిపిఐ కార్యాలయం నందు సిపిఐ అగ్రనేత స్వర్గీయ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి యువజన సంఘం నాయకులు మనోజ్ అధ్యక్షతన పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం, అభివృద్ధి కోసం సురవరం అహర్నిశలు కృషి చేశారని అన్నారు. రెండు పర్యాయాలు పార్లమెంటు సభ్యులుగా గెలుపొందిన అణగారిన వర్గాల గొంతుకై పార్లమెంటులో తన గళం వినిపించారని తెలిపారు. కర్నూలు జిల్లా రాజకీయాలలో సురవరం పాత్రను గుర్తు చేసుకున్నారు. శ్రామిక, కార్మిక,రైతు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ప్రజా గొంతుకై అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర సురవరం కే దక్కిందన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి అకాల మరణం పార్టీ కార్యకర్తలను తీవ్రంగా కలచివేసిందన్నారు. సుధాకర్ రెడ్డి గారి ఆశయాల సాధన కోసం కృషి చేయాలని వారు సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు వీరంజి, రఫీ, కృష్ణ, కోదండ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో బూడిద బతుకులు మసిబారుతున్న పల్లెలు

ఖమ్మం, ఆగస్టు 23,

భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వెలుగులతో పాటు సమీప గ్రామాలకు వ్య ర్థాలను పంచుతోంది. పొగ ద్వారా వచ్చే వాయు కాలుష్యానికి తోడు బొగ్గుమండించగా మిగిలిన బూడిద ప్రజలను కమ్మేస్తుంది. ప్ర జల తో పాటు పశువులు సైతం అనారోగ్యానికి గుర వుతున్నాయి. పల్లెల నుండి పచ్చని చెట్ల వరకుబూడిద కమ్మేయడంతో ఎండి పోతున్నాయి.పంటలు సైతం వేయలే కపోతున్నా మని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గ్రీన్ బెల్టు ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్య వహరిస్తున్నా రనీ, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు దీర్ఘకాలిక రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు (బిటిపిఎస్) పరిసర గ్రామాల ప్రజల ఇబ్బందుల పై విజయ క్రాంతి పరిశీలనాత్మక కథనం...ఎక్కడైనా పరిశ్రమలు వ స్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయి.కానీ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న బి టి పి ఎస్ పరిసర పల్లెలకు పరిశ్రమ శాపంలా మారిందని గ్రామాలలో కాలుష్యం భయాం దోళనలు రేకెత్తిస్తోందని, థర్మల్ స్టేషన్ నుంచి వెలువడే పొగ, బూడి ద వల్లవాయు, జల కాలుష్యం ఏర్పడుతోం దని స్థానికులు చెబుతున్నారు. రోజుకు వం దల సంఖ్యలో లారీల ద్వారా బూడిద తరలింపు జరపడం వ ల్ల చుట్టుపక్కల గ్రామా ల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరిందని వాపోతు న్నారు.ప్లాంట్ చిమ్నీల నుంచి వెలువడే పొగ ఉ క్కిరి బిక్కిరి చేస్తుండ గా బూడిద వ్యర్థాలు గాలిలో కలసి కాలుష్యం పెరిగి పచ్చటి పల్లెలను బూడిద కమ్మే స్తోంది. థర్మల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయుకాలుష్యం దెబ్బకు పరి సర గ్రామాలు విలవిల లాడు తుండగా ఆయా కాలుష్య కారకాలను పీల్చుకుని ప్రజ లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇక పశు పక్ష్యాదుల సంగతి సరే సరి. విష పూరిత కాలుష్య రేణువులు వెలు వడకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నా..బిటిపి ఎస్ అధికారుల పట్టింపులేనితనంతోనే తమకు ఈ ఇబ్బందులు ఎదురవు తున్నాయని బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, ఆం దోళనలు చేసి నప్పుడు ప్రజా ప్రతినిధుల సమక్షంలో హామీలుఇస్తున్నా.. ఆ త ర్వాత వాటిని తుంగలో తొక్కడం షరామామూలైందని మండి పడుతున్నారు... కళ్లు, ఒళ్లు మండి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.భద్రాద్రి పవర్ ప్లాంట్ నుండి వెలువడుతున్న బూడిద (యాష్) తరలించే బూడిద ట్యాంకర్లే ప్రధాన రహదారి నిండా దర్శనమిస్తున్నాయి. వాటి మూలంగా అనేక ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాంకర్ల నుండి వెలువడుతున్న బూడిదతో పీల్చేగా లి... తినే తిండి.. తాగే నీరూ కలుషితమై ప్రజలను అనారోగ్య పాలు చేస్తోంది. శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధు లతో జీవితాలు మసకబారి పోతున్నా యి.చివరకు పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు బూడిద ముసిరిన బతుకులుగా మా రుతున్నాయి. బూడిద, దుమ్ము, ధూళి కారణంగా ఒంటిపై దద్దుర్లు , చర్మంపై మచ్చలు వస్తున్నాయని, ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పరిశ్రమ ప్రభావిత గ్రామాలో యాజ మాన్యం తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారం వారం వైద్య పరీక్షలు చేయా ల్సి ఉన్నా గ్రామాల్లో ఆపరిస్థితి కనిపించడం లేదని. ప్రారంభంలో కొంత కాలం సీఎస్ ఆ ర్ కింద యాజమాన్యం మొక్కుబడి శిబిరా లు నిర్వహిం చినా.. ఇప్పు డు తమ వైపు కన్నెత్తి చూడటం లేదనిబాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్లాంట్ నుండి వెలబడుతున్న యాష్ కా రణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అ నేక ఇబ్బందులకు గురవుతున్నారు. త్రాగే మంచి నీటి నుండి పండించే పంటల వరకు ప్రజలుఇబ్బందులను పడుతున్నారు. పరిసర గ్రామాలైన చిక్కుడు గుంట, దమక్క పేట, సాంబాయి గూడెం, రాయిగూడెం, పో తిరెడ్డిపల్లి, ఏడుల్ల బయ్యారం, సీతారాంపు రం, ఉప్పాక, బొమ్మరాజుపల్లి తదితర గ్రా మాల ప్రజలు నిత్యం బూడిదతో సహ జీవ నం చేస్తున్నారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా పవర్ ప్లాంట్ ను కొనసాగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదే శాలు ఉన్నప్పటికీ వాటిని పాటించడం లో బిటిపిఎస్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నిత్యం మంచు దుప్పటిలా గ్రా మాలన్నీ బూడిదతో దర్శనమిస్తున్నాయి. వ చ్చని చెట్లు బూడిదపారి నల్లగా మారిపోతున్నాయి.వరి, ప త్తి, మిరప సాగు చేసే రైతుల కు దిగు బడులు తగ్గి అర్థం కాని పంట తెగుళ్లతో నష్ట పోతున్నామని ఆందోళన చెందు తున్నా రు .ఈ విషయంపై రాజకీయనాయకులు, పలువురు ప్రకృతి ప్రేమికులు పలు మార్లు చర్యలు తీసుకోవాలని కోరిన కాలు ష్య సమస్యను అరికట్టడంలో ప్లాంట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా పవర్ ప్లాంట్ యాజమాన్యం స్పందించి గ్రామాలలో కా లుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపరాష్ట్రపతి ఫైట్...

హైదరాబాద్, ఆగస్టు 24, (

భారత రాజకీయ వేదికపై ఉపరాష్ట్రపతి ఎన్నికలు ఒక ఆసక్తికరమైన పోటీగా మారాయి. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఈ పదవికి సెప్టెంబర్ 9, 2025న జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా తమిళనాడుకు చెందిన పీసీ. రాధాకృష్ణన్, ఇండియా కూటమి అభ్యర్థిగా తెలంగాణకు చెందిన సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి బీ. సుదర్శన్‌రెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికలు కేవలం రాజకీయ పోటీగానే కాక, తెలుగు?తమిళ ప్రాంతీయ గుర్తింపుల సమ్మేళనంగా మారాయి. ఆసక్తికరంగా, తెలుగు రాష్ట్రాల ఎంపీలు తమిళ అభ్యర్థికి, తమిళనాడు ఎంపీలు తెలుగు అభ్యర్థికి మద్దతు ఇవ్వనున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయిఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్ హక్కు ఉన్నది పార్లమెంటు ఉభయ సభల సభ్యులు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య ఓట్ల లెక్కలు కీలక పాత్ర పోషిస్తాయి. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎన్డీఏకు గణనీయమైన బలం ఉంది. తెలంగాణలో బీజేపీకి 10 ఎంపీలు, కాంగ్రెస్‌కు 8 ఎంపీలు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 21 ఎంపీలు ఉన్నారు. దీని ప్రకారం, తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్డీఏ అభ్యర్థి పీసీ రాధాకృష్ణన్‌కు 31 ఓట్లు దాదాపు ఖాయం. అదనంగా, వైఎస్సార్‌సీపీ (11 ఎంపీలు) ఎన్డీఏకు మద్దతు ఇవ్వనుందని సమాచారం, దీంతో ఎన్డీఏకు తెలుగు రాష్ట్రాల నుంచి 42 ఓట్లు రావొచ్చు. బీఆర్ఎస్ (3 ఎంపీలు) ఇంకా తమ మద్దతును ప్రకటించలేదు, కానీ వారి నిర్ణయం కూడా ఎన్డీఏకు అనుకూలంగా మారే అవకాశం ఉంది. మరోవైపు, తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి బలమైన పట్టు ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి తమిళనాడులోని 39 స్థానాలను సాధించింది. దీంతో, తమిళనాడు ఎంపీలు ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వనున్నారు. ఈ ప్రాంతీయ ఓట్ల మార్పిడి తెలుగు రాష్ట్రాల ఎంపీలు తమిళ అభ్యర్థికి, తమిళనాడు ఎంపీలు తెలుగు అభ్యర్థికి మద్దతు ఈ ఎన్నికలకు ప్రత్యేక ఆకర్షణను జోడించింది.ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇద్దరు అభ్యర్థులూ తమ రంగాల్లో ఉద్దండులు. ఎన్డీఏ అభ్యర్థి పీసీ రాధాకృష్ణన్ తమిళనాడు రాజకీయాల్లో బీజేపీకి ప్రముఖ ముఖం. ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన రాధాకృష్ణన్, కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. బీజేపీ బలహీనంగా ఉన్న తమిళనాడులో పార్టీ స్థానాన్ని బలోపేతం చేయడానికి 19 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన ఘనత ఆయన సొంతం. 1998లో కోయంబత్తూర్‌లో జరిగిన బాంబు దాడిలో 80 మందికి పైగా మరణించగా, రాధాకృష్ణన్, అప్పటి బీజేపీ నేత అద్వానీ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న ఆయన, రాజకీయ అనుభవం, సామాజిక సేవలో తనదైన ముద్ర వేశారు.ఇండియా కూటమి అభ్యర్థి బిసుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందిన ప్రముఖ న్యాయమూర్తి. సుప్రీం కోర్టు జడ్జిగా, గోవా లోకాయుక్తగా పనిచేసిన ఆయన, ముక్కుసూటి తీర్పులతో పేరు పొందారు. గోవా మొదటి లోకాయుక్తగా నియమితులైన సుదర్శన్, మొదటి విచారణలోనే అప్పటి ముఖ్యమంత్రి మనోహర్ పారీకర్‌ను ప్రశ్నించి సంచలనం సృష్టించారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని నిష్పాక్షిక వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన, తెలంగాణలో బీసీ కులగణన కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. ఆయన న్యాయమూర్తి నేపథ్యం, నిష్పాక్షికత ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి కొంత బలాన్ని ఇస్తోంది.ఈ ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల ఎంపీలు తమిళ అభ్యర్థికి, తమిళనాడు ఎంపీలు తెలుగు అభ్యర్థికి మద్దతు ఇవ్వడం రాజకీయ వ్యూహాలకు సంబంధించిన లెక్కలే కాక, ప్రాంతీయ రాజకీయ డైనమిక్స్‌ను కూడా ప్రతిబింబిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీఏ బలం ఎక్కువగా ఉండటం, వైఎస్సార్‌సీపీ మద్దతు అవకాశం ఉండటంతో పీసీ.రాధాకృష్ణన్‌కు ఈ ప్రాంతం నుంచి గణనీయమైన ఓట్లు రానున్నాయి. ఇక తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని ఇండియా కూటమి ఆధిపత్యం కారణంగా సుదర్శన్ రెడ్డికి బలమైన మద్దతు లభించనుంది.ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య ఓట్ల లెక్కలు ఈ ఎన్నికల ఫలితాన్ని నిర్ణయిస్తాయి. ఎన్డీఏకు లోక్‌సభ, రాజ్యసభలో సంఖ్యాబలం ఎక్కువగా ఉండటం వల్ల పీసీ రాధాకృష్ణన్‌కు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, ఇండియా కూటమి సుదర్శన్‌రెడ్డి వంటి నిష్పాక్షిక, గౌరవనీయ వ్యక్తిని ఎంచుకోవడం ద్వారా కొంతమంది ఎన్డీఏ సభ్యులను ఆకర్షించే అవకాశం ఉంది.

# అంతకంతకు పెరుగుతున్న అప్పులు...

హైదరాబాద్, ఆగస్టు 24,

"రోడ్లు వేస్తున్నాం. విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. మెడికల్ కాలేజీలు కడుతున్నాం. అందరికీ తాగునీరు అందిస్తున్నాం. దేశ సౌభాగ్యాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తున్నాం.. గడచిన పది సంవత్సరాలలో దేశ అభివృద్ధిని పరుగులు పెట్టించాం. ప్రపంచ వేదికల మీద మన దేశానికి సమున్నత స్థానాన్ని కల్పించాం" ఇలానే ఉంటున్నాయి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు. మనదేశంలోనే కాదు, ప్రపంచ వేదికల మీద ఆయన ఇలానే మాట్లాడుతున్నారు.వాస్తవానికి ఆయన మాటల్లో కొంత నిజం ఉండొచ్చు. కానీ భారతదేశ అప్పులు మాత్రం అంతకంతకు పెరుగుతున్నాయి.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన నాటు నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అప్పు రెండు వందల లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దేశస్తుల జాతీయ ఉత్పత్తిలో 56.1 శాతానికి చేరుకుంది. కేంద్రానికి వివిధ రూపాలలో వస్తున్న ఆదాయంలో 37.32% రుణాలకు సంబంధించి చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతుంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కాదు.. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన వివరాలు.2015 -16 లో కేంద్రం అప్పులు 70.88 లక్షల కోట్లు ఉండగా.. గడచిన పది సంవత్సరాలలో అది 18,190 శాతం పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో రుణాలకు సంబంధించిన నిష్పత్తి 51.5 నుంచి 56.1 శాతానికి చేరుకుంది. దశాబ్ద కాలంలో కేంద్రం 100 లక్షల కోట్లకు మించి అప్పు చెల్లించింది. ఇందులో అసలు 32.61 లక్షల కోట్లు కాగా.. వడ్డీ 85.17 లక్షల కోట్లు కావడం విశేషం. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీలకు సంబంధించిన చెల్లింపుల కోసం 2015 -16లో 36.96% ఉండగా.. ఇప్పుడు ఏకంగా అది 37.32 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే అప్పులలో తమిళనాడు 9.55 లక్షల కోట్లతో మొదటి స్థానంలో ఉంది. 8.57 లక్షల కోట్లతో ఉత్తర్ ప్రదేశ్ రెండవ స్థానం, మహారాష్ట్ర 8.12 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉన్నాయి.కేంద్రం అప్పులు 200 లక్షల కోట్లకు చేరిన నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు దేశ ప్రజల ఆదాయానికి లోబడి అప్పులు చేశామని.. ఇప్పుడు కేంద్రం మాత్రం ఇష్టానుసారంగా అప్పులు చేస్తోందని.. అప్పులకు తగ్గట్టుగా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. బిజెపి ప్రతిపక్షంలో ఉన్న రాష్ట్రాలలో అప్పుల గురించి మాట్లాడుతోందని.. కేంద్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో వారు తెచ్చిన అప్పుల గురించి మాట్లాడటం లేదని సెటైర్లు విసురుతున్నది.

# సచిన్ డాటర్.. తల ఎత్తుకొనేలా చేసింది

ముంబై, ఆగస్టు 23,

సచిన్ కంటే ఎత్తుంటాడు. బౌలింగ్ కూడా వైవిధ్యంగా చేస్తాడు. అన్నీ ఉన్నప్పటికీ అల్లుడు నోట్లో శని అన్నట్టుగా.. సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ సక్సెస్ కాలేకపోతున్నాడు. ఐపీఎల్ లో బలవంతంగా ముంబై జట్టు అతడిని కొనసాగిస్తోంది. గత సీజన్లో అతడికి ఒక్క మ్యాచ్ లో కూడా ఆడే అవకాశం రాలేదు. అంతకుముందు సీజన్లో ఏదో ఒక మ్యాచ్లో ఆడించినప్పటికీ.. ప్రతి బంతికి అతి చేశాడు. గత ఏడాది జరిగిన మేగా వేలంలో అతడిని ముంబై జట్టు యాజమాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో సచిన్ రంగంలోకి దిగి సిఫారసు చేయడంతో ఏదో నామమాత్ర ధరకు అర్జున్ టెండూల్కర్ ను ముంబై జట్టు యాజమాన్యం కొనుగోలు చేసింది. ఇటీవల అర్జున్ నిశ్చితార్థం చేసుకున్నాడు.. అతని కెరియర్ కూడా అంత గొప్పగా లేదు. దేశవాళి టోర్నీలలో కూడా అతడు మేరుగా రాణించలేకపోతున్నాడుసచిన్ కుమారుడి కెరియర్ అంత గొప్పగా లేకపోయినప్పటికీ.. అతడి కుమార్తె మాత్రం తనకు నచ్చిన రంగంలో రాణిస్తున్నది. తన తండ్రి లెగసీని కాపాడుతున్నది. ఇదే విషయాన్ని సచిన్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. " ఇది గొప్ప విషయం. నా కుమార్తె సారా ఇటుకాఇటుక పేర్చుకుంటూ ఇక్కడ దాకా వచ్చింది. ఇదంతా కూడా ఆమె స్వీయ కృషి. అందువల్లే ఈ స్థాయికి ఎదిగింది. ఆమె మరింత ఎత్తుకు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని" సచిన్ వ్యాఖ్యానించాడు.సచిన్ కూతురు సారా ముంబైలోని ఆందేరీ ప్రాంతంలో "పైలెట్స్" అనే పేరుతో వెల్నెస్ స్టూడియో, స్మూతీ బార్ ను ప్రారంభించింది. "పైలెట్స్" అనేది దుబాయ్ కి చెందిన ప్రసిద్ధ ఫిట్నెస్ స్టూడియో. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు ఇది నాల్గవ శాఖ. ఇది ఫిట్నెస్, పోషకాహారం, ఆరోగ్య మెలకువలు వంటి వాటిపై అవగాహన కల్పిస్తుంది. పైలెట్స్ స్టూడియోలో అధునాతనమైన ఫిట్నెస్ స్టూడియో ఉంటుంది.. క్లినికల్ న్యూట్రిషన్ లో కీలకపాత్ర పోషిస్తుంది."బరువు ఎక్కువగా ఉన్నవారు.. పోషకాల లోపం వల్ల బాధపడుతున్నవారు.. ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న వారు పైలెట్స్ స్టూడియో లో జాయిన్ అవ్వచ్చు. గతంలో జాయిన్ అయినవారు అద్భుతమైన ఫలితాలను చవిచూశారు. బాలీవుడ్ ప్రముఖులు.. ఇతర ఇతర వ్యక్తులు తమ అధిక బరువును తగ్గించుకున్నారు. శరీరాన్ని నాజకుగా మార్చుకున్నారు. వర్కౌట్ మాత్రమే కాదు డైట్ వంటి వాటిల్లో కూడా ఈ స్టూడియో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. శరీరంలో పోషకాల సమతుల్యాన్ని పాటించేలా చేస్తుంది. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం మాత్రమే కాదు.. బరువు తగ్గించుకోవడంలో ఈ స్టూడియో తోడ్పడుతుంది. ఇక్కడ అన్ని రకాల నిపుణులు ఉన్నారు.. అందువల్ల ఇందులో చేరిన వారు అద్భుతంగా తమ జీవన కాలాన్ని సాగించుకోవచ్చని" సారా పేర్కొంది.సారా టెండూల్కర్ కు పైలెట్స్ స్టూడియోతో లండన్లో మొదటి పరిచయం ఏర్పడింది. ఎందుకంటే సారా తన విద్యాభ్యాసాన్ని లండన్ లో కొనసాగించింది. అప్పుడే ఆమెకు పైలెట్స్ స్టూడియో పరిచయమైంది. ఆ తర్వాత అందులో ఆమె చేరింది. తన శరీరాన్ని పూర్తిగా మార్చుకుంది. అప్పటినుంచి పైలెట్స్ స్టూడియోను ఇండియాలో ఏర్పాటు చేయాలనేది తన కలగా పెట్టుకుంది సారా. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా స్టూడియోను ఏర్పాటు చేసుకుంది. అందులో కేఫ్, స్మూతీ బార్ కూడా ఏర్పాటు చేసుకుంది.

# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా "గ్రీన్ ఇండియా- క్లీన్ ఇండియా" కార్యక్రమం

గోదావరిఖని : గోదావరిఖనిలో కృష్ణవేణి విద్యాసంస్థలలో శనివారం నాడు ఘనంగా గో గ్రీన్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మనాలి ఠాకూర్ కార్యక్రమంలో పాల్గొని వారి చేతుల మీదుగా మొక్కలను అందించడం జరిగినది. మరియు గో గ్రీన్ సందర్భంగా అమూల్యమైన సందేశాన్ని కూడా ఇవ్వడం జరిగినది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టి, పర్యావరణం పట్ల అవగాహన పెంచేందుకు, పచ్చదనం ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినకృష్ణవేణి పాఠశాల యజమాన్యాన్ని కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా ? క్లీన్ ఇండియా", "ఏక్ పేడ్ ఏక్ జీవన్" ×"పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" వంటి నినాదాలతో శ్రీ మంజుల శ్రీనివాస్ రెడ్డి ర్యాలీ ప్రారంభించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు చేరువ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల చేత మొక్కలు నాటించే కార్యక్రమం నిర్వహించారు. "ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత. చిన్నప్పటి నుంచే పిల్లలలో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగితే భవిష్యత్తులో మన దేశం పచ్చగా, పరిశుభ్రంగా మారుతుంది. ఒక చెట్టు నాటడం అంటే ఒక ప్రాణాన్ని రక్షించడమే.

# బ్రిటిషోళ్లను హడలెత్తించిన విప్లవవీరుడు రాజ్ గురు -నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

బ్రిటిషోళ్లను హడలెత్తించిన విప్లవవీరుడు కామ్రేడ్ శివరాం రాజ్ గురు.. ఆయన మహారాష్ట్ర పుణే దగ్గరలోని కేడు గ్రామంలో పార్వతి దేవి హరి నారాయణ రాజు గురు దంపతులకు 1908 ఆగస్టు 24న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన విప్లవ కిశోరం. కామ్రేడ్ శివ రామ్ రాజగురు చిన్నప్పటి నుంచే జాతీయ భావాలతో పెరిగారు. రాజ్ గురు స్వాతంత్ర పోరాటం వైపు పయనించాడు. 1928 ఫిబ్రవరిలో భారతదేశ పర్యటనకు వచ్చినటువంటి సైమన్ కమిషన్ గోబ్యాక్ అంటూ జరిగిన పోరాటానికి నాయకత్వం వహించిన లాలాలజపతిరాయ్ పోలీసులు లాఠీఛార్జి కిరాతకంగా హత్య చేశారు. సైమన్ కమిషన్ లో ఒక భారతదేశ సభ్యులు కూడా లేకపోవడం భారతీయుల్లో మరింతగా ఆవేశం వచ్చింది. లాలాలజపతిరాయ్ మృతిపట్ల భారతదేశంలో యువత లో తీవ్రమైన వ్యతిరేకత రావడం బ్రిటిష్ పాలనను ఎలాగైనా తరిమికొట్టాలని లక్ష్యంతో సాగారు. చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోనే యువతలో చైతన్యం చేస్తూ భారత స్వాతంత్ర పోరాటంలో యువతను భాగస్వామ్యం చేయడం కోసం కీలకమైన కృషి చేయడం జరిగింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని లక్ష్యంతో జరుగుతున్న పోరాటంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో రాజ్ గురు కూడా సభ్యులుగా చేరారు. లాలాలజపతిరాయ్ లాఠీఛార్జ్ చేసిన అధికారిని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో భగత్ సింగ్, రాజ్ గురు ఇతరులు కలిసి పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్నటువంటి జాన్ సాండర్స్ అనే బ్రిటిష్ అధికారి ని కాల్చి చంపడం జరిగింది. కొద్దికాలం పాటు అజ్ఞాత వాసం లో ఉంటూ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించేందుకు దేశవ్యాప్తంగా హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ పనిచేసింది. ఢిల్లీలో జరిగిన అసెంబ్లీలో బాంబు వేసి భగత్ సింగ్ స్వచ్ఛందంగా లొంగిపోవడంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కొద్దికాలం తరువాత ఈ కేసులో ప్రమేయం ఉందని అనుమానించిన పోలీసులు అధికారులు రాజ్ గురును కూడా అరెస్ట్ చేయడం జరిగింది. సాండర్స్ హత్య కేసులో భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురు ఉరి తీయాలని తీర్పు ఇవ్వడం జరిగింది. 1931 మార్చి 23 వ తేదీన లాహోర్ జైల్లో విప్లవ కిశోరాలను ఉరి తీయడం జరిగింది.ఇంక్విలాబ్ జిందాబాద్ బ్రిటిష్ వలస పాలన మాకొద్దు అంటూ స్వాతంత్ర్యమే మా జన్మహక్కని నినాదాలు చేస్తూ వీర మరణం పొందారు. ఉరితీసిన నాటికి భగత్ సింగ్,సుఖదేవ్ ల వయస్సు 23 సంవత్సరాలు అయితే రాజుగురు వయస్సు 22 సంవత్సరాలే దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం వీర మరణం పొందిన వంటి వీరుల త్యాగాలు మరువలేనివి.

# తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన మహోన్నత వ్యక్తి దాశరథి రంగాచార్య నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అక్షరమే ఆయన ఆయుధం, సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటం, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన అభ్యుదయవాది. తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన మహోన్నత వ్యక్తి, తన రచనలతో సమాజాన్ని చైతన్యం చేసిన అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్య. దాశరథి రంగాచార్యులు ఖమ్మం జిల్లా లోని చిట్టి గూడూరులో జన్మించారు. ఆయన అన్న ప్రముఖ కవి, సాయుధపోరాట యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సాయుధపోరాట కాలంలో ఉపాధ్యాయునిగా, గ్రంథపాలకునిగా పనిచేశారు. సాయుధపోరాటం ముగిసాకా సికింద్రాబాద్ పురపాలక కార్పోరేషన్లో 32 ఏళ్ళు పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. నైజాం రాజ్యంలో నిజాం పాలన కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య ఎదుగుతూండగా ఆంధ్రమహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్నగారు ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది కృష్ణమాచార్యుల సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. అసమానతలకు, అణచివేతకు నిలయంగా మారిన నాటి నైజాం సమాజాన్ని గమనించి పెరిగిన రంగాచార్యులు 1945ల్లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు.తండ్రి కుటుంబకలహాల్లో భాగంగా తల్లినీ, తమనూ వదిలివేయడంతో అన్నతో పాటుగా ఉంటున్న రంగాచార్యులకు ఆపై సాయుధ పోరాటంలో కృష్ణమాచార్యులను అరెస్టు చేయడంతో కౌమార ప్రాయం ముగిసేలోపే కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతల కారణంగా గ్రంథపాలకునిగా, ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఆనాటి సమాజంలో అసమానతల గురించి ప్రజలను చైతన్యపరిచారు. ఆ క్రమంలో రంగాచార్యుల కుటుంబంపై నైజాం ప్రభుత్వ అనుకూలురు, భాగస్వాములు దాడిచేసినా వెనుదీయలేదు. పోరాటం కీలకదశకు చేరుకున్న కాలానికి ఆయన కాంగ్రెస్ దళంలో చేరి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో రంగాచార్యులు తుపాకీ బుల్లెట్టు దెబ్బ తప్పించుకుని ప్రాణాపాయాన్ని కూడా ఎదుర్కొన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో చిత్రీకరించారు.

## కార్మికుల సంఘం నుంచి కవిత ఔట్...

అదిలాబాద్, ఆగస్టు 23,

రాజకీయాలలో వ్యక్తిగత అవసరాలు మాత్రమే ఉంటాయి. వ్యక్తిగత అవసరాల కోసం నాయకులు ఏమైనా చేస్తారు. ఎంతకైనా తెగిస్తారు. చివరికి తమ ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యులను దూరం చేసుకోవడానికి, దూరం పెట్టడానికి వెనుకాడరు. ఇప్పుడు ఇక సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చింది కాబట్టి విష ప్రచారానికి.. అడ్డగోలు వ్యక్తీకరణలలో ఏమాత్రం తగ్గరు. పై ఉపోద్ఘాతం మాదిరిగానే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి కనిపిస్తోంది. కొంతకాలంగా జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవితకు, ఆమె సోదరుడు భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు మధ్య విభేదాలు ఏర్పడినట్టు వార్తలు వస్తున్నాయి. ఇటీవల రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీ కట్టడానికి తాను వస్తానని సందేశం పంపినప్పటికీ.. కవితకు అవుట్ ఆఫ్ స్టేషన్ అని కేటీఆర్ రిప్లై ఇచ్చినట్టు మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను అటు జాగృతి అధినేత్రి.. ఇటు గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖండించలేదు. పైగా జాగృతి అధినేత్రి కుమారుడు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళుతున్నప్పుడు టాటా కెసిఆర్ ఆశీర్వాదం తీసుకోవడానికి ఎరవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళాడు. ఆ సమయంలో జాగృతి అధినేత్రి కూడా ఉన్నారు. పడక గదిలో ఉన్న కేసీఆర్ వద్దకు ఆయన సతీమణి శోభమ్మ కవిత కుమారుడిని తీసుకెళ్లారు. కవితను చూసి కూడా పడకగది నుంచి గులాబీ దళపతి బయటికి రాలేదని తెలుస్తోంది. కవిత ఎర్రవల్లి క్షేత్రానికి వెళ్ళినప్పుడు కేటీఆర్, హరీష్ రావు కూడా అక్కడికి చేరుకున్నారని సమాచారం. ఈ పరంపర ఇలా కొనసాగుతుండగానే.. జాగృతి అధినేత్రి అమెరికాలో ఉండగానే.. గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆమెకు కోలుకోలేని షాక్ ఇచ్చారు. నల్ల బంగారం విస్తారంగా ఉన్న ప్రాంతాలలో గులాబీ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగే కార్మిక సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ ను నియమించారు. ఇటీవలే గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈ నిర్ణయాన్ని ప్రకటించగా.. బుధవారం దానిని అమలులోకి తెచ్చారు. వాస్తవానికి కొప్పుల ఈశ్వర్ నియామకాన్ని జాగృతి అధినేత్రి స్వాగతించారు. అక్కడితోనే కవిత ఆగలేదు నల్లగనుల్లో కార్మికుల పక్షాన పోరాడుతున్న వివిధ సంఘాల నాయకులతో ఆమె భేటీ అయ్యారు. ఒకవేళ కొప్పుల ఈశ్వర్ నియామకం అధికారికంగా పూర్తయితే.. తను కూడా గనులు విస్తరించిన ప్రాంతంలో కీలకపాత్ర పోషించాలని కవిత అనుకున్నట్టు తెలుస్తోంది. కవితతో రియాజ్ లాంటి సీనియర్ కార్మిక సంఘం నాయకులు ఉండడం పై వాదనలకు బలం చేకూర్చుతోందిప్రస్తుతం జాగృతి అధినేత్రి అమెరికాలో ఉన్న నేపథ్యంలో.. ఇక్కడ జరుగుతున్న పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత తన కార్యాచరణను కల్వకుంట్ల కవిత ప్రారంభిస్తారని సమాచారం. ఇప్పటికే జాగృతి ఆధ్వర్యంలో కల్వకుంట్ల కవిత అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన తండ్రికి కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని ఆమె తీవ్రంగా తప్పు పట్టారు. ధర్నా చౌక్ లో నిరసన కూడా చేపట్టారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఇటీవల ఆందోళన కూడా చేశారు. తెలంగాణ కవులు, కళాకారులతో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. మొత్తంగా చూస్తే కల్వకుంట్ల కవిత తనకంటూ సొంతంగా రాజకీయ క్షేత్రాన్ని నిర్మించుకుంటున్నారు. అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఆమె తదుపరి అడుగులు ఏంటనేది తేలుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## శాంతియుత వాతావరణం లో పండుగలు జరుపుకోవాలి.

గోదావరిఖని:

రామగుండం పోలీస్ కమిషనరేట్ లో గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉన్నందున, రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను కమిషనరేట్ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో మతసామరస్యం సోదర భావంతో పండుగలను నిర్వహించడానికి ముందస్తు చర్యల్లో భాగంగా ఈరోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ క్వార్టర్స్ లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపెల్లి మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని వర్గాల మత పెద్దలతో గణేష్ చతుర్థి, మిలాద్- ఉన్- నబీ ల పండుగ ల దృష్ట్యా శాంతి సంక్షేమ కమిటీ సమావేశం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిశోర్ ఝా ఐపిఎస్., నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.... ప్రతి పండుగ ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని సదుద్దేశంతో అన్ని మతాల పెద్దలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.గత సంవత్సరం రామగుండం కమిషనరేట్ పరిధిలో 4786 లో మంచిర్యాల జోన్ పరిధిలో - 2316, పెద్దపెల్లి జోన్ పరిధిలో 2476 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సంవత్సరం వినాయక విగ్రహాల ఏర్పాటు పెరిగే అవకాశం ఉందన్నారు.వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు అన్ని వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్లో సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వాటి వివరాల ఆధారంగా ఆన్లైన్ చేయడం విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయడం చేస్తామని, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా శోభయాత్ర సాఫీగా సాగేలా రూట్ మ్యాప్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు.

# వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు

## గులాబీకి లిట్మస్ టెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 23,

ఉప రాష్ట్రపతి ఎన్నికలు భారత రాష్ట్ర సమితికి కొత్త సమస్య తెచ్చి పెట్టాయి. ఉన్నది నాలుగే ఓట్లు అయినా ఆ ఓట్లను ఎవరికి వేయాలన్నది పెద్ద సమస్యగా మారిపోయే ప్రమాదం ఏర్పడింది. దీనికి కారణం ఇండి కూటమి తరపున అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డిని ప్రకటించడమే. సుదర్శన్ రెడ్డి అచ్చమైన తెలంగాణ న్యాయకోవిదుడు. ఆయనకు ఏ పార్టీతోనూ సంబంధం లేదు. కాంగ్రెస్ సభ్యుడు కాదు. దేశలో అత్యున్నత పదవుల్లో ఒకటి అయిన ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్నారు. మరి తెలంగాణ ఇంటి పార్టీ మద్దతు తెలియచేయదా ?తెలంగాణ రాష్ట్ర సమితి పేరు భారత రాష్ట్ర సమితిగా మారింది. జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలనుకున్నారు.కానీ అసలుకే మోసం వచ్చింది. మళ్లీ బలం పుంజుకోవాలంటే తెలంగాణ ప్రజలు ఆదరించాలి. అలా చేయాలంటే.. తెలంగాణ వాదం మళ్లీ గట్టిగా వినిపించాలి. అందుకే కేటీఆర్ తెలంగాణ ప్రయోజనాలను.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేది తమ పార్టీనేనని ప్రకటించారు. భారత రాష్ట్ర సమితి అని పూర్తి పేరు కూడా ఇప్పుడు పలకడం లేదు. బీఆర్ఎస్ అంటున్నారు. మరి ఇలాంటి భావజాలంతో.. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకుండా తమిళనాడు అభ్యర్థికి మద్దతిస్తే ప్రజలు .. బీఆర్ఎస్ చెప్పే తెలంగాణ ఫస్ట్ వాదాన్ని నమ్ముతారా ?సుదర్శన్ రెడ్డి ఇప్పటి వరకూ రాజకీయాల్లో లేరు. ఆయన రాజ్యాంగ నిపుణుడు అన్న కారణంగానే ఇండీ కూటమి అభ్యర్థిగా ఎంపిక చేసుకుంది. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పారు. ఇప్పుడు తెలంగాణ బిడ్డ ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తే మద్దతివ్వరా..అన్న ప్రశ్న అన్ని వర్గాల నుంచి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ సెంటిమెంట్ కోసం ఆయనకు కాంగ్రెస్ తో సంబంధం లేదు కాబట్టి మద్దతిస్తున్నామని ప్రకటించవచ్చు. కానీ కేటీఆర్.. ఇంతకు ముందు ఓ ప్రకటన చేశారు. యూరియా ఎవరు ఇస్తే వారికి మద్దతిస్తామన్నారు. యూరియా వస్తే గిస్తే కేంద్రం నుంచి రావాలి .. అంటే బీజేపీ నుంచి రావాలి. వచ్చే వారం పది రోజుల్లో తెలంగాణకు యాభై వేల టన్నుల యూరియా కేంద్రం పంపుతోంది. ఈ కారణంతో బీజేపీకి మద్దతిస్తారన్న చర్చ జరుగుతోంది. సుదర్శన్ రెడ్డికి మద్దతివ్వకపోవడానికి బీఆర్ఎస్ ఏ కారణాలు చెప్పినా.. అది బీఆర్ఎస్ పార్టీ సెంటిమెంట్ రాజకీయ పునాదుల్ని మరింత బలహీనం చేస్తుంది. తెలంగాణ బిడ్డ.. డిల్లీ స్థాయి పదవికి పోటీ చేస్తూంటే.. కనీసం మద్దతివ్వరా అన్న ప్రశఅన వస్తుంది. ఇప్పటికే బీజేపీని విమర్శించేందుకు బీఆర్ఎస్ నేతలు ఆసక్తి చూపించడం లేదు. బీజేపీలో విలీనం గురించి చర్చలు జరుగుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ కు ఈ ఎన్నిక లిట్మస్ టెస్టుగా మారింది. బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఓటేసినా..ఎన్నికలను బహిష్కరించినా.. బీఆర్ఎస్ పలుకుబడి ప్రజల్లో మరింత తగ్గిపోతుంది.

# యూరియా కోసం పడిగాపులు

హైదరాబాద్, ఆగస్టు 23,

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ ప్రారంభమైన రెండు నెలల తర్వాత వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ తరుణంలో రైతులకు ఇప్పుడు ఎరువులు అవసరం. ప్రణాళిక ప్రకారం ఎరువులు సిద్ధంగా ఉంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందులో విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేంద్రం మాత్రం రాష్ట్రానికి అవసరానికి మించి ఎరువులు సరఫరా చేశామంటోంది. మరోవైపు రైతులు ఎరువులు అందక తల్లడిల్లుతున్నారు. అదనుకు వేయకుంటే పంట నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఎరువుల కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వనపర్తి, నల్గొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద యూరియా, ఇతర ఎరువుల కోసం రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిరీక్షిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. చెప్పులు, బండరాళ్లు, పాస్ బుక్కులను లైన్లలో ఉంచి, కొందరు రైతులు రాత్రి సమయంలోనూ పడిగాపులు కాస్తున్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వద్ద రైతులు ఎరువుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ, కొందరు క్యూ లైన్లలోనే పడుకునే దుస్థితి ఏర్పడింది. నల్గొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లిలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి సింగిల్ విండో గోదాం వద్ద చెప్పులు, బండరాళ్లను లైన్లలో ఉంచి రైతులు నిరీక్షణలో ఉన్నారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోనూ రైతులు చెప్పులు, పాస్ బుక్కులతో క్యూ కాస్తున్నారు. ఈ దృశ్యాలు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర కష్టాలను స్పష్టంగా చూపిస్తున్నాయి.ఎరువుల కొరతకు పలు కారణాలు ఉన్నాయి. ముందుగా, ఎరువుల సరఫరా గొలుసులో సమన్వయ లోపం ఒక ప్రధాన సమస్య. వ్యవసాయ శాఖ, సహకార సంఘాలు, ఎరువుల డీలర్ల మధ్య సమర్థవంతమైన సమన్వయం లేకపోవడం వల్ల ఎరువులు సకాలంలో రైతులకు చేరడం లేదు. రెండోది వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ఎరువుల డిమాండ్ గణనీయంగా పెరగడం, కానీ సరఫరా ఆ డిమాండ్‌ను తీర్చలేకపోవడం. మూడోది కొందరు ప్రైవేటు వ్యాపారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తూ, కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఈ కారణాలు రైతులను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఎరువుల కొరత రైతుల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సకాలంలో ఎరువులు అందకపోవడం వల్ల పంటల దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. ఇది రైతుల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. గంటల తరబడి క్యూ లైన్లలో నిరీక్షించడంతో సమయం, శ్రమ వృథా అవుతున్నాయి. అంతేకాక, కొరత కారణంగా ఎరువులను అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది, ఇది రైతుల పెట్టుబడి భారాన్ని మరింత పెంచుతోంది.తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా, రైతు బంధు వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకాలు పంటల సాగుకు అవసరమైన పెట్టుబడిని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, ఎరువుల సరఫరా వ్యవస్థలోని లోపాలు ఈ పథకాల ప్రభావాన్ని తగ్గిస్తున్నాయి. ఎరువుల కొరత వల్ల రైతులు ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించలేకపోతున్నారు. సమర్థవంతమైన నిర్వహణ లేకపోవడం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. వ్యవసాయ శాఖ, సహకార సంఘాలు, ఎరువుల తయారీ సంస్థలు, డీలర్ల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులను స్టాక్ చేయడం, సమర్థవంతంగా పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది.రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రైతులు స్థానిక వనరులను ఉపయోగించుకోవచ్చు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులు చల్లడంతో భూసారం దెబ్బతింటోంది. పంటలు విషతుల్యం అవుతున్నాయి. అనేక రోగాలకు దారితీస్తున్నాయి. దీనిపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలి. ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వడం, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు.

# కవిత దారెటు...

హైదరాబాద్, ఆగస్టు 23 (

కీయాలు ఒకే విధంగా ఉండవు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు వారు. సరిగ్గా ఇదే సమయానికి ఏడాది క్రితం కల్వకుంట్ల కవిత, కల్వకుంట్ల తారకరామారావు ఒక మాటగా, ఒక గొంతుకగా ఉండేవారు. కల్వకుంట్ల కవితను ఢిల్లీలో జైల్లో నుంచి బయటకు తీసుకురావడానికి కల్వకుంట్ల తారకరామారావు విశ్వ ప్రయత్నాలు చేశారు. రోజుల తరబడి హస్తినలో తిష్ట వేశారు. చివరికి కల్వకుంట్ల కవితను బయటికి తీసుకొచ్చారు. జైలు నుంచి బయటికి రాగానే కవిత తన సోదరుడికి రాఖీ కట్టారు. తమ ఇద్దరి మధ్య అనుబంధాన్ని చాటుకున్నారు. ఏమైందో తెలియదు.. ఏం జరిగిందో తెలియదు.. ఇద్దరి మధ్య విభేదాలు పెరిగిపోయాయి. అవి ఊహించని స్థాయికి చేరుకున్నాయి. వాస్తవానికి ఇటువంటి మనస్పర్థలు గతంలో ఎన్నడు కూడా వారిద్దరి మధ్య రాలేదు. వచ్చే అవకాశాన్ని కూడా వారి తండ్రి కల్పించలేదు. కానీ ఇప్పుడు ఇద్దరి మధ్య ఆగాధం మరింత పెరిగిపోయింది. అది పూడ్చలేని స్థాయికి చేరుకుంది.కల్వకుంట్ల కవితకు ఒకప్పుడు గులాబీ పార్టీ అనుకూల మీడియా విపరీతమైన ప్రాధాన్యమిచ్చేది. బీభత్సమైన స్పేస్ కల్పించేది. అప్పట్లో కేంద్ర దర్యాప్తు బృందం కవితను అరెస్ట్ చేసినప్పుడు గులాబీ మీడియా పతాక స్థాయి శీర్షికలతో వార్తలను ప్రచురించింది.. ప్రసారం కూడా చేసింది. అక్కడి దాకా ఎందుకు జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా కవితకు గులాబీ మీడియా విపరీతమైన స్పేస్ ఇచ్చింది. ఎప్పుడైతే తన రాజకీయ అడుగులకు కవిత అడ్డు తగులుతున్నారు అనుకున్నారో.. అప్పటినుంచి ఆమె పాత్ర నామ మాత్రమైపోయింది. ఆమెతో తండ్రి కూడా మాట్లాడటం లేదని తెలుస్తోంది. మరోవైపు గులాబీ మీడియా కూడా కవిత వార్తలకు ప్రయారిటీ ఇవ్వడం లేదు. ఇటీవల కవిత మీద ఓ నాయకుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై గులాబీ పార్టీ నాయకులు స్పందించలేదు. చివరికి జాగృతి కార్యకర్తలే రంగంలోకి దిగి బీభత్సం సృష్టించారు. ఇంత జరిగినప్పటికీ గులాబీ మీడియా సింగిల్ కాలం వార్తను కూడా ఆమె కోణంలో ప్రచురించలేదు. ప్రసారం చేయలేదు.కవిత ప్రస్తుతం రాజకీయంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆమె కంటూ సొంత మీడియా ఉండాలని.. ఆమె వాదనను, ఆమె వార్తలను సమాజానికి చేరవేయాలంటే ఒక వ్యవస్థ ఉండాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.." గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బలమైన సోషల్ మీడియాను ఏర్పాటు చేసుకున్నారు. మీడియా పరంగా కూడా ఆయనకు సపోర్ట్ ఉంది. ఆయన రాజకీయంగా ఎదగడానికి ఎంతో కొంత స్కోప్ ఉంది. అలాంటప్పుడు కవిత కూడా అటువంటి సోషల్ మీడియాను, మీడియాను ఏర్పరచుకోవాలి. అప్పుడే ఆమె కంటూ ప్రజల్లో మరింత గుర్తింపు లభిస్తుంది. ఇలానే ఆమె గనుక తన శైలి కొనసాగిస్తే ఇబ్బంది పడకతప్పదు. ఎందుకంటే సొంత మీడియా ఉంటేనే రాజకీయాలలో రాణించగలుగుతారు. లేకుంటే ఇబ్బంది పడక తప్పదని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అమెరికా నుంచి వచ్చిన తర్వాత తనకంటూ సొంత మీడియాను ఏర్పాటు చేసుకునే దిశగా కవిత అడుగులు వేయాలని వారు గుర్తు చేస్తున్నారు.

## సర్కారీ ఆఫీసుల్లో.. సోలార్ వెలుగులు

మెదక్, ఆగస్టు 23, (

ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్స హించడంతో పాటు కరెంట్ బిల్లుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఈ క్రమంలో దృష్టి సారించిన యంత్రాంగం సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రభుత్వ భవనాలు, వాటికి వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్ల వివరాల సేకరణలో నిమగ్నమైంది. ఈ నెల 29లోగా పూర్తిస్థాయి సమాచారం సేకరించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించినప్పటికీ భారీ వర్షాల నేపథ్యంలో ఆలస్యమైంది. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. దీంతో బిల్లులు భారీగా వస్తున్నాయి. సరిపడా నిధు లు లేని కారణంగా పలు శాఖలు కరెంట్ బిల్లులు సైతం చెల్లించలేని పరిస్థితి. రూ.కోట్ల లో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది ప్రభుత్వానికి తీవ్ర భారమవుతోంది. దీనిపై దృష్టి సారించిన సర్కారు జిల్లాల్లోని ఆసుపత్రులు, అంగన్వాడీలు, పాఠశాలలు, పంచా యతీ, ఇతర కార్యాలయాల భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్లను టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యం త్రాంగం ప్రభుత్వ కార్యాలయాల భవనాల గుర్తింపునకు కసరత్తు చేపట్టింది. ఇటీవల అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ భవనాల వివరాలు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్య దర్శులు వివరాలు సేకరిస్తుండగా , మున్సిపల్ పరిధిలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.భవనంపై కప్పు విస్తీర్ణం, విద్యుత్ కనెక్షన్ కేటగిరీ, నెల వారీగా వినియోగం వంటి సమాచారం సేకరిస్తున్నారు. విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే చోట ఎల్టీ, ఎక్కువగా ఉన్న భవన సముదాయాలపై హెచ్టీ సర్వీసులతో కూడిన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.కలెక్టరేట్, జిల్లా ఆసుపత్రి వంటి విశాల భవనా లపై 100 కిలోవాట్లకు పైబడి సామర్థ్యంతో కూడిన ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం ఆధా రంగా ప్రతిపాదలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నారు. తద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రయోజకనకరంగా ఉం టుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

## వరి బోనస్ ఎప్పుడు

అదిలాబాద్, ఆగస్టు 23, ( జిల్లాలో 2024-25 రబీ సీజన్లో 345 కొ నుగోలు కేంద్రాల నుంచి 1,97,590.920 (దొడ్డు 1,90,665.120, సన్న రకం 6,925.800) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 34,004 మంది రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. వీటికిగాను రైతుల అకౌంట్లలో 54,76,57,616 రూపాయలు జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలు సాగు చేసిన రైతులకు బోనస్ రూ. 500 ప్రకటించింది. కానీ ఈ సీజన్ గడిచినా బోనస్ డబ్బులు రైతుల అకౌంట్లలో జమ కాలేదు. రబీ సీజన్లో జిల్లాలోని 34,004 మం ది రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఇందులో 1041 మంది రైతులు రబీలో కూడా సన్నా లు సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు కామన్ రకానికి రూ. 2,300, 'ఏ' గ్రేడ్ రకానికి రూ. 2,320 మద్దతు ధర ప్రకటించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రకటించిన విధంగా 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి వానా కాలం సీజన్ లో అందజేసింది. కానీ రబీలో మాత్రం సీజన్ ముగిసి రెండు నెలలు దాటవస్తున్నా ఇంత వరకు దానీ ఊసే లేదు. జిల్లాలో 1041 మంది రైతులు సన్నాలు సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలకు 69,258 క్వింటాళ్ల సన్న ధాన్యం విక్రయించి వారికి రావాల్సిన 3,46,29,000 రూపాయల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోళు జిల్లాలోని నాలుగు ఏజన్సీల ద్వారా జరిపారు. రైతులు బోనస్ కోసం ఆయా ఏజెన్సీల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వడ్లు సొసైటీ సెంటర్లో అమ్మి రెండు నెలలు దా టింది. ఇంత వరకు బోనస్ డబ్బులు అకౌంట్లో పడటం లేదు. 12 ఎకరా లు కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తే మొదట్ల గాలి దుమారం, వర్షాల వల్ల పంట బాగా నష్ట పోయిన. దిగుబడి తగ్గింది. సన్నాలకు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ అయినా వస్తే తొందగానే వస్తే ఎంతో కొంత ఉపయోగపడుతుందనుకుంటే కండ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మా గోసను చూసి బోనస్ (రూ. 1,28,400) డబ్బులు అకౌంటులో జమ చేయుండ్రి... పెట్టుబడికి కష్టమవుతుంది...

# ఘనంగా టంగుటూరి జయంతి

అల్లూరి పాడేరు, ఆగష్టు 23: ఆదర్శప్రాయులు ఆంధ్ర కేసరి అని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర మద్రాస్ మొదటి నీ టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తు చేసారు. పేదరికంలో పుట్టిన టంగుటూరి ఉన్నత చదువులు చదవడమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ వారిని ధైర్యంగా ఎదుర్కొని ఆంధ్రకేసరిగా పేరు పొందారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టిందన్నారు. 1940-50వ దశకంలో ఆంధ్రా రాజకీయాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. తెల్లదొరలను గడగడలాడించిన ధీరునిగా ఖ్యాతిగాంచిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర ఉద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొని రాజకీయ శక్తిగా ఎదిగి 35 ఏళ్లకే రాజమండ్రి మున్సిపాల్టీకు చైర్మన్ గా పనిచేశారన్నారు.ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

## మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన

## నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ

సంగారెడ్డి, భారత ప్రతినిధి, ఆగస్టు 23:

మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా శనివారం సంగారెడ్డిలోని తార డిగ్రీ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ %-% "యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వ మిషన్ పరివర్తన' కార్యక్రమం జరుగుతోంది. ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తుంటే లేదా విక్రయిస్తుంటే 14446 లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించవచ్చు అని తెలిపారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో వంటి



కార్యక్రమాలు, యువతకు కౌన్సిలింగ్ కూడా జరుగుతోందని వివరించారు. పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ %-% విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి. మత్తు పదార్థాలు వినియోగించడం, విక్రయించడం చట్టపరమైన నేరం. కఠిన కారాగార శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. తదనంతరం అధికారులు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, క్రైమ్ బ్రాంచ్ అధికారి రమేష్, తార డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, జిల్లా ఆరోగ్య, విద్య విస్తరణ అధికారి శ్రీనివాస్ రావు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛతా ర్యాలీ పాల్గోన్న సీఎం చంద్రబాబు

కాకినాడ, పెద్దాపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా స్వచ్ఛతా ర్యాలీ జరిగింది. ఈర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రజాప్రతినిధులు, రంగరాయ మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గోన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం గురించి అవగాహన ఉందా..? అని చంద్రబాబు మెడికల్ కాలేజీ విద్యార్థులను అడిగారు. సర్క్యులర్ ఎకానమీపై పాలసీ చేశామని.. సర్క్యులర్ ఎకానమీ వల్ల ఉపయోగాలను మెడికల్ కాలేజీ విద్యార్థులకు వివరించారు. పెద్దాపురం వాసులు ర్యాలీలో భారీగా పాల్గొన్నారు. ర్యాలీ సమయంలో ఇళ్ల నుంచి అభివాదం చేసిన మహిళలను ముఖ్యమంత్రి పిలిచి మహిళలతో సంభాషించారు.

## చిట్టి చేతులు - గట్టి సంకల్పం

**-స్మార్ట్ కిడ్జ్ లో ఆకట్టుకున్న ఎకో ఫ్రెండ్లీ గణనాథుల తయారీ**

**-మట్టి గణపయ్యలను తయారు చేసిన చిట్టి చేతులు**

**-చైతన్య పరిచిన ఎకో ఫ్రెండ్లీ అవగాహన ర్యాలీ**

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), ఆగష్టు 23:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం పాఠశాల చిన్నారులు తమ చిట్టి చేతులతో ఎకో ఫ్రెండ్లీ గణనాధులను తయారు చేసి అందరికీ స్ఫూర్తినిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ గణపయ్యాలనే పూజించాలని తెలియజేస్తూ చిన్నారులు ఉత్సాహంగా ఎకో ఫ్రెండ్లీ గణపతులను తయారు చేశారు. వివిధ రూపాలలో వినాయక ప్రతిమలను అందంగా రూపొందించారు. మట్టి గణపయ్యలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పలు




రకాల కూరగాయలతో, పండ్లతో ,పూలతో ,దినుసులతో, బియ్యం, బిస్కెట్స్ , ఇడ్లీ, ఆకులు పలు రకాల ఆకృతులలో గణనాధులకు రూపం ఇచ్చారు. అనంతరం చిన్నారులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలతో నగరంలోని పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపయ్యలనే పూజించాలని,పర్యావరణాన్ని రక్షించాలని, రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించకుండా పర్యావరణానికి రక్షణ కల్పించాలని కోరుతూ జరిపిన ర్యాలీ అందరిని విశేషంగా ఆకట్టుకుని, చైతన్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ, భక్తులందరూ మట్టి వినాయకులతోనే గణేష్ వేడుకలను, పూజా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పర్యావరణాన్ని, చెరువులను, నీటి వనరులను కాలుష్యరహితంగా ఉంచడానికి ఎకో ఫ్రెండ్లీ గణపయ్యలకే పూజలు జరపాలని తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తమ పాఠశాలలో కాలుష్యరహిత పర్యావరణ రక్షణ కోసం ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలనే పూజించాలని అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులతోనే మట్టి గణపయ్యలు తయారు చేయడం జరిగిందని తెలిపారు గణేష్ వేడుకలను పర్యావరణహితంగా, ఆధ్యాత్మికంగా, కాలుష్య రహితంగా ప్రజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనదేవతల జాతరకు రూ.150 కోట్లు విడుదల - నిధులతో ఊపొందుకోనున్న జాతర పనులు



తాడ్వాయి/ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 23 (భారత శక్తి) : నిధుల రాకతో ఊపందుకోనున్న జాతర పనులు సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31మధ్య జరగనుంది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం జాతరనుపకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈసారి భారీగా నిధులు మంజూరు చేసింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సీతక్క మేడారంలో శాశ్వత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించడంతో ఈసారి గతంతో పోల్చితే రెండింతల నిధులు మంజూరయ్యాయి. నిధుల రాకతో పనులుఊపందుకోనున్నాయి.

రూ.80 కోట్లు గత జాతరకు ఇచ్చినవి

నాలుగు రోజుల వ్యవధిలోనే అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలా దిగా భక్తులు తరలివస్తున్నారు. ఎక్కువ మంది సొంత వాహనాల్లో వస్తుండ టంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ప్రభుత్వం రహదారుల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన రహ దారుల విస్తరణకు ఆర్అండ్ బీ శాఖకు రూ.9.95 కోట్లు, మేడారంతో పాటు పరి సర గ్రామాల్లో ప్రధాన, అంతర్గత మార్గాల విస్తరణకు పంచాయతీరాజ్ శాఖకు రూ.51.30 కోట్లు కేటాయించింది.

తాగునీటి సరఫ రాలో అనేక లోపాలు

తలెత్తుతున్నాయి. పంపింగ్ ద్వారా శుద్ధ జలాలు అందించడంతో.. నీరు వృథా కావడంతో చాలా చోట్ల పరిసరాలు బురదమయంగా మారుతు న్నాయి. ఈసారి ట్యాంకుల ద్వారా నీటిని పంపిణీ చేయాలని నిర్ణయించి రూ.5 కోట్లు మంజూరు చేసింది.

శాంతిభద్రతల పర్యవేక్షణకు రూ. 5,14,50/-

మహాజాతర విజయవంతంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పర్యవేక్షణ కీలకం. ఇందుకోసం రూ.14.50 కోట్లు కేటాయించింది. హనుమకొండ, భూపాలపల్లి, కాటారం, ఏటూరునాగారం నుంచి మేడారం వెళ్లే మార్గాలన్నింటిలో భారీస్థాయిలో పోలీ సులను మోహరించి, వారికి భోజన, రవాణా, విడిది సౌకర్యాలు కల్పించేం దుకు ఈసారి అదనంగా రూ.2 కోట్లకు పైగా నిధులిచ్చారు.

అమ్మవార్ల గద్దెల ప్రాంగణం

భక్తులందరూ మేడారంలో ఒక రోజు విడిది చేయడం, వంట చేసుకోవడం, సామూహికంగా భోజనాలు చేయడం ఆన వాయితీ. ఈ క్రమంలో జాతర పరిసరాల్లో టన్నులకొద్దీ వ్యర్థాలు పేరుకుపోతు న్నాయి. వీటిని సేకరణకు వేల సంఖ్యలో కూలీలు, వందల సంఖ్యలో యంత్రాలు, పనిముట్లు, రసాయనాలు సమకూర్చుకో వాల్సి వస్తోంది. జాతరను ఏకో ఫ్రెండ్లీ తరహాలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఈసారి జిల్లా పంచాయతీ అధికారికి రూ. 11.62 కోట్లు మంజూరు చేసింది.


అగ్నిమాపక, మత్స్య, పశుసంవర్ధక, గిరిజన సంక్షేమం, సమాచార, వైద్యఆరోగ్యం, అటవీ, రెవెన్యూ, దేవా దాయ, ఆబ్కారీ, పర్యాటక, ఎన్పీడీసీఎల్, ఆర్టీసీ లకు రూ.33.01 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఆయా శాఖలు తమ పరిధిలోని పను లను చేపట్టనున్నాయి.

# యూరియా కొరత సృష్టిస్తే చర్యలు: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

**-యూరియా ఎం ఆర్ పి ధరకే విక్రయించాలి**

**-కంట్రోల్ రూమ్ నెంబర్లు :8331057300, 9491940106, 8919081933**

వైయస్సార్ కడప జిల్లా, ఆగస్టు 23(భారత శక్తి):జిల్లాలో కృత్రిమ యూరియా కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్స్ ను హెచ్చరించారు. కలెక్టరేట్లోని బోర్డు హాల్లో వ్యవసాయ అధికారులు, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్స్ లతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రవేట్ ఫర్టిలైజర్స్ వ్యాపారులు కృత్రిమ యూరియా కొరత సృష్టిస్తే చర్యలు కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలోని దాదాపు 430 ప్రైవేట్ ఫర్టిలైజర్స్ షాపుల వద్ద యూరియా ఎరువుల ఎమ్మార్పీ రేట్ల తో కూడిన బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు ఎరువులకోసం ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, జిల్లావ్యాప్తంగా యూరియా ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 3700 యూరియా అందుబాటులో ఉందని గతంతో పోలిస్తే 20% అధిక నిలువలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు ఎం ఆర్ పి ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేపటినుండి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల ద్వారా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రవేట్ ఫర్టిలైజర్స్ వ్యాపారులు యూరియాతోపాటు నానో కాంప్లెక్స్ ఎరువులు వంటి



వాటిని జత చేసి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు సరిపోయే యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అక్రమంగా యూరియాను వినియోగిస్తున్నా, అధిక ధరలకు విక్రయిస్తున్నా, సంబంధిత సమాచారం కోసం జిల్లా వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చున్నారు.

లి లికంట్రోల్ రూమ్ నెంబర్లు : 8331057300, 9491940106, 8919081933లి

ఈ నవూవేశంలో వ్యవసాయ శాఖ జీడీ చంద్ర నాయక్,జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరావు కంట్రోల్ రూమ్ అధికారులు, ప్రవేట్ ఫర్టిలైజర్స్ డీలర్లు,తదితర అధికారులు పాల్గొన్నారు.

## బోనకల్ షైన్ హై స్కూల్‌లో విద్యార్థి సంఘం ఎన్నికలు విజయవంతంగా నిర్వహణ

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), ఆగష్టు 23:స్థానిక షైన్ హై స్కూల్ లో స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎలక్షన్స్ ని నాలుగవ తరగతి నుంచి పదవ తరగతి వరకు నిర్వహించారు. పిల్లలు వివిధ కేటగిరీస్ కు నామినేషన్స్ వేయడం జరిగింది... ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ, ఈ ఎలక్షన్స్ వల్ల పిల్లల్లో ఎలక్షన్స్ మీద అవగాహన పెరుగుతుందని, వాళ్లకు సొసైటీ పట్ల భాద్యతలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



## చేసిన అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఈ యాత్ర.




ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఆగష్టు23:ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా జనహిత పాదయాత్రలో అందరూ భాగస్వాములు కావాలి అని ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశంలో మంత్రులు లక్ష్మణ్,సీతక్క, ఎమ్మెల్యే లు అన్నారు. ఆగస్ట్ 25,26 తేదీలలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర వర్ధన్నపేట నియోజకవర్గంలో చేపట్టిన క్రమంలో శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు,పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా పార్టీ వ్యవహారాల ఇంచార్జ,రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ,వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ,రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ,పంచాయత్రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క). ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య,లక్ష్మణ్ నాయక్,పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యేలు కే ఆర్ నాగరాజు,రాజ్ ఠాకూర్,శ్రీమతి యశస్విని రెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ,నమిండ్ల శ్రీనివాస్,ధర్మారావు,పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్,బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,దుద్దిళ్ల శ్రీను బాబు,పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాష్ ,పైడకుల అశోక్,మేయర్ శ్రీమతి గుండు సుధారాణి,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సమావేశ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచన మేరకు నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర ద్వారా ప్రజల్లో కి ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలు అందరికీ వివరించే విధంగా ప్రణాళికలు రూపొందించామని అన్నారు. వర్ధన్నపేట శాసన సభ్యులు ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేతృత్వంలో పాదయాత్ర జరుగుతుందని మంత్రి అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని జనహిత పాదయాత్ర వివరాలు: 25.08.2025 న సాయంత్రం 04.00 గంటలకు, వర్ధన్నపేట మండలం, ఇల్లంద మార్కెట్ నుండి వర్ధన్నపేట టౌన్ అంబేద్కర్ సెంటర్ వరకు 26.08.2025 న ఉదయం 06.30 గంటలకు,

వర్ధన్నపేట టౌన్ ఫిరంగిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో శ్రమదాన కార్యక్రమం, ఉదయం 10:00 గం. లకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్నారు. ఉదయం 11.30 గంటలకు, వర్ధన్నపేట టౌన్ శివారు లోని లక్ష్మి గార్డెన్స్ నందు జిల్లా కార్యకర్తల సమావేశం. ఆయా జిల్లాల అధ్యక్షులు వారి నేతృత్వంలో పాదయాత్రని విజయవంతం చేసేలా సన్నద్ధం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. గడిచిన 20 నెలల్లో భారతదేశంలోనే ఏ ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు సవివరంగా ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలు,ఆలోచన విధానాలను ప్రజల వివరించే దిశగా సాగాలని ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు పాదయాత్ర దోహదపడుతుందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని ఇకపై అభివృద్ధి తో పాటు పార్టీ బలోపేతం,కార్యకర్తలు అభివృద్ధి,పదవులు విషయంలో మరింత చురుకుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయం సాధించి తీరుతామని ఆశాభావం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా భద్రఖాలి అమ్మవారి ఆశీస్సులతో ఉమ్మడి జిల్లా నేతలు ఐకమత్యంతో సమన్వయంగా పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు పరమపదించిన వామపక్ష సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి కి మౌనం వహిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మినీ ట్యాంక్ బండ్ (నల్లచెరువు కట్ట)ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం.

వనపర్తి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మినీ ట్యాంక్ బండ్ (నల్లచెరువు కట్ట) ను ఎంతో ఆహ్లాద భరితంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మినీ ట్యాంక్ బండ్ పై 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మెయిన్ గేట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అధునాతనంగా నిర్మించే ఈ మెయిన్ గేట్ నిర్మాణంతో ట్యాంక్ బండ్ ఎంత శోభాయమానంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ పాకనాటి కృష్ణయ్య, లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రథం గుట్ట పరిసరాలు దాగివున్న రత్నం

## -అడ్వెంచర్ టూరిజం కోసం పరిశీలించిన అధికార యంత్రాంగం



మణుగూరు,ఆగష్టు 23 (భారతశక్తి): రథం గుట్ట పరిసరాలు ఒక దాచిన రత్నం లాంటిదని మండల అధికారులు అన్నారు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో మండలంలోని హనుమాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న రథం గుట్టను మండల అభివృద్ధి అధికారి తేళ్ళూరి శ్రీనివాసరావు, ఫారెస్టు అధికారి ఉపేందర్, తహసీల్దార్ అద్దంకి నరేష్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ రైఫిల్ షూటర్ నభి, జిప్‌లైన్ అడ్వెంచర్ ప్రతినిధులతో కలిసి సందర్శించారు.

ఎత్తైన కొండలు, అడవి జీవవైవిధ్యం, చిన్న జలప్రవాహాలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. పర్యాటకులు చేరడానికి మార్గాలు, సౌకర్యాలు పరిమితంగా ఉన్నప్పటికీ, ప్రకృతి అందాలు, సాహసోపేత అనుభూతి కోసం ఇది అనువైన స్థలంగా పరిశీలించారు. భౌగోళిక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిస్థితులు పరిశీలించి అడ్వెంచర్ టూరిజం కోసం ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌లో జిప్‌లైన్, జిప్ బైక్, గ్లాస్ బ్రిడ్జ్, రాకెట్ ఈజెక్షన్ వంటి కార్యకలాపాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ ఆధునిక సాంకేతిక పరికరాలు, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ అమలు చేయబడతాయన్నారు. ప్రతి కార్యాచరణ పర్యావరణ నష్టాన్ని తగ్గిస్తూ స్థిరమైన విధానంలో రూపకల్పన చేయాలన్నారు.

ఈ ప్రాజెక్ట్ స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. గైడ్‌లు, నిర్వహణ సిబ్బంది, సాహస శిక్షకులు వంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అలాగే స్థానిక హస్తకళా, చిన్న పరిశ్రమలకు మార్కెట్ అవకాశాలు కూడా పెరుగుతాయని, పర్యాటకుల కోసం సమాచార కేంద్రాలు, స్థానిక శిక్షణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయబడతాయన్నారు. ఈ ప్రణాళికలో రహదారులు, ట్రెయిల్‌లు, వీక్షణ పాయింట్లు పర్యాటకుల సౌకర్యానికి అనుగుణంగా ఏర్పాటు చేయలన్నారు.

ఈ కార్యకలాపాలు ప్రకృతికి హాని చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, ప్రాజెక్ట్ ప్రచారం, అవగాహన కార్యక్రమాలు ద్వారా రథం గుట్టను ప్రాంతీయ, రాష్ట్రీయ, దేశీయ పర్యాటకులకు పరిచయం చేయాలన్నారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా రథం గుట్ట పరిసరాలు ప్రకృతి అందాలు, ఆధునిక అడ్వెంచర్ స్పోర్ట్స్ మేళవింపు వల్ల ప్రత్యేక ఆకర్షణగా మారుతుందన్నారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ, పర్యాటకులకు సాహసోపేతమైన అనుభూతి, మండలానికి కొత్త టూరిజం హబ్‌గా గుర్తింపు ఇస్తుందని జిప్‌లైన్ అడ్వెంచర్ ప్రతినిధులు మండల అధికారులకు తెలియజేశారు.

# రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**-రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.**

**-కంట్రోల్ రూమ్ నెంబర్లు: 8331057300, 9491940106, 8919081933**



వైయస్సార్ కడప, ఆగస్టు23: జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయనీ,రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో యూరియా లభ్యతపై జాయింట్ కలెక్టర్ అదితీ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు అవసరమైన మేర స్టోరేజీ అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిమాండ్ ఆధారంగా ఎరువులు ఆర్ ఎస్ కే ల ద్వారా అందజేస్తామని తెలిపారు.జిల్లాలో ఇప్పటి వరకు ఆర్ ఎస్ కే లలో 3700 టన్నుల ఎరువులు అందుబాటు లో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలన్నారు.ప్రవేట్ ఎరువుల డీలర్స్ నిబంధనల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. బల్క్‌స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. డీలర్స్ రైతుల డిమాండ్ ను ఆసరాగా చేసుకుని అనవసరమైన వేరే ఉత్పత్తులను, పోషకాలను లింక్ చేసి అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకొని,వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే అక్రమ ఎరువుల నిలువలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆగస్టు నెలలో 15 రోజులు ముందుగానే కేసి కెనాల్ బెల్ట్ లో సాగు మొదలైందని రైతులందరికీ అవసరం మేరకు యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని తెలిపారుఆర్ఎస్కే లలో ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులలో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా యూరియా కొత్త ఏర్పడితే 24 గంటల్లో దగ్గర ఉన్న ఆర్ఎస్కే ద్వారా అందజేస్తామని తెలిపారు. ఒక ఎకరాకు ఒక యూరియా బస్తా సరిపోతుందని రైతులు ఆందోళన చెందకుండా అవసరం మేరకు వినియోగించాలని తెలిపారు. అక్రమ యూరియా నిల్వలు ,వాడకం జరిగితే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రేపటి నుంచి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులు మార్పి ధర కంటే రైతులకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు.రైతుల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడి చంద్రా నాయక్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీనివాసరావు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత

**-నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి**

**-ఘనంగా ఆంధ్ర కేసరి జయంతి ఉత్సవాలు**





వైయస్సార్ కడప జిల్లా, ఆగస్టు23(భారత శక్తి): స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత అని, భవిష్యత్ తరాలకు ఆదర్శ ప్రాయులని నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి అన్నారు.శనివారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్ నందు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి...మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతిని ఘనంగా జరుపుకోవడం జరుగుతోందని అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సమాజం కోసం అంకిత భావంతో పనిచేశారని అన్నారు.

ఆంధ్ర రాష్టానికి మొదటి ముఖ్య మంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు నిరుపేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం పంతులు ఒకరని అన్నారు..ఆయన పేరు మీద రాజమండ్రిలో ప్రకాశం బ్యారేజ్ నిర్మించారని నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు.

ఆయన జ్ఞాపకార్థం ఒంగోలు జిల్లా కు ప్రకాశం అనే పేరు పెట్టడం జరిగిందన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమిషన్ భారతీయులపై కాల్పులు జరపగా, వారికి ఎదురుగా నిలిచి గుండెలు చూపిన ధీరుడు ప్రకాశం పంతులని అన్నారు. ప్రకాశం చూపించిన ధైర్య సాహసాలకు ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అని బిరుదు ఇచ్చారన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా రాణించి ఆంధ్ర రాష్టానికి జాతీయ స్థాయిలో ఎనలేని కీర్తి తీసుకొచ్చారని కొనియాడారు. 1922వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమ సమయంలో గుంటూరులో 30 వేల మంది కాంగ్రెస్ వాలంటీర్లతో ప్రదర్శనలు నిర్వహించారన్నారు.

సైమన్ కమిషన్ లో ఒక్క భారతీయుడు కూడా లేకపోవడంతో 3 ఫిబ్రవరి 1928వ సంవత్సరంలో సైమన్ కమిషన్ మద్రాస్ ను సందర్శించినప్పుడు ప్రకాశం " సైమన్ గో బ్యాక్" అనే నినాదంతో బహిష్కరణ చేసారన్నారు.టంగుటూరి ప్రకాశం పంతులు 23 ఆగస్టు 1872 వ సంవత్సరంలో మద్రాస్ ప్రెసిడెంట్ (ఇప్పటి ప్రకాశం జిల్లా) ఒంగోలు నగరంలోని వినోదయ రాయుని పాలెం అనే గ్రామంలో సుబ్బమ్మ, గోపాలకృష్ణయ్య అనే దంపతులకు జన్మించారని అన్నారు.

చిన్నతనం నుంచే ప్రకాశం కి లాయర్ అవ్వాలని కోరిక ఉండేదని, టీచర్ హనుమంతరావు నాయుడు ప్రకాశాన్ని ఫీజు లేకుండా మెట్రిక్యులేషన్ లో చేర్పించారని అన్నారు. మంచి విద్య అందించడానికి టీచర్ హనుమంతరావు నాయుడు తనతో పాటు రాజమండ్రి కి తీసుకువెళ్లారని తర్వాత మద్రాసులో న్యాయ శాస్త్రం చదవటానికి వెళ్లడం జరిగిందని సెకండ్ గ్రేడ్ ప్లీడర్ అయ్యారన్నారు. కొన్ని రోజులు లాయర్ గా పనిచేసి రాజమండ్రి కి వెళ్లారని న్యాయవాద వృత్తిలో బాగా పేరు మరియు సంపదను సంపాదించారన్నారు.ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు.తొలుత జ్యోతి ప్రజ్వలన కావించి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మెప్మా పిడి కిరణ్ కుమార్,స్టెప్ సీఈవో సాయి గ్రేస్, ఐసిడిఎస్ అధికారిని రమాదేవి,కలెక్టరేట్ సిబ్బంది,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించమే బ్యాగ్ లెస్ డే ముఖ్య ఉద్దేశం : అనుదీప్ దురిశెట్టి

**-జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల నాలుగో శనివారం బ్యాగ్ లెస్ డే అమలు**

**-మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం**

**-విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు అవకాశం**

ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి ), ఆగష్టు 23:విద్యార్థుల్లో అభిరుచి, ఆసక్తిని బట్టి ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించడమే బ్యాగ్ లెస్ డే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పిల్లలకు చదువుల ఒత్తిడిని తగ్గిస్తూ, ఏకాగ్రతను పెంచుతూ ఉల్లాసపూరిత వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.శనివారం, నెలలో నాలుగవ శనివారం నిర్వహించే బ్యాగ్ లెస్ డే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇందిరనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు కాగితపు బొమ్మలు పూలతో కలిపి చేసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకడంతో కలెక్టర్ మురిసిపోయారు. పిల్లలు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్స్, పోస్టర్ డిజైనింగ్, ఫజిల్స్ సాల్వింగ్, పేపర్ తో చేసిన పలు ఆకృతులను కలెక్టర్ తిలకించారు. నృత్యం, సంగీతం, పలు గీతాలు, గేయాలాపన, ప్రసంగాలు వంటి ప్రదర్శనలను ఆస్వాదించారు. ముఖ్యంగా మట్టి, పిండితో వినాయక విగ్రహాలు తయారు చేసిన విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులపై పుస్తకాలు, హెూంవర్క్ బరువును తగ్గించి, ఆటపాటలు, క్రీడలు, కళలు, పర్యావరణ పరిరక్షణ అవగాహన, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేందుకు వీలు కల్పించడం, చదువులపై ఏకాగ్రత పెంచడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు తమ బరువైన బ్యాగులను నెలలో ఒక్కసారైనా పాఠశాలలకు తీసుకెళ్లకుండా ఆనందాన్ని కలిగించేందుకు వీలును బట్టి మ్యూజియం, చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల సందర్శన, సైన్స్ ప్రయోగాలు, విద్యపై స్కిట్, పతంగుల తయారీ, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గణిత కార్నర్, రంగోలి, మోడల్ ఎన్నికలు, మాక్ అసెంబ్లీ, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, బేస్డ్



లెర్నింగ్, ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి విద్యార్థులకు అవకాశం లభిస్తుందని తెలిపారు.విద్యార్థులు తమ ఉత్తమ రచనలను కళాత్మక రూపంలో ప్రదర్శించడానికి ఆసక్తిగా పాల్గొంటారని, సెలవుదినానికి ముందు రోజు విద్యార్థులు సంతోషంగా ఉండటం చాలా బాగుంటుందని అన్నారు. సమూహంగా నైపుణ్య కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు కలుగుతుందని తెలిపారు. ప్రతి నెలలో నాలుగో శనివారం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో బ్యాగ్ లెస్ డే గా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పండుగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా వినాయక చవితి పండుగ రోజున మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో కాలుష్యానికి కారణమయ్యే, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కన పెట్టి, పర్యావరణ హిత మట్టి గణపతులకు ప్రాధాన్యమిద్దామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. కలెక్టర్ సందర్శన సమయంలో ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 23 (భారతశక్తి): ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శనివారం ఐడిఓసీ కార్యాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని చెప్పారు. మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. మన జిల్లా నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించు కోవాలని, గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని, మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలన్నారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలన్నారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని చెప్పారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విద్యా చందన, డిపిఓ చంద్రమౌళి, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, కొత్తగూడెం, ఆర్డీవో మధు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజు "రూ.23 కోట్ల 22 లక్షల" పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, చేసిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి.

పనుల జాతర కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం ఒకేరోజు 23 కోట్ల 22 లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంగన్వాడి కేంద్రాల బినిర్మాణాలకు శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు 18 నెలల్లో మొత్తం రూ: 1759 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని ఇందులో భాగంగానే శుక్రవారం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో పలు అంగన్వాడి కేంద్రాలు, గ్రామపంచాయతీ నూతన భవనాల ప్రారంభంలో, రహదారుల ఇబ్బందులు తొలగించేందుకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాల, హెల్త్ సెంటర్లు, పాఠశాల భవనాలను ప్రారంభాలు చేపట్టినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారుగత పదేళ్ల ఃఖీూ పాలనలో వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి కేవలం, పేపర్లకు పరిమితమై భూతద్దంలోనే కనిపించిందన్నారునేటి ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన అభివృద్ధి పనుల జాతర కొనసాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# మెదడులో పెను విపత్తు

పక్షవాతం చెట్టంత మనిషిని హఠాత్తుగా కుప్పకూలేలా చేస్తుంది. కాలూ చేయి చచ్చుబడేలా చేసి, మంచాన పడేస్తుంది. అవయవాలు స్వాధీనంలోకి వచ్చినా ఎంతోకొంత వైకల్యం వేధిస్తూనే ఉంటుంది. పక్షవాతం బాధితుల్లో 30% మంది ఇలాంటివారే. రోజువారీ పనులకు ఇతరుల మీద ఆధారపడుతున్నవారే. కేవలం నూటికి 30 మందే మునుపటి స్థితికి చేరుకుంటున్నారు. మరో 30% మంది మృత్యువాత పడుతున్నారు. నిజానికి పక్షవాతాన్ని చాలావరకూ నివారించుకోవచ్చు. లక్షణాలను ముందే గుర్తిస్తే సమస్య తీవ్రం కాకుండానూ చూసుకోవచ్చు. ఇటీవల రామోజీ ఫిల్మ్‌సిటీలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ నిర్వహించిన కార్యశాలకు విచ్చేసిన వైద్య నిపుణులు ముక్తకంఠంగా చెబుతున్న విషయమిదే.



సత్వర స్పందన కీలకం

పక్షవాతం కేసులు రోజురోజుకీ పెరుగుతుండటం ఆందోళనకరం. 25 ఏళ్లు దాటినవారిలో ప్రతి నలుగురిలో ఒకరు దీని బారినపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా 60 ఏళ్లు దాటినవారిలో దీన్ని చూస్తుంటాం. కానీ ఇప్పుడు 30ల్లో, 40ల్లోనూ ఎంతోమంది దీని బారినపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కాబట్టి ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగుండటం తప్పనిసరి.

రెండు రకాలు: పక్షవాతం రెండు రకాలు. ఒకటి- మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో రక్తం గడ్డలు ఏర్పడటం వల్ల వచ్చేది (ఇస్కీమిక్). పక్షవాతం కేసుల్లో ఇదే ఎక్కువ. సుమారు 85% మందిలో ఇలాంటి రకం కనిపిస్తుంటుంది. రెండు- మెదడులో రక్తనాళాలు చిట్లిపోయి రక్తస్రావం కావటం వల్ల తలెత్తేది (హెమరేజిక్). పక్షవాతం బారినపడుతున్న దాదాపు 15% మంది దీనికి గురవుతున్నారు.

ప్రధాన ముప్పు కారకాలు: పక్షవాతానికి అధిక రక్తపోటు, మధుమేహం, పొగ తాగటం.. జర్దా, గుట్కా, ఖైనీ నమలటం.. అతిగా మద్యం తాగటం, కుటుంబంలో ఇంతకుముందు ఎవరికైనా పక్షవాతం వచ్చి ఉండటం ప్రధాన ముప్పు కారకాలు. గుండె లయ తప్పటం వంటి కొన్ని గుండెజబ్బులూ కారణం కావొచ్చు. ఇలాంటివారికి రక్తం గడ్డలు ఏర్పడే ముప్పు ఎక్కువ. ఇవి మెదడు రక్తనాళాలకు చేరుకొని పక్షవాతం సంభవించొచ్చు. మరోవైపు జన్యు స్వభావమూ మన భారతీయులకు ముప్పు తెచ్చిపెడుతోంది. పాశ్చాత్యదేశాల కన్నా మనదేశంలో పదేళ్ల ముందే పక్షవాతం దాడి చేస్తోంది.

వీలైనంత త్వరగా చికిత్స: ఇస్కీమిక్, హెమరేజిక్ పక్షవాతాలకు చికిత్సలు రెండూ వేర్వేరే. ఒకదానికి చేసే చికిత్స మరోదానికి భిన్నం. కాబట్టి వీటి మధ్య తేడా తెలుసుకోవటం ముఖ్యం. ఇందుకు సీటీ స్కాన్ ఉపయోగపడుతుంది. సమస్యను నిర్ధరించి ఎంత త్వరగా చికిత్స చేస్తే అంత మంచి ఫలితం కనిపిస్తుంది. మెదడుకు రక్త సరఫరా ఆగిపోతే ప్రతి నిమిషానికి 20 లక్షల నాడీ కణాలు చనిపోతాయి. ఇవి తిరిగి కుదురుకోవు. అందుకే ప్రతి నిమిషమూ అమూల్యమే. వీలైనంత త్వరగా చికిత్స ఆరంభించి, మెదడుకు తిరిగి రక్త సరఫరా చేయగలిగితే నాడీ కణాలు చనిపోకుండా, మెదడు మరీ ఎక్కువగా దెబ్బతినకుండా చూడొచ్చు. ఫలితంగా త్వరగా కోలుకోవటానికి వీలుంటుంది. ఆలస్యమైనకొద్దీ నాడీ కణాలు దెబ్బతింటూనే వస్తుంటాయి. ప్రాణాపాయమూ సంభవించొచ్చు. ముఖ్యంగా అధిక రక్తపోటు మందులు క్రమం తప్పకుండా వేసుకోకపోయినా, హైబీపీ ఉన్న సంగతి తెలియక పోయినా, తెలిసి నిర్లక్ష్యం చేసినా పక్షవాతం తీవ్రంగా దాడి చేస్తుంది. తీవ్రమైన తలనొప్పి, వాంతులతో కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదముంది. నాలుగున్నర గంటల్లోపు గడువును అమూల్య సమయం (గోల్డెన్ అవర్)గా భావిస్తారు. ఈ గడువు లోపు చికిత్స ఆరంభిస్తే మెదడు మరీ ఎక్కువగా దెబ్బతినకుండా చూసుకోవచ్చు. ఇప్పుడు రక్తం గడ్డలను కరిగించే మంచి మందులు ఉన్నాయి. వీటిని సమయానికి ఇస్తే చాలామందిని మంచాన పడకుండా, ప్రాణాపాయం సంభవించకుండా కాపాడుకోవచ్చు. హెమరేజిక్ పక్షవాతానికి చికిత్స కష్టమనే చెప్పుకోవాలి. ఎందుకంటే నేరుగా మెదడులో రక్తస్రావాన్ని ఆపలేం. రక్తం గడ్డకట్టే ప్రక్రియలను ఉత్తేజితం చేయటం ద్వారా రక్తస్రావాన్ని తగ్గించటమో లేదా ఆపటమో చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ప్రయోగాత్మకంగా రక్తస్రావాన్ని ఆపే ట్రానిగ్జామిక్ యాసిడ్ వంటి కొత్త మందులనూ ప్రయత్నిస్తున్నారు. కొందరికి రక్తస్రావమైన చోట చుట్టుపక్కల లేదా మెదడులో వాపు తలెత్తి తలలో ఒత్తిడి బాగా పెరుగుతుంది. వీరికి వాపు తగ్గించే మందులు అవసరం. కొన్నిసార్లు ఒత్తిడిని తగ్గించటానికి సర్జరీతో పుర్రెలో కొంత భాగాన్ని తొలగించాల్సి వస్తుంది. గుండెజబ్బులు గలవారిలో కొందరు రక్తాన్ని పలుచగా ఉంచే మందులు వేసుకుంటుంటారు. ఇలాంటివారికి పక్షవాతం వస్తే విరుగుడు మందులు ఇవ్వాల్సి ఉంటుంది.

స్వల్ప పక్షవాతం విభిన్నం: కొందరిలో పక్షవాతం స్వల్పంగా (ట్రాన్సియెంట్ ఇస్కీమిక్ ఎటాక్) వస్తుంటుంది. ఇందులో లక్షణాలు కొద్దిసేపే ఉండి, వాటంతటవే పోతాయి. దీన్ని చాలామంది తేలికగా తీసుకుంటారు. ఇది ముమ్ముందు నిజంగా పక్షవాతం రాబోతోంది అనటానికి హెచ్చరిక. స్వల్ప పక్షవాతం వచ్చిన తొలి మూడు రోజుల్లో లేదా వారంలో పెద్ద పక్షవాతం వచ్చే ముప్పు చాలా ఎక్కువ. కాబట్టి నిర్లక్ష్యం చేయొద్దు.

టైమ్ ఈజ్ బ్రెయిన్

ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా చాలామంది పక్షవాతం బారినపడుతున్నారు. దీని మూలంగా ఎంతోమంది జీవనోపాధి కోల్పోతున్నారు. గుండె జబ్బుల్లో టైమ్ ఈజ్ మజిల్ అనే నానుడి ప్రచారంలో ఉంది. అంటే ఎంత త్వరగా చికిత్స మొదలెడితే గుండె కణజాలాన్ని అంత ఎక్కువగా కాపాడుకోవచ్చని. పక్షవాతం విషయంలోనూ టైమ్ ఈజ్ బ్రెయిన్ అని చెప్పుకోవాలి. ఎంత త్వరగా చికిత్స చేస్తే అంత త్వరగా కోలుకుంటారు. చికిత్స మూడు గంటలు ఆలస్యమైతే 30 ఏళ్ల ముందే వృద్ధాప్యంలోకి జారిపోతారు. తమ పనులు తాము చేసుకోలేరు. కుటుంబానికి భారంగా మారతారు. 30, 40 ఏళ్లలోనే పక్షవాతం బారినపడితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తుంది. కాబట్టి అంతా జాగ్రత్తగా ఉండాలి. జబ్బు వచ్చాక బాధపడే కన్నా ముందు నుంచే నివారణ చర్యలు తీసుకోవాలి. జీవనశైలిని మార్చుకోవటం, అధిక రక్తపోటు సమస్య ఉంటే ముందే గుర్తించి మందులు వాడటం చాలా ముఖ్యం. తెల్ల బియ్యానికి బదులు దంపుడు బియ్యం తినాలి. అదీ మితంగానే. అలాగే పప్పులు, కూరగాయలు విధిగా తీసుకోవాలి. నెయ్యి, నూనె పదార్థాలు మితంగా తీసుకోవాలి. యోగా.. ముఖ్యంగా సూర్య నమస్కారాలు చేయటం ఉత్తమం.

# రొమ్ముక్యాన్సర్‌కు తేనె చికిత్స

రొమ్ముక్యాన్సర్‌కు సహజ చికిత్స ఉంటే? అదీ తీయని తేనెలాంటిదైతే? అంతకన్నా కావాల్సిందేముంది? యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెలిస్ (యూసీఎల్ఏ) శాస్త్రవేత్తలు అలాంటి తీపి కబురే అందించారు. మనుకా తేనె రొమ్ముక్యాన్సర్ కణాల వృద్ధిని 84% వరకూ తగ్గిస్తున్నట్టు గుర్తించారు. అదీ ఆరోగ్యకర కణాలకు ఎలాంటి హాని చేయకుండా, మరీ పెద్ద దుష్ప్రభావాలేవీ లేకుండా. అందుకే రొమ్ముక్యాన్సర్.. ముఖ్యంగా ఈస్ట్రోజన్ గ్రాహక (ఈఆర్) పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ నివారణ, చికిత్సలో ఇది ప్రత్యామ్నాయ, సహజ పద్ధతి కాగలదని ఆశిస్తున్నారు.

అటు పోషకాహారంగా ఇటు ఔషధంగా ఉపయోగపడే న్యూట్రాస్యూటికల్స్ రోజురోజుకీ ప్రాచుర్యం పొందుతున్నాయి. గ్రీన్ టీ, ఒమేగా 3 కొవ్వులు, అశ్వగంధ జిన్‌సెంగ్ వంటివి వీటి కోవలోకి వచ్చేవే. ఇలాంటి పోషణ ఔషధాల్లో మనుకా తేనె గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మామూలుగా తేనెటీగలు రకరకాల పూల నుంచి మకరందాన్ని సేకరించి తేనెను తయారుచేస్తాయి. కానీ



మనుకా తేనె అలాంటిది కాదు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఆగ్నేయాసియా ప్రాంతంలో పెరిగే ఒక టీ ట్రీ (లెప్టోస్పెర్మమ్ స్కోపేరియం) పువ్వుల మకరందాన్ని మాత్రమే తేనెటీగలు సంగ్రహించేలా చేసి, దీన్ని తయారుచేస్తారు. ఇది కాస్త జిడ్డుగా ఉంటుంది. దీనికి చాలా ఔషధ గుణాలున్నాయి. మనుకా తేనె యాంటీబ్యాక్టీరియా, యాంటీఆక్సిడెంట్ గుణాలను కలిగున్నట్టు అధ్యయనాల్లో తేలింది. అంటే బ్యాక్టీరియాను నిర్మూలించటంతో పాటు వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)నూ తగ్గిస్తుందన్నమాట. క్యాన్సర్ వంటి జబ్బులకు వాపు ప్రక్రియే బీజం వేస్తుండటం గమనార్హం. తాజాగా మనుకా తేనె రొమ్ముక్యాన్సర్ నివారణ, చికిత్సకు తోడ్పడగలదని యూసీఎల్ఏ ప్రాథమిక అధ్యయనంలో తేలటం ఆసక్తి కలిగిస్తోంది. సంప్రదాయ కీమోథెరపీకి సహజ, తక్కువ విషతుల్యమైన ప్రత్యామ్నాయ చికిత్స రూపకల్పన దిశగా ఇది ఆశలు రేకెత్తిస్తోందని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ డయానా మార్క్వెజ్ గర్బన్ చెబుతున్నారు. క్యాన్సర్ చికిత్సలో సహజ రసాయన మిశ్రమాల ప్రయోజనాలను పూర్తిగా అర్థం చేసుకోవటానికి మరింత పరిశోధనలు చేయాల్సిన అవసరమున్నప్పటికీ ఈ రంగంలో భవిష్యత్ పరిశోధనకు ఈ అధ్యయనం బలమైన పునాది వేసిందని అభిప్రాయపడుతున్నారు.

ఈఆర్ పాజిటివ్ రకమే ఎక్కువ

రొమ్ముక్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 60% నుంచి 70% వరకూ ఈఆర్ పాజిటివ్ రకమే కనిపిస్తుంటుంది. ఇందులో క్యాన్సర్ కణాల్లోని గ్రాహకాలు ఈస్ట్రోజన్ హార్మోన్‌ను సంగ్రహించుకొని, కణితి వృద్ధి చెందేలా చేస్తాయి. ఇలాంటి రకం క్యాన్సర్ గలవారికి కణితి వృద్ధిని అడ్డుకోవటానికి యాంటీ ఈస్ట్రోజన్ చికిత్స సూచిస్తుంటారు. అయితే కొందరిలో ఈ చికిత్స పనిచేయదు. దీనికి లొంగకుండా క్యాన్సర్ మొండిగా తయారవుతుంది. వీరికి కీమోథెరపీ చేయక తప్పదు. దీంతో జుట్టు ఊడటం, నోట్లో పుండ్లు, ఆకలి తగ్గటం, అలసట, ఇన్‌ఫెక్షన్ల వంటి దుష్ప్రభావాలు తలెత్తుతుంటాయి. మనుకా తేనెతో ఇలాంటి ఇబ్బందులు తప్పే అవకాశముంది.

ప్రయోగం ఎలా?

పరిశోధకులు ఈస్ట్రోజన్ రిసెప్టర్ పాజిటివ్, ట్రిపుల్ నెగెటివ్ (ఇందులో కణాలకు ఎలాంటి గ్రాహకాలూ ఉండవు) క్యాన్సర్ కణాలను ప్రయోగశాలలో వృద్ధి చేశారు. కొన్ని కణాలకు మనుకా తేనె, మనుకా తేనె పొడితో చికిత్స చేశారు. మరికొన్నింటికి సంప్రదాయ చికిత్సతో పరిశీలించారు. ట్రిపుల్ నెగెటివ్ క్యాన్సర్ కణాల్లో కణితిని అడ్డుకునే ప్రభావాలు అంతగా కనిపించలేదు. యాంటీ ఈస్ట్రోజన్ చికిత్సలో విరివిగా వాడే టామోక్సిఫెన్ మందును మనుకా తేనెతో కలిపి వాడగా ఈఆర్ పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ కణాల వ్యాప్తి గణనీయంగా తగ్గిపోవటం గమనార్హం. మరింత నిశితంగా కణాలను పరిశీలించగా తేనె మూలంగా రక్తంలో ఈస్ట్రోజన్ మోతాదులు, కణాల్లోని గ్రాహకాలు తగ్గినట్టు తేలింది. అంతేకాదు, కణితి కణాలు తమకు తాముగా చనిపోయేలా ప్రేరేపితం కావటం వల్ల క్యాన్సర్ వృద్ధి చెందే ప్రక్రియ కూడా అస్తవ్యస్తమైంది. అనంతరం ఎలుకల మీదా పరిశోధకులు అధ్యయనం చేశారు. మనుషుల ఈఆర్ పాజిటివ్ రొమ్ముకణాలను ఎలుకల్లో ప్రవేశపెట్టి, కణితి వృద్ధి చెందేలా చేశారు. తర్వాత కొన్నింటికి మనుకా తేనె తాగించారు. మామూలు ఎలుకలతో పోలిస్తే తేనె తాగిన వాటిల్లో కణితి వృద్ధి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఆరోగ్య కణాలకు హాని చేయకుండా మానవ రొమ్ముక్యాన్సర్ కణితి వృద్ధి, వ్యాప్తి 84% వరకూ తగ్గినట్టు బయటపడింది.

ఏంటీ ప్రయోజనం?

మనుకా తేనె వంటి సహజ రసాయన మిశ్రమాలకు కణితిని నిలువరించే గుణమున్నట్టు, హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ రొమ్ముక్యాన్సర్ల విషయంలో మరింత ప్రభావం చూపుతున్నట్టు అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ముమ్ముందు అనుబంధ ఔషధం లేదా బలమైన ప్రత్యామ్నాయ చికిత్సగా మనుకా తేనెను అభివృద్ధి చేసే అవకాశముందని భావిస్తున్నారు. క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలనూ చంపే క్యాన్సర్ మందులకిది ప్రత్యామ్నాయం కాగలదని ఆశిస్తున్నారు.

# మనసా.. తిండి వైపా?

ఆకలి వేసినప్పుడు తినటం మామూలే. కానీ కొందరు ఏమీ తోచనప్పుడు, విసుగు (బోర్) పుట్టినప్పుడూ తింటుంటారు. చిప్స్, జంతికలో.. ఏదో ఒకటి నోట్లో వేసుకొని నములు తుంటారు. విసుగు పుట్టినప్పుడు మెదడు కొంత హుషారును కోరుకుంటుంది. ఇదే చిరుతిండి వైపు దృష్టి మళ్లించేలా చేస్తుంది. ఎప్పుడో అప్పుడంటే ఏమో గానీ తరచూ ఇలా తింటుంటే చిక్కులు తప్పవు. కేలరీలు



తప్ప ఎలాంటి పోషకాలు లేని జంక్‌ఫుడ్‌తో బరువు పెరగటం, మధుమేహం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. కాబట్టి జాగ్రత్త అవసరం. ఏమీ తోచనప్పుడు చిరుతిళ్ల వైపు చూడటం కన్నా ప్రత్యామ్నాయ మార్గాలను పాటించటం మేలు.

నీరు తాగటం: ఆకలి వేస్తున్నట్టు అనిపించినా కొన్నిసార్లు దీనికి దాహం కారణం కావొచ్చు. కాబట్టి వెంటనే చిరుతిండికి బదులు ఓ గ్లాసు నీరు తాగి చూడండి. ఇది చాలాసార్లు ఆకలి తగ్గటానికి తోడ్పడుతుంది.

మనసును మళ్లించటం: విసుగు పుట్టినప్పుడు మనసును దారి మళ్లిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. అటూ ఇటూ నాలుగడుగులు వేయటం, ఇష్టమైనది ఏదైనా చదవటం, స్నేహితులతో మాట్లాడటం మేలు. దీంతో తిండి వైపు యావ తగ్గుతుంది.


ఏదైనా నమలటం: బబుల్‌గమ్, సోంపు వంటివి నోట్లో వేసుకుని నములుతుంటే అనవసరంగా చిరుతిండి తినకుండా చూసుకోవచ్చు. అంతేకాదు, తక్కువ కేలరీలతో కడుపు నిండిన భావనా కలుగుతుంది.

గ్లూకోజు స్థిరంగా: రక్తంలో గ్లూకోజు మోతాదులు తగ్గినప్పుడు చిరుతిండి తినకుండా ఆగటం కష్టం. అందువల్ల పీచు, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన సమతులాహారం తినాలి. దీంతో రక్తంలో గ్లూకోజు మోతాదులు మరీ ఎక్కువ, తక్కువ కాకుండా ఉంటాయి. హఠాత్తుగా చిరుతిండి తినాలనే కోరికా తగ్గుతుంది.

మనసుతో ఆలోచించి: చిరుతిండిని నోట్లో వేసుకోవటానికి ముందు కాసేపు ఆగి నిజంగా ఆకలవుతోందా? ఏమీ తోచక తినాలనిపిస్తోందా? అని ఎవరికివారే ప్రశ్నించుకోవటం మంచిది. ఎందుకు తింటున్నామనే దాన్ని గుర్తించగలిగితే మంచి నిర్ణయాలు తీసుకోవటానికి మార్గం సుగమమవుతుంది.

చిరు వ్యాయామం: చిన్న వ్యాయామమైనా పెద్ద మార్పు తెచ్చిపెడుతుంది. కాసేపు నడిచినా, శరీరాన్ని సాగదీసినా ఉత్సాహం వస్తుంది. మనసుకు సహజంగా ఉల్లాసం చేకూరటం వల్ల తినాలనే యావ తగ్గుతుంది.

# బరువు తగ్గాలా?



బరువు తగ్గించే ఆహార పద్ధతిని మొదలెట్టాలని అనుకుంటున్నారా? అది పనిచేస్తుందో లేదోనని సందేహిస్తున్నారా? అయితే ఆహారంలో కేలరీలు తగ్గించటంతో పాటు ప్రొటీన్, పీచు పదార్థాలు పెంచుకోండి. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ పరిశోధకుల అధ్యయనం ఇదే విషయాన్ని చెబుతోంది. ఆహార పద్ధతి ఆయా వ్యక్తులకు అనుగుణంగా, దీర్ఘకాలం పాటించేలా మార్పులు చేర్పులకు అనుగుణంగానూ ఉండాలని సూచిస్తోంది. ఇందులో ఇండివిజువలైజ్డ్ డైట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐడిప్) అనే కొత్త బరువు తగ్గించే పద్ధతి ప్రభావాలను పరిశీలించారు. ఆహార పదార్థాల్లోని ప్రతి కేలరీకి ఎంత ప్రొటీన్, పీచు ఉంటుందో, భోజనం చేసేటప్పుడు ప్రతిసారీ ఎంత తినాలో సూచించే ప్రత్యేక టూల్‌ను పరిశోధకులు సృష్టించారు.

దీని ఆధారంగా రోజుకు 1,500 కేలరీల లోపు శక్తినిచ్చే ఆహారం.. ఇందులో 80 గ్రాముల ప్రొటీన్, 20 గ్రాముల పీచు ఉండేలా ఎవరికివారు తమకు నచ్చిన విధంగా ఆహార పద్ధతిని నిర్ణయించుకోవచ్చు. దీన్ని పాటించినవారిలో ఏడాది తర్వాత శరీర బరువులో 12.9% తగ్గటం గమనార్హం. ఎంత ఎక్కువగా ప్రొటీన్, పీచు ఎక్కువగా తీసుకుంటే అంత అధికంగా బరువు తగ్గుతున్నట్టు తేలింది.

# బుమ్రా సక్సెస్‌కు.. ఈ మూడు ఆయుధాలే కారణం: ఆసీస్ మాజీ పేసర్ జెఫ్ లాసన్



: ప్రపంచ క్రికెట్‌లో ప్రస్తుతం అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్ల జాబితాలో జస్‌ప్రీత్ బుమ్రాదే అగ్రస్థానం. ఈ మాట ప్రస్తుత, మాజీ పేస్ బౌలర్లే అంటున్నారు. టీ20 ప్రపంచ కప్ తర్వాత విశ్రాంతి తీసుకుంటున్న బుమ్రా.. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆడే అవకాశాలు ఉన్నాయి. ఒక వేళ అప్పుడూ రెస్ట్ తీసుకుంటే.. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సంగ్రామం బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ఆడటం ఖాయం. ఆస్ట్రేలియా గడ్డపై హ్యాట్రిక్ సిరీస్ విక్టరీ సాధించాలనే లక్ష్యంతో భారత్ ఉండగా.. అడ్డుకట్ట వేయాలని ఆసీస్ దృఢనిశ్చయంతో ఉంది. ఈ క్రమంలో బుమ్రాపై మాజీ పేసర్ జెఫ్ లాసన్ ప్రశంసల వర్షం కురిపించాడు. భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు.

"బుమ్రా విభిన్న శైలి బౌలర్. అతడి విజయానికి మూడు కారణాలు చెబుతా. చెక్కు చెదరని చిరునవ్వు, ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉండే స్వభావం, యార్కర్ నుంచి బౌన్సర్ వేయడం వరకు అన్ని అస్త్రాలు అతడి వద్ద ఉంటాయి. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొనేటప్పుడు బ్యాటర్లు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలి. అతడి రనప్ కూడా క్రీజ్‌లోని బ్యాటర్లకు కుదురుకునేందుకు ఎక్కువ సమయం ఇవ్వదు. ఆసీస్ గడ్డపై బుమ్రా లేదా ఇతర పేసర్లకు కుకుబుర్రా బంతులతోనే కఠిన సవాల్ ఎదురవుతుంది. పిచ్ పొడిబారినట్లు, గట్టిగా ఉన్నా సరే బుమ్రా రివర్స్ స్వింగ్ రాబట్టగలడు. బంతి పాతబడిన కొద్దీ పేసర్ల నైపుణ్యం బయటకొస్తుంది. బుమ్రాతోపాటు ఇతర పేసర్లు ఐదు టెస్టుల్లో ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం అత్యంత కీలకం. స్పిన్నర్లతో కలిసి షార్ట్ స్పెల్స్ వేయడం వల్ల బుమ్రా మరింత నిర్ణయాత్మక ఫ్యాక్టర్‌గా మారతాడు. ఆస్ట్రేలియా అభిమానులు, ప్రేక్షకులు కూడా అతడిని ఇష్టపడతారు. మేం 1980ల్లో విండీస్ బౌలర్లను కూడా ఇలానే ప్రేమించేవాళ్లం" అని లాసన్ వెల్లడించాడు.

విరాట్ కోహ్లీ విభిన్నం..

"బుమ్రాతో పోలిస్తే విరాట్ కోహ్లీ ఆసీస్ అభిమానుల దృష్టిలో విలన్. బుమ్రా తన నవ్వుతోనే అందర్నీ దోచేస్తాడు. కానీ విరాట్ మాత్రం అలా కాదు. మైదానంలో చాలా దూకుడుగా ఉంటాడు. ఒక్కోసారి ఆస్ట్రేలియా ప్లేయర్లతో మాటల యుద్ధమూ చేస్తాడు. అయితే, మా దేశ క్రికెట్ అభిమానులు కూడా విరాట్ వంటి పోటీదారును ప్రేమిస్తారు. అతడు హాఫ్ సెంచరీ లేదా సెంచరీ చేసినా ప్రశంసలు కురిపిస్తారు. కోహ్లీ మొదటి పర్యటన నుంచి ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై అద్భుతంగా ఆడాడు. బౌన్స్, పేసుకు అనుకూలంగా ఉండే పిచ్‌లపై అద్భుతంగా ఆడతాడు. మరి ఈసారి కూడా అదే ప్రదర్శన చేస్తాడా? అనేది ఇప్పుడే చెప్పలేను. నేను మాత్రం అతడిని పక్కన పెట్టేయను.. ఆసీస్ బౌలర్లు జాగ్రత్తగా కాచుకోవాల్సిందే" అని లాసన్ సూచించాడు.

# హ్యారీ కేన్‌కు యూరోపియన్ గోల్డెన్ షూ అవార్డు



ఇంగ్లండ్ ఫుట్‌బాల్ ఆటగాడు హ్యారీ కేన్ అరుదైన ఘనత సాధించాడు. యూరోపియన్ ఫుట్‌బాల్ లీగ్‌లో అత్యధిక గోల్స్ సాధించిన స్ట్రైకర్‌గా హ్యారీ కేన్ నిలిచాడు. దీంతో అతడికి గోల్డెన్ షూ దక్కింది. మూనిచ్‌లో జరిగిన కార్యక్రమంలో హ్యారీ దానిని అందుకొన్నాడు. ఈ లీగ్‌లో ఇప్పటి వరకు మూడుసార్లు టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ఒక్క సీజన్‌లోనే 32 మ్యాచుల్లో 36 గోల్స్ సాధించడం విశేషం. ఈ క్రమంలో ఓ అరుదైన రికార్డును కొద్దిలో చేజార్చుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో అత్యధిక గోల్స్ (41) చేసిన ఆటగాడిగా మాజీ స్ట్రైకర్ రాబర్ట్ లెవాన్‌డౌస్కి కొనసాగుతున్నాడు.

"గోల్డెన్ షూ అందుకోవడం అద్భుతమైన ఫీలింగ్. ఈ అవార్డు అందరికి అంకితం. మీ అభిమానం లేకపోతే ఇది సాధ్యం కాదు. నేను ఇక్కడ ఉండేవాడిని కాను. కొత్త సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఇప్పుడు ఎలాంటి ముగింపు ఇచ్చానో.. అదే ఉత్సాహంతో ముందుకు సాగుతా. టైటిళ్లను సొంతం చేసుకోవడం చాలా ముఖ్యం. జట్టుగా మేం విజయవంతమైనట్లు భావిస్తున్నా. ఛాంపియన్స్ లీగ్ ఫైనల్ మునిచ్‌లో జరగనుంది. మేం ఫైనల్‌లో ఆడతామనే నమ్మకంతో ఉన్నా. మా జట్టు గెలుపే నాకు ముఖ్యం. అదే జరిగితే నేను గోల్స్ చేయకపోయినా పెద్దగా కంగారు పడను" అని హ్యారీ వెల్లడించాడు.

# డోపింగ్ వివాదం.. వారి మాటలను మనం కంట్రోల్ చేయలేం: టెన్నిస్ స్టార్ జనిక్ సిన్నర్



యూఎస్ ఓపెన్ ( తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ టెన్నిస్ ఆటగాడు జనిక్ సిన్నర్ అద్భుత విజయం సాధించాడు. డోపింగ్ వివాదంతో టోర్నీలో అడుగు పెట్టిన అతడు 2-6, 6-2, 6-1,6-2 తేడాతో అమెరికన్ ప్లేయర్ మెకంజీ మెక్‌డొనాల్డ్‌పై గెలుపొందాడు. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినట్లు గుర్తించినా.. కావాలని వాటిని వినియోగించలేదని తేలడంతో అంతర్జాతీయ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ సిన్నర్‌పై వేటు వేయలేదు. యూఎస్ ఓపెన్‌లో ఆడేందుకు అనుమతి ఇచ్చింది. దీనిపై పలువురు టెన్నిస్ ఆటగాళ్లు భిన్నంగా స్పందించారు. స్థాయిని బట్టి ఆటగాళ్లపై నిర్ణయాలు వేరేగా ఉంటున్నాయని టెన్నిస్ స్టార్ నిక్ కిర్గియోస్ వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. దీనిపై సిన్నర్ స్పందించాడు.

"డోపింగ్ వివాదానికి సంబంధించి పలు స్పందనలను చూశా. కొందరు ఆటగాళ్లు ఒకలా.. మరికొందరు భిన్నంగా స్పందించారు. కానీ, వాటిని నేను నియంత్రించలేను. ఇలాంటి విషయాల్లో ఎవరికైనా ఏదైనా చెప్పాలనుకుంటే మాత్రం వ్యక్తిగతంగా వెల్లడిస్తా. బాహాటంగా చెప్పే వ్యక్తిని కాను. ప్రతిస్పందనలు చూశాక నాకేమీ బాధలేదు. ఇప్పుడు నేను సంతోషంగానే ఉన్నా" అని తెలిపాడు.

తొలి మ్యాచ్ ఫలితంపై..

"తొలి మ్యాచ్ ఫస్ట్ సెట్‌లో ఓటమి ఎదురైంది. అత్యుత్తమ ప్రారంభం కాదని తెలుసు. ఆ తర్వాత పుంజుకోగలిగా. ప్రతి టోర్నీలో మొదటి మ్యాచ్ ఎప్పుడూ తేలిగ్గా ఉండదు. మనం దానిని అంగీకరించి ముందుకు సాగాలి. మెకంజీ కూడా చాలా బాగా ఆడాడు. లయను అందుకోవడానికి కాస్త సమయం తీసుకున్నా. రెండో సెట్ నుంచి వెనుదిరిగి చూడలేదు. రెండో రౌండ్‌కు చేరుకోవడం ఆనందంగా ఉంది. మ్యాచ్ మ్యాచ్‌కూ మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా. డోపింగ్ వివాదం తర్వాత తొలి విజయం మంచి కిక్ ఇచ్చింది. నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని సిన్నర్ వ్యాఖ్యానించాడు.

# ఐసీసీ ర్యాంకుల్లో యశస్వి, కోహ్లీ ముందుకు.. బాబర్ అజామ్ ఆరు స్థానాలు డౌన్




టెస్టు ర్యాంకులను అంతర్జాతీయ క్రికెట్ మండలి విడుదల చేసింది. భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ తమ స్థానాలను మెరుగుపర్చుకోగా.. రోహిత్ శర్మ టాప్-10లో కొనసాగుతున్నాడు. ఇక పాక్ పరిమిత ఓవర్ల కెప్టెన్ బాబర్ అజామ్ ఆరు స్థానాలను కోల్పోయాడు. బ్యాటర్ల జాబితాలో ఇంగ్లండ్ ఆటగాడు జోరూట్ (881 పాయింట్లు) అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంకపై మంచి ఇన్నింగ్స్‌లతో రూట్ తన ప్లేస్‌ను సుస్థిరం చేసుకున్నాడు. న్యూజిలాండ్ ఆటగాళ్లు కేన్ విలియమ్సన్ (859), డారిల్ మిచెల్ (768) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

యశస్వి జైస్వాల్ (740) ఒక స్థానం ముందుకొచ్చి ఏడో ర్యాంకులో నిలిచాడు. విరాట్ కోహ్లీ (737) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని ఎనిమిదో ర్యాంక్‌కు చేరాడు. రోహిత్ (751) ఆరులో ఉన్నాడు. ఇక బాబర్ అజామ్ (734) ఆరు స్థానాలను కోల్పోయి 9కి చేరాడు. బంగ్లాపై సెంచరీ సాధించిన రిజ్వాన్ (728) ఏడు స్థానాలు దూసుకొచ్చి 10వ ర్యాంకుకు చేరాడు. ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (758) మూడు స్థానాలు మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

# పారిస్‌లో మళ్లీ పండగ

పారిస్ అదిరే ప్రదర్శనలు.. అద్భుత విన్యాసాలు.. పతక సంబరాలు... ఆశ్చర్యపరిచే రికార్డులు.. వీటన్నిటి సమాహారంతో పారిస్ ఒలింపిక్స్ అభిమానులు అలరించింది. ఈ క్రీడా సంబరం ముగిశాక కొన్ని రోజుల విరామంతో మరో క్రీడోత్సవం ఇదే వేదికలో ఆరంభం కాబోతోంది. బుధవారం నుంచే పారాలింపిక్స్ షురూ! దివ్యాంగుల కోసం జరగబోయే క్రీడల్లో 168 దేశాల నుంచి 4400 మంది అథ్లెట్లు పోటీల్లో పాల్గొనబోతున్నారు.



[illegible]

అభిమానుల్లో స్ఫూర్తిని నింపడానికి.. ఆటలతో అలరించడానికి పారిస్ పారాలింపిక్స్ సిద్ధమైంది. 11 రోజుల పాటు ఇక సందడే. 22 అథ్లెట్లు క్రీడల్లో పోటీపడుతున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో స్కేట్ బోర్డింగ్, బ్రేక్ డ్యాన్స్, 3ఐ3 బాస్కెట్‌బాల్ జరిగిన డిలా కాంకార్డ్ వేదికలో బుధవారం పారాలింపిక్స్ ఆరంభోత్సవం జరగనుంది. పారాలింపిక్స్ చరిత్రలో స్టేడియంలో కాకుండా బహిరంగ ప్రదేశంలో తొలిసారి ప్రారంభోత్సవం జరగనుంది. సెప్టెంబర్ 8న ముగింపోత్సవం నిర్వహిస్తారు. పారిస్ ఒలింపిక్స్‌లో వివిధ క్రీడలకు వేదికలుగా నిలిచిన ప్రదేశాల్లోనే పారాలింపిక్స్‌లోనూ పోటీలు జరగనున్నాయి. అయితే ఐఫిల్ టవర్ సమీపంలో బీచ్ వాలీబాల్ నిర్వహించిన ప్రాంతంలో అంధుల సాకర్ నిర్వహించబోతున్నారు. మహిళలకు ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశంతో 2020 టోక్యో పారాలింపిక్స్‌తో పోలిస్తే ఈసారి 10 కొత్త పతక ఈవెంట్లను చేర్చారు. ఈ నేపథ్యంలో పారిస్‌లో అరంగేట్రం చేయబోతున్న గోల్‌బాల్, బోచా ఆటలు ఆసక్తిని రేపుతున్నాయి. చైనా (282) అత్యధికంగా అథ్లెట్లను పోటీలకు పంపుతోంది. 2020 టోక్యో పారాలింపిక్స్‌లో 96 స్వర్ణాలతో సహా 207 పతకాలు సాధించిన చైనా ఈసారి కూడా సత్తా చాటాలనే పట్టుదలతో ఉంది.

ఈసారి 25 గెలవాలని..

పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు బరిలో నిలిచారు. అథ్లెటిక్స్ (38), బ్యాడ్మింటన్ (13), షూటింగ్ (10), ఆర్చరీ (6), పవర్‌లిఫ్టింగ్ (4), పారా కనోయింగ్ (3), సైక్లింగ్, జూడో, టేబుల్ టెన్నిస్, రోయింగ్ (2), తైక్వాండో, స్విమ్మింగ్ (1) మన అథ్లెట్లు పోటీపడుతున్నారు. వీరిలో జీవాంజి దీప్తి (400 మీటర్ల టీ20 పరుగు, వరంగల్), కొంగనపల్లి నారాయణ (రోయింగ్, నంద్యాల), షేక్ అర్షద్ (నంద్యాల, తైక్వాండో), రొంగలి రవి (అనకాపల్లి, షాట్‌పుట్) తెలుగు రాష్ట్రాల నుంచి పారిస్‌కు వెళ్లారు. 'ఈనాడు' సీఎస్‌ఆర్ కార్యక్రమం లక్ష్య అథ్లెట్ దీప్తి స్వర్ణం గెలిచే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. టోక్యో పారాలింపిక్స్‌లో పసిడితో పాటు కాంస్యం సాధించిన షూటర్ అవని లేఖరాపై ఈసారి మంచి అంచనాలున్నాయి. 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్, 10 మీటర్ల మిక్స్‌డ్ ఎయిర్ రైఫిల్ విభాగాల్లో ఆమె బరిలో ఉంది. సుమిత్ అంటిల్ (జావెలిన్‌త్రో, ఎఫ్-64), కృష్ణ నగార్ (బ్యాడ్మింటన్), భవీనా పటేల్ (టేబుల్‌టెన్నిస్), శీతల్‌దేవి (ఆర్చరీ), యోగేశ్ కతూనియా (డిస్కస్‌త్రో), తంగవేలు మరియప్పన్ (హైజంప్), మనీశ్ నర్వాల్ (షూటింగ్), సుహాస్ యతిరాజ్ (బ్యాడ్మింటన్)లకు పతకాలు తెచ్చే సత్తా ఉంది.

# అంత సమయమా? యూఎస్ ఓపెన్‌లో సుదీర్ఘమైన మ్యాచ్ రికార్డు బద్దలు

యూఎస్ ఓపెన్ 2024 జోరుగా సాగుతోంది. స్టార్ ప్లేయర్లు ముందడుగు వేస్తున్నారు. తొలి రౌండ్ పోటీలు జరుగుతుండగా.. తాజాగా ఓ మ్యాచ్ యూఎస్ ఓపెన్ చరిత్రలో అరుదైన పోరుగా నిలిచిపోయింది. బ్రిటన్‌కు చెందిన డేనియల్ ఇవాన్స్, రష్యా టెన్నిస్ ఆటగాడు కరెన్ ఖచనోవ్ ఐదు సెట్ల పోరు చివరి వరకూ ఉత్కంఠభరితంగా సాగింది. దాదాపు 5 గంటల 35 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరికి డేనియల్ ఇవాన్స్ విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నాడు.




ప్రస్తుతం 184వ ర్యాంకులో ఉన్న ఇవాన్స్ కొన్నాళ్లపాటు బ్రిటన్ నంబర్ వన్ ర్యాంకర్‌గానూ కొనసాగాడు. 1992లో అమెరికన్ మైకెల్ ఛాంగ్‌పై స్వీడన్‌కు చెందిన స్టెఫాన్ ఎడ్‌బర్గ్ యూఎస్ ఓపెన్ సెమీస్‌లో విజయం సాధించాడు. ఆ మ్యాచ్ 5 గంటల 26 నిమిషాలపాటు సాగింది. ఇప్పుడు ఈ రికార్డును ఇవాన్స్-కరెన్ మ్యాచ్ బద్దలు కొట్టింది. దాదాపు 32 ఏళ్ల నుంచి ఉన్న రికార్డును అధిగమించడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన మ్యాచ్‌గా 2010 వింబుల్డన్‌లో జాన్ ఇస్నెర్-నికోలస్ మహుత్ పోరు నిలిచింది. వీరిద్దరి మధ్య పోరు దాదాపు 11 గంటల 5 నిమిషాలపాటు సాగింది. ఇందులో ఇస్నెర్ విజయం సాధించాడు.

ఇవాన్స్ చివరి సెట్‌లో 0-4తో వెనుకబడి మరీ..

యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో కరెన్‌పై ఇవాన్స్ 6-7 (6), 7-6 (2), 7-6 (4), 4-6, 6-4 తేడాతో విజయం సాధించాడు. మొదటి మూడు సెట్లూ టై బ్రేక్‌కు వెళ్లడం గమనార్హం. చివరి సెట్‌లో ఇవాన్స్ 0-4గా వెనుకబడి మరీ గెలుచుకున్నాడు. వరుసగా ఆరు పాయింట్లను బ్రేక్ చేసి సెట్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ సర్వీస్ రూపంలో 14 ఏస్‌లను సంధించాడు.

# ఐసీసీ పీఠంపై జై

దుబాయ్: బీసీసీఐ కార్యదర్శి జై షా.. డిసెంబరు 1న ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నాడు. అతడు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఐసీసీ అధిపతి అయిన అత్యంత పిన్నవయస్కుడిగా 35 ఏళ్ల షా ఘనత సాధించాడు. ప్రస్తుత ఛైర్మన్ గ్రెగ్ బార్క్లే (న్యూజిలాండ్) మరో పర్యాయం పదవిలో కొనసాగకూడదని నిర్ణయించుకోవడంతో షాకు అవకాశం లభించింది. జై షా 2019 నుంచి బీసీసీఐ కార్యదర్శిగా ఉంటున్నాడు. వచ్చే నెల లేదా అక్టోబరులో జరిగే బోర్డు వార్షిక సర్వసభ్య సమావేశంలో అతడు బాధ్యతల నుంచి తప్పుకొంటాడు. భారత్ నుంచి ఇంతకుముందు జగ్మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్ శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఐసీసీ అధిపతులుగా పని చేశారు. ఈసారి ఛైర్మన్ పదవికి షా ఒక్కడే పోటీలో నిలిచాడు. "ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నా.

# “వదల బొమ్మాళీ” అంటున్న వైసీపీని భూస్థాపితం చేయాలి: పెద్దాపురం సభలో చంద్రబాబు

* పెద్దాపురంలో సీఎం చంద్రబాబు పర్యటన
* వైసీపీ చేసేవి విష రాజకీయాలంటూ విమర్శలు
* ఫేక్ ప్రచారాలే వైసీపీ సిద్ధాంతం అని ఆగ్రహం
* రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపణలు

**అమరావతి, ఆగష్టు 23 (భారత శక్తి):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫేక్ ప్రచారాలు, రౌడీయిజం, తప్పుడు విధానాలనే సిద్ధాంతాలుగా చేసుకుని పనిచేస్తోందని, వారిది విషపూరిత రాజకీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దాపురంలో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో వైసీపీ అనుసరించిన కుట్రపూరిత రాజకీయాలను పది కీలక సంఘటనలతో ప్రజల ముందుంచారు. ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనా వైసీపీ తీరు మారలేదని, ‘అరుంధతి’ సినిమాలో భూతంలా ‘నిన్ను వదల బొమ్మాళీ’ అంటూ మళ్లీ ప్రజలను పీడించేందుకు ప్రయత్నిస్తోందని, అలాంటి పార్టీని పూర్తిగా భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత 10 ఏళ్లలో జరిగిన ఓ 10 ఘటనలు మీకు చెబుతాను. వాటి ద్వారా మన రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ పార్టీ ఉందో, వాళ్ల క్రిమినల్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీరే అర్థం చేసుకోండి.

1. వివేకా హత్య కేసు: బాబాయి హత్య అనేది దేశంలోనే క్రిమినల్ పాలిటిక్స్‌కు కేస్ స్టడీ.. అవునా, కాదా? తప్పుడు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందారా లేదా?

2. కోడి కత్తి డ్రామా: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాడు కోడి కత్తి డ్రామా ఎలా ఆడారో....అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కేసు ఎటుపోయిందో మీరు గుర్తుతెచ్చుకోవాలి. దీన్ని మిస్టరీగా మార్చారు.

3. గులకరాయి దాడి: సీఎంగా ఉండి గులకరాయితో హత్యాయత్నం అంటూ కట్టు కట్టుకుని ఎన్నికల డ్రామా ఆడారు.

4. డయాఫ్రమ్ వాల్: అసమర్థతో, నిర్లక్ష్యంతో, అహంకారంతో పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడానికి కారణమై...ఆ నెపాన్ని మాపైనే నెట్టారు.

5. పింఛన్ల నిలిపివేత: 2024 ఎన్నికల సమయంలో వాలంటీర్లతో పింఛన్లు ఇవ్వొద్దంటే ఏకంగా ఇంటి కెళ్లి పింఛను ఇవ్వడమే ఆపేశారు. మండుటెండల్లో 16 మంది వృద్ధుల ప్రాణాలు తీసి దానికి చంద్రబాబు కారణం అని సొంత మీడియా ద్వారా ఊదర గొట్టారు.

6. సింగయ్య మృతి: పరామర్శల పేరుతో యాత్రలు చేస్తున్నారు. ఈ రాజకీయ ఉనికి యాత్రల కోసం అమానుషంగా తమ వెహికల్‌తో తొక్కించి సింగయ్య అనే కార్యకర్త ఉసురు తీశారు. వీడియో బయటపడే వరకు అసలు ఏం జరిగిందనే విషయాన్ని దాచిపెట్టారంటే ఏ స్థాయి క్రిమినల్స్ అనేది అర్థం చేసుకోవాలి.




7. వీడియో మార్ఫింగ్: జనం తనకోసం ఎగబడుతున్నట్టుగా బిల్డప్ ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. నెల్లూరు పర్యటనలో బంగారుపాళ్యం జనాన్ని చూపించి మిక్స్ చేసి చూపించారు.

8. మునిగింది రాజధాని కాదు...వైసీపీ: రాజధాని అమరావతిపై ఎప్పుడూ విషం కక్కే వైసీపీ... అమరావతి మునిగింది అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అమరావతిపై విషం చిమ్మాలనే ప్రయత్నంలో రాష్ట్ర బ్రాండ్ ను కూడా దెబ్బ తీస్తున్నారు. రాజధాని మునగలేదు... విష ప్రచారంలో వైసీపీ మునిగిపోయింది. రాజకీయంగాను పూర్తిగా మునిగిపోతుంది.

9. పెట్టుబడులు వద్దంటూ లేఖలు: తాము అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో కంపెనీలను వెళ్లగొట్టిన వైసీపీ పాలకులు... ప్రతిపక్షంలోనూ కుట్రలు కంటిన్యూ చేస్తున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రానివ్వకుండా సంస్థలకు లేఖలు రాస్తున్నారు.

10. పింఛన్లపై తప్పుడు ప్రచారాలు: ఇప్పుడు మళ్లీ పింఛన్లపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వాళ్ల హయాంలో వేలు, లక్షల మంది అనర్హులకు, పార్టీ కార్యకర్తలకు పింఛన్లు ఇచ్చారు. వీటిపై వెరిఫికేషన్ జరుగుతుంటే...4 లక్షల పింఛన్లు తీసేశారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఒక్క పింఛను కూడా ఇప్పటికి తీయలేదు. అర్హులైన వారి ఏ ఒక్క పింఛను కూడా తీసేది లేదు. అనర్హులకు తప్పుడు పత్రాలతో పింఛన్లు ఇప్పించారు. అలాంటి వారి పింఛన్లు తొలగిస్తాం.

ఇదీ... వైసీపీ నీచ రాజకీయం....ఇవి కేవలం 10 ఉదాహరణలు మాత్రమే. వాళ్ల రాజకీయం ఏంటో...వాళ్ల పోకడలు, విషపు ఆలోచనలు ఏంటో ప్రజలు అర్థం చేసుకోవాలి... 2024 ఎన్నికల తీర్పు తరువాతా వాళ్లు మారలేదు. మీరంతా పాతాళానికి తొక్కేసినా అరుంధతి సినిమాలో బూతం “నిన్ను వదల బొమ్మాళీ వదల” అంటూ వెనుక పడినట్లు మళ్లీ బయటకు వస్తున్నారు. పూర్తిగా భూ స్థాపితం చేయాల్సిందే... అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**మరో దుష్ప్రచారానికి తెరలేపారు!**

ప్రస్తుతం పింఛన్ల వెరిఫికేషన్ జరుగుతుంటే, నాలుగు లక్షల పింఛన్లు తీసేశారంటూ మరో దుష్ప్రచారానికి తెరలేపారని అన్నారు. “వారి హయాంలో వేలమంది అనర్హులకు, పార్టీ కార్యకర్తలకు పింఛన్లు ఇచ్చారు. వాటిని మాత్రమే తొలగిస్తాం. అర్హులైన ఒక్కరి పింఛను కూడా తీసేది లేదు” అని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఒక తప్పుడు పోస్టు పెట్టడం, దాన్ని తమ అనుకూల మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడమే వైసీపీ రాజకీయమని చంద్రబాబు విమర్శించారు. తమది అభివృద్ధి, సంక్షేమం, విజన్‌తో కూడిన రాజకీయమైతే, వైసీపీది అనర్థం, సంక్షోభం, క్రిమినల్ రాజకీయమని అభివర్ణించారు. ఇలాంటి పార్టీ రాష్ట్రానికి అవసరం లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి అవకాశమివ్వాలి: పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగష్టు 23 (భారత శక్తి):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి అవకాశం ఇస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇంఛార్జ్‌గా ఉండాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని ఆదేశించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇంఛార్జ్ ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్‌లు ప్రభావవంతంగా పనిచేయాలని సూచించారు. డివిజన్లలో కార్యాలయాలు ప్రారంభించాలని అన్నారు. బూత్ వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి: కిషన్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఆగష్టు 23 (భారత శక్తి):** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూస్తామని ఆయన అన్నారు. ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల డబుల్ ఓట్లు ఉన్నాయని, రాష్ట్రంలో ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఓట్ల చోరీకి పాల్పడితే లోక్‌సభలో తమ పార్టీ సీట్లు ఎందుకు తగ్గాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి యూరియా సరఫరా అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనతో ఫోన్‌లో మాట్లాడారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరారని, రాష్ట్రానికి రావాల్సిన వాటాను తప్పకుండా పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాంకేతిక కారణాల వల్ల రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని ఆయన వివరించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పందిస్తూ, ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూ దొందేనని విమర్శించారు. బీజేపీలోకి ఎవరైనా రావాలనుకుంటే, తమ పదవులకు రాజీనామా చేసి రావాలని ఆయన స్పష్టం చేశారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మరోసారి తేల్చి చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై మాట్లాడుతూ, మెట్రో ప్రస్తుతం నష్టాల్లో నడుస్తోందని, దీంతో కొత్త లైన్ల నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ సుముఖంగా లేదని అన్నారు. అయితే, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. బీహార్‌లో బీజేపీ తప్పకుండా అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మంచి మిత్రుడిని కోల్పోయాను : బండారు దత్తాత్రేయ భావోద్వేగం

**హైదరాబాద్, ఆగష్టు 23 (భారత శక్తి):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్ధాంతాలు వేరైనా సురవరం తనకు అత్యంత ఆత్మీయ మిత్రుడని, ఆయనను కోల్పోవడం వ్యక్తిగతంగా తీరని లోటని ఆవేదన చెందారు. సురవరం భౌతికకాయానికి దత్తాత్రేయ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ సురవరంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. “విద్యార్థి దశ నుంచే నాయకుడిగా ఎదిగి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరారు. తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి తుదిశ్వాస విడిచే వరకు పోరాటం సాగించారు. నల్గొండ ఎంపీగా పార్లమెంటులో ప్రజా సమస్యలపై ఆయన గళం వినిపించిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుంది” అని కొనియాడారు. సురవరం లోతైన పరిజ్ఞానం, నీతి, నిజాయతీ కలిగిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. రాజకీయంగా భిన్న ధ్రువాలైనా తమ మధ్య ఎంతో స్నేహపూర్వక వాతావరణం ఉండేదని దత్తాత్రేయ తెలిపారు. “ఆయన విమర్శలు ఎంతో సున్నితంగా, హుందాగా ఉండేవి. ఎన్నో అంశాలపై నాతో చర్చించి, పరిష్కార మార్గాలు కూడా సూచించేవారు. నేను ఆహ్వానించిన ప్రతిసారీ ‘అలై బలై’ కార్యక్రమానికి హాజరయ్యేవారు. అలాంటి మంచి స్నేహితుడిని కోల్పోవడం చాలా బాధగా ఉంది” అని భావోద్వేగానికి గురయ్యారు. సురవరం ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

## హైదరాబాద్ వచ్చేయండి.. ఓపెన్ ఏఐ సీఈఓకు కేటీఆర్ ఆహ్వానం

* ఓపెన్ ఏఐకి హైదరాబాద్ సరైన ప్రవేశ ద్వారమన్న కేటీఆర్
* భారత్ లో తొలి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నపం

**హైదరాబాద్, ఆగష్టు 23 (భారత శక్తి):** ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టిస్తున్న చాట్‌జీపీటీ మాతృసంస్థ ‘ఓపెన్ ఏఐ’ భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక ప్రతిపాదన చేశారు. భారత్‌లో తమ తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌కు ఆయన బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో శామ్ ఆల్ట్‌మన్ భారత పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా, భారత్‌లో కృత్రిమ మేధస్సు (AI) వినియోగం అద్భుతంగా ఉందని, గత ఏడాదితో పోలిస్తే చాట్‌జీపీటీ వాడకం నాలుగు రెట్లు పెరిగిందని ఆల్ట్‌మన్ ఇటీవల ‘ఎక్స్’ వేదికగా ప్రశంసించారు. ఆయన పోస్ట్‌కు స్పందించిన కేటీఆర్, హైదరాబాద్‌కు రావాల్సిందిగా ఆల్ట్‌మన్‌ను ఆహ్వానించారు. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలనుకుంటున్న ఓపెన్ ఏఐ వంటి సంస్థలకు హైదరాబాద్ సరైన ప్రవేశ ద్వారమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ హైదరాబాద్‌లో ఉందని ఆయన నొక్కి చెప్పారు. టీహబ్, వీహబ్, టీవర్క్స్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) వంటి అగ్రశ్రేణి సంస్థలను ప్రస్తావిస్తూ, ఈ వాతావరణం ఓపెన్ ఏఐ కార్యకలాపాలకు ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ ఏడాది చివర్లోగా భారత్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని ఓపెన్ ఏఐ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కేటీఆర్ ఆహ్వానం నేపథ్యంలో, సంస్థ తన కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తుందనే విషయంపై ఆసక్తి నెలకొంది.

## నచ్చకపోతే మా ఉత్పత్తులు కొనకండి : ట్రంప్ ఆంక్షలపై జైశంకర్ కౌంటర్

**ఢిల్లీ, ఆగష్టు 23 (భారత శక్తి):** రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు. భారత్‌తో ఏదైనా సమస్యఉంటే.. ఇక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రముఖ దినపత్రిక ఎకనామిక్ టైమ్స్ ఆధ్వర్యంలో శనివారం దిల్లీలో జరిగిన ‘వరల్డ్ లీడర్స్ ఫోరం’ సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేయడం వల్ల భారత్‌పై వస్తోన్న విమర్శల అంశాన్ని ప్రస్తావించారు. ‘‘భారత్ అమెరికా వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే, మాకంటూ కొన్ని ప్రయోజనాలున్నాయి. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. మా రైతులు, చిన్న ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించడమే మాకు ప్రధానం. దీనిపై మేం రాజీపడే ప్రసక్తే లేదు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. నిజంగా మీకు భారత్‌తో సమస్య ఉంటే.. మా చమురును, శుద్ధి చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయకండి. వాటిని కొనాలని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయట్లేదు. మీకు నచ్చకపోతే కొనకండి’’ అని జైశంకర్ అన్నారు. అంతేగాక, ట్రంప్ అదనపు సుంకాలు ప్రకటించడానికి ముందే.. రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపలేదని వెల్లడించారు.

## అంతరిక్ష రంగంలో ‘ప్రైవేట్‘కు ప్రధాని మోదీ భారీ టార్గెట్

**ఢిల్లీ, ఆగష్టు 23 (భారత శక్తి):** భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాలని, రాబోయే ఐదేళ్లలో కనీసం ఐదు యూనికార్న్‌లను సృష్టించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఏడాదికి ఐదుగా ఉన్న రాకెట్ ప్రయోగాల సంఖ్యను 50కి పెంచే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. శనివారం ‘జాతీయ అంతరిక్ష దినోత్సవం’ సందర్భంగా ప్రధాని వర్చువల్ విధానంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత 11 ఏళ్లలో అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాలను ప్రధాని కొనియాడారు. “భారత అంతరిక్ష ప్రయాణం మన శాస్త్రవేత్తల ప్రతిభ, నూతన ఆవిష్కరణలకు నిదర్శనం” అని ఆయన అన్నారు. ఒకప్పుడు నిబంధనలతో వెనుకబడిన అంతరిక్ష రంగానికి తమ ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యం కల్పించడం ఒక వరంగా మారిందని, ఇది వరుస విజయాలకు కారణమైందని మోదీ వివరించారు. ప్రభుత్వ సంస్కరణల ఫలితంగానే ఈ రంగంలో 350కి పైగా స్టార్టప్‌లు వచ్చాయని తెలిపారు. అంతరిక్ష సాంకేతికత ఇప్పుడు ప్రభుత్వ పరిపాలనలోనూ భాగమైందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. “పంటల బీమా పథకాల కోసం శాటిలైట్ ఆధారిత అంచనాలు, మత్స్యకారులకు ఉపగ్రహాల ద్వారా సమాచారం, విపత్తుల నిర్వహణ, పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో జియోస్పేషియల్ డేటా వాడకం వంటివి సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేస్తున్నాయి” అని ఆయన వివరించారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ, శాస్త్రవేత్తల కృషితో త్వరలోనే భారత్ ‘గగన్‌యాన్’ మిషన్‌ను ప్రయోగిస్తుందని, రాబోయే కాలంలో మన దేశం సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని (స్పేస్ స్టేషన్) కూడా నిర్మిస్తుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అంతరిక్ష రంగంలో నూతన తరం సంస్కరణలను కొనసాగించేందుకు ప్రభుత్వానికి సంకల్పం ఉందని చెబుతూ, యువతకు అపార అవకాశాలు కల్పించే ఈ రంగం వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రైవేట్ సంస్థలను ప్రధాని ఆహ్వానించారు.

## సుధాకర్ రెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కల్యాణ్

**అమరావతి, ఆగష్టు 23 (భారత శక్తి):** సీపీఐ సీనియర్ నేత, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి గత రాత్రి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, సుధాకర్ రెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశ నుంచే పోరాట పంథాను ఎంచుకున్న ఆయన, చివరి వరకు ప్రజల కోసమే పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా రైతులు, కార్మికుల సమస్యలపై ఆయన బలంగా గళం వినిపించారని వివరించారు. లోక్ సభ సభ్యుడిగా దేశానికి, తన ప్రాంతానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. నల్గొండ ప్రాంతంలో ఫ్లోరోసిస్ మహమ్మారి, సాగునీటి కొరత, కరవు పరిస్థితులపై సుధాకర్ రెడ్డి చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పవన్ కల్యాణ్ అన్నారు. మూడు పర్యాయాలు సీపీఐ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అభిప్రాయపడ్డారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని, ఆయన కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## హయత్ నగర్ గ్రామంలో రజక సంఘం భవన నిర్మాణ పనులు ప్రారంభం...!

**ఎల్బీనగర్, ఆగష్టు 23 (భారత శక్తి):** హయత్ నగర్ పాత గ్రామంలోని వార్డ్ కార్యాలయం సమీపంలో దాదాపు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రజక భవన నిర్మాణ పనులను నేడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు హయత్ నగర్ పాత గ్రామంలో రజక భవనం ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా శనివారం బోర్ వెయ్యడం జరుగుతుందని, గత నాలుగున్నర సంవత్సరాలుగా హామీలకు అనుగుణంగా డివిజన్ అభివృద్ధి పరుస్తున్నామని,అతి త్వరలోనే అనుమగల్ లో ఉన్నటువంటి అభ్యుదయ యువజన సంఘం భవన నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఇ హేమునాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, రజక సంఘం సంక్షేమ సంఘం సభ్యులు బండారి రవీందర్, బండారి హరీష్, బండారి ప్రవీణ్, బండారి మహేష్ తదితరులు పాల్గొన్నారు..



## ఎల్బీనగర్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ..

- **పంపిణీ చేసిన గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి..**
- **ఇది ఎంతో గర్వించదగిన విషయం అంటూ వెల్లడి..**

ఎల్బీనగర్, ఆగష్టు 23 (భారతశక్తి) : ఎల్.బీ. నగర్ లో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు ఏఎంసీ డైరెక్టర్ పంటల జైపాల్ రెడ్డి.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల పంపిణీని, 12 సంవత్సరాల తర్వాత ప్రజా ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రారంభించడం గర్వించదగ్గ విషయం. ఈ నిర్ణయంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సంకల్పానికి తమ మద్దతు తెలుపుతున్నారు" అని పేర్కొన్నారు. అలాగే, సెప్టెంబర్ నెల నుండి కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలు సంబంధిత రేషన్ దుకాణాల ద్వారా అవసరమైన సరుకులు పొందగలరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అర్హుడైన కుటుంబానికి రేషన్ కార్డు అందజేయడానికి కట్టుబడి ఉందని ఆయన వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం ముందడుగు వేస్తోందని అన్నారు.

# హైదరాబాద్‌లో విషం చిమ్ముతున్న డ్రగ్స్ సంస్కృతి..



- నిర్వీర్యం అయిపోతున్న యువత భవితవ్యం..
- రోజు రోజుకూ పెరిగిపోతున్న నేరాల శాతం..
- మత్తులో పడి మానవత్వం మరచిపోతున్న దౌర్భాగ్యం..
- అక్రమ సంపాదనకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న కొందరు..
- భవిష్యత్తు అంధకారమై బానిసలవుతున్న మరికొందరు..
- ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆగని దందా..
- కార్పొరేట్ కల్చర్ కు అలవాటుపడిన సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న డ్రగ్స్..
- వేగంగా పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం భవిష్యత్తులో పెను ప్రమాదం..
- ఆరోగ్యాలు చెడగొట్టుకోవడమే కాకుండా సమాజాన్ని నాశనం చేస్తున్నారు..
- మరింత ప్రమాదకరంగా మారిన సులువుగా దొరికే గంజాయి..
- పోలీసులకు తెలిసినా లంచాలకు దాసోహం అంటున్నారు..!
- కట్టడి చేయాలనే దృక్పథం ఉంటే.. అరికట్టడం పెద్ద కష్టమేమీ కాదు..
- డ్రగ్స్ కల్చర్ పై సమర శంఖం పూరిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

**హైదరాబాద్, ఆగష్టు 23 (భారత శక్తి) :** హైదరాబాద్ మహా నగరం ఒకప్పుడు విద్య, ఉద్యోగాలు, ఐటీ రంగం, వ్యాపార అవకాశాలతో అంతర్జాతీయ గుర్తింపు పొందింది. కానీ ఇటీవలి కాలంలో ఈ నగరాన్ని "డ్రగ్స్ హబ్"గా మలచే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగం వేగంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం.. నగరంలోని పబ్‌లు, బార్‌లు, ప్రైవేట్ పార్టీల్లో గంజాయి, కొకైన్, ఎల్ఎస్డీ, ఎక్స్టసీ వంటి మాదక ద్రవ్యాలు సులభంగా లభ్యమవుతున్నాయి. కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు, సినిమా, ఫ్యాషన్ రంగాలకు చెందినవారు ఈ వ్యసనానికి బలవుతున్నారు. డ్రగ్ మాఫియాలు రహస్యంగా నెట్‌వర్క్‌లు ఏర్పరచుకుని, ఆన్‌లైన్ డెలివరీ విధానాల ద్వారా సరఫరా చేస్తున్నారు. డ్రగ్స్ వాడకంతో విపరీత పరిణామాలు నెలకొంటున్నాయి.. : యువత చదువులు, కెరీర్ తో బాటు జీవితాలు కూడా దెబ్బతింటున్నాయి. కుటుంబాలు సైతం విచ్ఛిన్నమవుతున్నాయి. అంతే కాకుండా నేరాల రేటు విపరీతంగా పెరుగుతోంది. మహిళలకు, మంచివాలకు రక్షణ లేకుండా పోతోంది.. మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న ప్రయోజనం కనిపించడం లేదు.. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పోలీస్ బృందాలు తరచూ రైడ్లు నిర్వహిస్తున్నప్పటికీ, డ్రగ్స్ చొరబాటు ఆగడం లేదు. అంతర్జాతీయ మాఫియాల వరకు ఈ నెట్‌వర్క్ విస్తరించి ఉండటమే ప్రధాన కారణం.. అదే ఇప్పుడు సవాలుగా మారిపోయింది.. ఈ క్లిష్ట పరిస్థితుల్లో.. తల్లి దండ్రులు పిల్లలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి.. పోలీసులు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అంతే కాకుండా యువతకు సరైన దిశా నిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. ఒకవైపు ప్రభుత్వం రైడ్లు, అరెస్టులు చేస్తుంటే, మరోవైపు డ్రగ్స్ మాఫియాలు మరింత బలంగా వేర్లు వేస్తుండటమేంటి? దీనికి సమాధానం స్పష్టంగా అర్థం అవుతూ వుంది.. మన సమాజం నిర్లక్ష్యం. తల్లి దండ్రులు పిల్లలపై శ్రద్ధ తగ్గించారు, విద్యాసంస్థలు కేవలం మార్కులపైనే దృష్టి పెడుతున్నాయి, పోలీసులు, అధికారులు కొంతమంది లాభాల కోసం కళ్ళు మూస్తున్నారు. ఈ డ్రగ్ సంస్కృతి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక తరం మొత్తాన్ని నాశనం చేసే శక్తి కలిగి ఉంది. డ్రగ్స్ లేని హైదరాబాద్ అనే లక్ష్యం కేవలం నినాదం కాకుండా, ఒక సామూహిక బాధ్యత కావాలి. లేనిపక్షంలో, ఐటీ నగరంగా ప్రపంచంలో పేరొందిన హైదరాబాద్, త్వరలోనే "డ్రగ్స్ సిటీ" అనే చెడు ముద్రను తప్పించుకోలేకపోతుంది. డ్రగ్ వినియోగాన్ని కఠినంగా నిరోధించే చట్టాలు కఠినంగా అమలు కావాల్సిన అవసరం ఎంతో ఉంది.. హైదరాబాద్ అభివృద్ధి, ఆధునికత పేరుతో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోతే భవిష్యత్తు తరాలు ప్రమాదంలో పడతాయి. కాబట్టి ఇది కేవలం ప్రభుత్వమే కాక, సమాజమంతటికీ ఎదురైన ఒక పెద్ద సవాలు. ఈ సవాలును స్వీకరిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ ..



## బాల్య వివాహాలకు చెక్ పెడదాం..
# చిన్నారుల భవిష్యత్తు కాపాడుదాం!





- **హైకోర్ట్ న్యాయమూర్తి పి.శామ్ కోషి**

**ఎల్బీనగర్, ఆగష్టు 23 (భారత శక్తి):** చైల్డ్ మ్యారేజ్ నిర్మూలనకు ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు రంగారెడ్డి జిల్లాలోని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు పి.శామ్ కోషి, అభినంద్ కుమార్ శవిలి, చలపతి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన న్యాయమూర్తి పి. శామ్ కోషి మాట్లాడుతూ, నేడు ఇక్కడ మనం చర్చిస్తున్న విషయం — బాల్య వివాహాల నిర్మూలన — ఇది చట్టపరమైన సమస్య మాత్రమే కాదు, ఇది ఒక సామాజిక, మానవతా సమస్య కూడా. ఇది ఒక కుటుంబం జీవితాన్ని మాత్రమే కాదు, ఒక తరం భవిష్యత్తును శాశ్వతంగా ప్రభావితం చేసే ఘోరమైన పని. మన దేశ చట్టం ప్రకారం, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాల వయస్సు నిండకముందే వివాహం చేయడం చట్టపరంగా నేరం. కానీ ఈ చట్టం ఉన్నప్పటికీ, అనేక తండాలలో, గ్రామాల్లో, పట్టణాల్లో ఇంకా ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. అవి ఏ రూపంలో ఉన్నా, అవి నిషేధించబడాల్సినవే. చైల్డ్ మ్యారేజ్ వల్ల కలిగే అనర్థాలు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిన్న వయస్సులో అమ్మాయిలకు వివాహం చేస్తే వారి విద్య ఆగిపోతుంది. ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి, కాని తల్లిదండ్రులు అవగాహన లేకుండానే, భయం మీద ఆధారపడి తక్షణ నిర్ణయాలు తీసుకుంటారు. ఆత్మవిశ్వాసం కోల్పోవడం, ఆర్థిక దారిద్ర్యంలో ఇరుక్కుపోవడం, గృహ హింసకు గురవడం వంటి సమస్యలు వారిని వెంటాడుతుంటాయి. ఈ పరిస్థితులను మార్చాలంటే, న్యాయవ్యవస్థ మాత్రమే కాదు, సమాజం మొత్తం కలిసికట్టుగా స్పందించాలి. ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, యువత, ఆంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారా లీగల్ వాలంటీర్స్ ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. న్యాయమూర్తులు అభినంద్ కుమార్ శవిలి, చలపతి రావు కూడా చైల్డ్ మ్యారేజ్ వ్యతిరేక చట్టాలు, సామాజిక బాధ్యతల గురించి వివరంగా ప్రసంగించారు. వారు సమాజం అందరిలో కూడా ఈ విషయంలో చైతన్యవంతమైన మార్పు రావాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి మాట్లాడుతూ, "చైల్డ్ మ్యారేజ్ నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా లీగల్ సర్వీసెస్ అధికారం కృషి చేస్తోంది. చట్ట పరిజ్ఞానంతో పాటు, బాధితులకు న్యాయ సహాయం అందించడమే మా లక్ష్యం" అని వివరించారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ మాట్లాడుతూ,"చైల్డ్ మ్యారేజ్ వల్ల బాలికలు విద్యను కోల్పోతారు, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఇది మన సమాజం ఎదుగుదలపై ప్రభావం చూపే అంశం. అందుకే ఇది తక్షణం నిర్మూలించాలి" అని అన్నారు.ఈ కార్యక్రమాన్ని మెంబర్ సెక్రటరీ పంచాక్షరి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ మార్గదర్శకత్వంలో,జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రంగారెడ్డి ఇన్చార్జ్ సెక్రటరీ శ్రీమతి శ్రీవాణి నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఒక సామాజికంగా సానుభూతి కలిగించే ఘట్టం చోటుచేసుకుంది. జన్మతః డయాబెటిస్తో బాధపడుతూ ఒక కాలిని కోల్పోయిన లికిత అనే బాలికకు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రంగారెడ్డి వారు వీల్ చైర్ అందజేశారు. అలాగే, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో జనరల్ సెక్రటరీ కార్తిక్ సహకారంతో, లికితకు రూ.25,000/ ఆర్థిక సహాయం అందించారు.ఈ మానవతా చర్యను వేదికపై ఉన్న న్యాయమూర్తులు ఎంతో అభినందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పారా లీగల్ వాలంటీర్లకు వారి సేవలకు గుర్తింపుగా న్యాయమూర్తులు అభినందన పత్రాలు అందజేశారు.కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా న్యాయమూర్తులు, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్ కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఆంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారా లీగల్ వాలంటీర్స్, పోలీస్ శాఖ, న్యాయశాఖ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.కార్యక్రమ ముగింపులో శ్రీమతి శ్రీవాణి ఇన్చార్జ్ సెక్రటరీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ రంగారెడ్డి,ఈ ప్రాశస్త్య కార్యక్రమానికి విచ్చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## బీసీ కమిషన్ చైర్మన్... సీఐకి కంప్లైంట్ ఇచ్చిన కార్పొరేటర్ భాదితుడు



ఎల్బీనగర్, ఆగష్టు 23 (భారత శక్తి): బహుజన బీసీ బిడ్డనైన నన్ను దూషించినందుకు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మీద తగు చర్యలు తీసుకోవాలని దూదిమెట్ల శివ యాదవ్ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ ని వ్యక్తిగతంగా కలిసి వారికి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డితో ఉండే గంజాయి బ్యాచ్,ఆయన అనుచరులు నాకు ప్రాణ హాని తలపెట్టే అవకాశం ఉన్నందున, వారి నుండి నాకు రక్షణ కల్పించాలని కోరడం జరిగింది.నాకు అండగా నిలుస్తున్న రాష్ట్ర బీసీ నాయకులకు, ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ బీసీ బిడ్డపై జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడానికి, ఎదిరించడానికి మీరందరూ కూడా నాకు అండగా ఉండాలని కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి బీసీ సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు ఓరుగంటి వెంకటేశం వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు..

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.